ఫిబ్రవరి
2022

190

సంపుటి : 16 సంచిక : 9 వెల రు. 10/-

## ఈ సంచికలో........

ప్రజల, దేశ రక్షణ కోసమే మార్చి 28,29 సమ్మె
మోడీ విధానాలను ప్రశ్నించడానికి సగటు ప్రజలు ముందుకొస్తున్నారు
వామపక్షాల పయనం ఎటు?
రెండు సంక్షోభాలు - ఒకే వ్యూహం
నయా-సామ్రాజ్యవాదం: దోపిడీ తీవ్రతరం
రైతుల ఆత్మహత్యలు : ఒక అధ్యయనం
భిన్న సంస్కృతుల మధ్య అడ్డుగోడలు
పార్టీ 6వ మహాసభ: చివరి ఐక్య మహాసభ

# పార్టీ 6వ మహాసభ: చివరి ఐక్య మహాసభ

భారత కమ్యూనిస్టు పార్టీ ఐదు, ఆరు మహాసభల మధ్య కాలంలో దేశ రాజకీయాలలో, అంతర్గతంగా కమ్యూనిస్టు పార్టీలోనూ ప్రధానమైన సంఘటనలు ఎన్నో జరిగాయి. అమృత్‌సర్ మహాసభ తరువాత భారత రాజకీయ ముఖచిత్రాన్ని ప్రభావితం చేసిన రెండు ప్రధాన సంఘటనలలో ఒకటి కేరళ రాజకీయ పరిణామాలు. రెండోది దిగజారిన భారత చైనా సంబంధాలు. కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దు చేయటాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ ఐక్యంగా దేశమంతటా నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. కాని దిగజారిన భారత, చైనా సంబంధాలు పార్టీలో విబేధాలను తీవ్రతరం చేశాయి.

పార్టీ నిర్వహించిన ఇతర ప్రచారాలన్నింటి కన్నా కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ప్రచారం అత్యంత విస్తృతంగా జరిగింది. ఇటువంటి పరిస్థితిలో భారత్, చైనాల మధ్య ఏర్పడ్డ సరిహద్దు వివాదాన్ని కమ్యూనిస్టులపై దాడి చేయడానికి కాంగ్రెస్, ఇతర మితవాద శక్తులు వినియో గించుకున్నాయి.

కమ్యూనిస్టులపై మితవాద శక్తులు, కాంగ్రెస్ పార్టీ కలిసి ఎంత విషప్రచారం చేసినప్పటికీ, కామ్రేడ్ నంబూద్రిపాద్ ప్రచారంలో పాల్గొన్న ప్రతిచోటా ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి ఆయనకి అభినందనలు తెలిపారు. పార్టీ అంచనాలకు మించి కేరళ ఎన్నికలకు నిధులు వసూలయ్యాయి. శాసనసభ ఎన్నికలలో పార్టీ ఓడిపోయినా (1960) 3 శాతం ఓట్లు పెరిగాయి.

పంజాబ్‌లో బెటర్మెంట్(అభివృద్ధి) లెవీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో పాటు తమిళనాడు, బీహార్, బెంగాల్‌లలో భూ పరిమితి, భూ సంస్కరణల చట్ట సవరణలు వంటి నిర్దిష్ట డిమాండ్లపై పార్టీ రైతాంగాన్ని చురుకుగా కదిలించింది. అనేక రాష్ట్రాలలో పాదయాత్రలు నిర్వహించింది. ఈ ఉద్యమాల ఫలితంగా పశ్చిమ బెంగాల్‌లోని ప్రభుత్వం లక్షలాది ఎకరాల భూమిని దున్నేవారికి ఉచితంగా పంచ వలసి వచ్చింది.

1960 జులైలో జరిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె చాలాకాలం తరువాత కార్మికవర్గం నిర్వహించిన అతి పెద్ద కార్యాచరణ. ఇందులో పార్టీ జోక్యం చేసుకుంది. ధరలకనుగుణంగా కరువు భత్యం పెంచాలని, జీవనానికి సరిపోయే కనీస వేతనాలు డిమాండ్ చేస్తూ మొట్టమొదటి సారిగా అన్ని రంగాల్లోని ప్రభుత్వోద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. రక్షణ విభాగ ఉద్యోగులు కూడా ఈ సమ్మెలో పాల్గొన్నారు. రైల్వే సేవలకు తీవ్రమైన అంతరాయం ఏర్పడింది. దీనితో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రమైన అణచివేత చర్యలు మొదలుపెట్టింది. 21,000 మందిని ఖైదు చేసింది; ఏడుగురు హత్యకు గురయ్యారు. సైద్ధాంతికంగా, నిర్మాణపరంగా తగిన విధంగా సన్నద్ధం కాకపోవడం వలన సమ్మెకు మద్దతుగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించలేకపోయామని పార్టీ ఆత్మ విమర్శనా పూర్వకంగా సమీక్ష చేసుకుంది. ఈ మూడేళ్ళ కాలంలో అనేక రంగాలలో కార్మికులు కార్యాచరణలలో పాల్గొనడం, అనేక కార్మికసంఘాలు కలిసి ఐక్య కార్యాచరణలో పాల్గొనడం చూశాం.

ఈ కార్యాచరణ ఫలితంగా అనేక రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికలలో పార్టీ మంచి ఫలితాలు సాధించింది. అందులో ప్రధానమైనది భోపాల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో సాధించిన విజయం. మిత్రపక్షాలతో కలిసి పార్టీ భోపాల్ మునిసిపాలిటీలో మెజారిటి సాధించింది. అదే విధంగా ముంబై మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలోనూ పార్టీ 18 సీట్లు సంపాదించింది. ఇక్కడ సంయుక్త మహారాష్ట్ర వేదికలో భాగంగా పార్టీ పోటీచేసింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడాలని పార్టీ చేసిన పోరాటం, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలు ఏర్పడడానికి చేసిన కృషి ఇంతటి మంచి ఫలితాలు రావడానికి కారణం.

1959 మార్చి, 1961 ఫిబ్రవరిల మధ్య కాలంలో భారతదేశం, చైనాల మధ్య సరిహద్దు వివాదాన్ని వివరిస్తూ పార్టీ పది ప్రకటనలు విడుదల చేసింది. ఛాంగ్ కైషేక్, అమెరికాల మద్దతుతో దలైలామా నేతృత్వంలోని శక్తులు చేసిన తిరుగుబాటు విఫలమవడం, భారతదేశం చైనాల మధ్య స్నేహ సంబంధాలు చెదిరిపోడానికి కొంతవరకు కారణం అని ఈ ప్రకటనలు తెలియచేశాయి. హిందూ మహాసభ, జనసంఘ్, స్వతంత్రపార్టీ మొదలైన వాటితో పాటు కాంగ్రెస్‌లోని మితవాదులు టిబెట్‌లో జరుగుతున్న పరిణామాలను వక్రీకరించారు. వారి మితవాద లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు జరిగిన పరిణామాలను వినియోగించుకున్నారు. చైనాకి వ్యతిరేకంగా తమ రాజకీయ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు తిరుగుబాటుదారులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని, భారతదేశాన్ని స్థావరంగా చేసుకుని 'టిబెట్ ప్రభుత్వంగా' కార్యక్రమాలు నిర్వహించుకొనేందుకు అనుమతివ్వాలని వీరు డిమాండ్ చేశారు. ఈ శక్తులు భారతదేశ విదేశాంగ విధానంపై, భారతదేశం, చైనాకు మధ్య జరిగిన పంచశీల ఒప్పందంపై దాడిచేశాయి. ఈ పరిస్థితులలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు రగుల్కొన్నాయి; సరిహద్దులు నిర్దిష్టంగా గుర్తించబడని హిమాలయ ప్రాంతంలో దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకున్నాయి.

'పరస్పర చర్చల ద్వారా సరిహద్దు

**(మిగతా 34వ పేజీలో)**

## ఈ సంచికలో...


1. పార్టీ 6వ మహాసభ: చివరి ఐక్య మహాసభ ..... 2

2. ప్రజల, దేశ రక్షణ కోసమే మార్చి 28,29 సమ్మె
డా॥ కె. హేమలత ..... 4

3. మోడీ విధానాలను ప్రశ్నించడానికి సగటు ప్రజలు ముందుకొస్తున్నారు
డా॥ థామస్ బ్లామ్ హాన్‌సెన్‌తో ఇంటర్వ్యూ...9

4. వామపక్షాల పయనం ఎటు?
ఎస్ వీరయ్య ........16

5. రెండు సంక్షోభాలు - ఒకే వ్యూహం
ఎస్. వెంకట్రావు ........19

6. నయా-సామ్రాజ్యవాదం: దోపిడీ తీవ్రతరం
చెన్ ఎన్ ఫ్యూ, లూబావో లిన్.....24

7. రైతుల ఆత్మహత్యలు : ఒక అధ్యయనం
ధన్యాందేవ్ తలులే ..........28

8. భిన్న సంస్కృతుల మధ్య అడ్డుగోడలు
సచ్చిదానంద మహంతి........32



**సంపాదకుడు :**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం :**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 9490099333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# విద్రోహం

**త**న స్వంత ప్రజలపై నిరంతరం నిఘాపెట్టి పాలిస్తున్న ఏ ప్రభుత్వాన్నీ ప్రజాస్వామ్య ప్రభుత్వం అనరు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసే విద్రోహ ప్రభుత్వం అంటారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలకు అడుగడుగునా ద్రోహం చేస్తున్న తీరును సరికొత్తగా పెగాసస్ గూఢచారి సాఫ్ట్‌వేర్ ఉదంతం తేటతెల్లం చేస్తున్నది. ఇజ్రాయిల్ నుండి ఈ సాఫ్ట్ వేర్‌ను కొనుగోలు చేసిన మోడీ ప్రభుత్వం దాన్ని దేశంలోని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు... ఒకరేమిటి అన్ని రంగాల్లోని ప్రజలపై గూఢచర్యం నిర్వహించడానికి ఉపయోగిస్తున్నదని గతంలో ది వైర్ పత్రికలో ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలకు సమాధానాలు చెప్పకుండా దాటవేసిన ప్రభుత్వం తాజాగా న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాసిన పరిశోధనా వార్త విషయంలో కూడా అదే వైఖరి అనుసరిస్తోంది. ఇజ్రాయిల్‌తో రక్షణ ఒప్పందంలో భాగంగా ఈ గూఢచారి సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసినట్లు పత్రిక రాసింది. ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులు హరించడానికి దీన్ని ఉపయోగిస్నున్నది.

మోడీ ప్రభుత్వం భారత ప్రజలకు చేసిన ద్రోహం ఇదొక్కటే కాదు. రైతులకు మేలు చేసే పేరుతో మొత్తం వ్యవసాయాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగించే చట్టాలు చేసిన ప్రభుత్వం వాటిని పార్లమెంటులో అత్యంత అప్రజాస్వామిక పద్ధతిలో ఆమోదింపజేసుకుంది. యావత్ భారత రైతాంగం ఎదురుతిరిగి ఏడాది పాటు వీధుల్లోకి వచ్చి పోరాడ్డంతో వెనక్కు తగ్గింది. 44 కార్మిక చట్టాలను రద్దు చేసే విషయంలో కూడా ఇదే రకమైన విద్రోహానికి పాల్పడింది. చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లు ప్రవేశపెట్టడం ద్వారా కార్మిక రంగాన్ని సంస్కరిస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఆ కోడ్‌లన్నీ కార్మికులకు వ్యతిరేకం, కార్పొరేట్‌లకు అనుకూలమైన నిబంధనలతో నిండిపోయాయి. బడ్జెట్ లోటు పూడ్చుకోడానికి అనే నెపంతో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేయడం ప్రారంభించింది. కానీ బడ్జెట్‌కు లోటు ఎందుకు వస్తున్నది? బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు పన్నులు తగ్గించడం ద్వారా, రాయితీలు ఇవ్వడం ద్వారా లక్షల కోట్ల రూపాయల ఆదాయం తగ్గుతోంది. కార్పొరేట్లు ఆ విధంగా రాయితీలు పొందిన సొమ్ముతోనూ, బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్మును చేజిక్కించుకోవడం ద్వారానూ ప్రభుత్వ రంగ సంస్థలను కొనుగోలు చేస్తున్నారు. గంగి గోవుల్లాంటి ప్రభుత్వం రంగ సంస్థలను మార్కెట్ రేటుకన్నా కారుచౌకగా మోడీ ప్రభుత్వం అమ్మేస్తున్నది. ఆంధ్రులు ఎన్నో త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును కారుచౌకగా అమ్మకానికి పెట్టింది. రైల్వేలు, పోర్టులు, మౌలిక సదుపాయాలు... ఒకటేమిటి కీలకమైన అన్ని రంగాలను కార్పొరేట్లకు ద్రోహపూరిత ఒప్పందాల ద్వారా దారాదత్తం చేస్తున్నది.

తాజాగా జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)ని అమ్మేయడానికి దొడ్డిదోవలో చేసిన ప్రయత్నం మోడీ ప్రభుత్వ ద్రోహబుద్ధికి పరాకాష్ట. 1956లో కేవలం రూ.5 కోట్ల ప్రభుత్వ పెట్టుబడితో ప్రారంభమైన ఎల్ఐసి ఈనాడు 40 కోట్ల పాలసీ దారులను కలిగి ఉంది. ఇది దేశ జనాభాలో 30 శాతం. ఎల్ఐసిలో తమ సొమ్ము భద్రంగా ఉంటుందనీ, అక్కర వచ్చినప్పుడు ఉపయోగపడుతుందన్న నమ్మకంతో అంతమంది ప్రజలు ఎల్ఐసిని వినియోగించుకుంటున్నందునే ఈనాడు ఆ ప్రభుత్వ రంగం సంస్థ రూ. 38 లక్షల కోట్ల ఆస్తులతో, ఏడాదికి 4 లక్షల కోట్ల రూపాయల ఆదాయం ఆర్జిస్తున్నది. ఇటువంటి సంస్థను కూడా స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు దారాదత్తం చేయడానికి నేరుగా చట్టం ద్వారా కాకుండా గత ఏడాది బడ్జెట్ సందర్భంగా ఫైనాన్స్ బిల్లులో కలిపి ప్రవేశపెట్టింది. అలా అయితే చట్టం చేయాల్సిన, దానిపై దేశవ్యాపితంగా చర్చ జరగాల్సిన అవసరం ఉండదు. ఈ విధంగా ఇంత పెద్ద సంస్థను దొడ్డిదారిలో అమ్మడం కన్నా దేశ ద్రోహం ఇంకేముంటుంది?

విద్యా రంగాన్ని వక్రీకరించడం, న్యాయవ్యవస్థ, రక్షణ వ్యవస్థ, ఇతర అన్ని వ్యవస్థల్లోకి ఆర్ఎస్ఎస్ క్యాడర్‌ను అక్రమపద్ధతుల్లో చొపించడం, శాస్త్రీయ భావజాలంపై దాడులకు తెగబడడం...ఇవన్నీ ఆర్ఎస్ఎస్-బిజెపి విద్రోహ చర్యల్లోభాగమే. బిజెపి దాని మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ ప్రస్థానం స్వాతంత్ర్యోద్యమంలో దేశద్రోహంతోనే ప్రారంభమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 75 ఏళ్ల కాలంలో దాని ప్రతి చర్యా ప్రజలకు వ్యతిరేకంగానే సాగుతున్నది. అధికారంలోకి వచ్చిన తరువాత ఒకవైపు ప్రజల సొమ్మును కార్పొరేట్లకు దోచిపెడుతూ మరోవైపు ప్రజల దృష్టిని మళ్లించడానికి మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నది. ఈ విద్రోహ చర్యలను ఎండగట్టి, ప్రజల నుండి ఆ పార్టీనీ, దాన్ని సిద్ధాంతాన్ని వేరుచేయడం నేడు దేశభక్తుల ముందున్న ప్రధాన కర్తవ్యం.

**ఈ మాసం ముఖ్యాంశం**

# ప్రజల, దేశ రక్షణ కోసమే మార్చి 28,29 సమ్మె

**డా॥ కె. హేమలత**



రచయిత సిఐటియు అఖిలభారత అధ్యక్షులు

**2021** నవంబరు 11న ఢిల్లీలో జాతీయ కార్మిక సదస్సు జరిగింది. కేంద్ర కార్మికసంఘాల ఉమ్మడి వేదిక, అఖిల భారత స్థాయి స్వతంత్ర ఫెడరేషన్‌లు అన్నీ కలసి ఈ సదస్సును నిర్వహించాయి. 2022 పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఫిబ్రవరి 23-24 తేదీలలో రెండు రోజుల పాటు సార్వత్రిక సమ్మె జరపాలని తొలుత సదస్సు పిలుపునిచ్చింది. అయితే దేశంలో కరోనా మూడో వెల్లువ, అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమ్మెను మార్చి 28,29 తేదీలకు వాయిదా వేసింది. 'ప్రజలను కాపాడండి, దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో సమ్మె జరుగనున్నది.

1991లో నయా వుదారవాద సంస్కరణలు ప్రవేశపెట్టాక కార్మికవర్గం చేస్తున్న 21వ దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె ఇది. ఈ సమ్మెలో ప్రధాన డిమాండ్లు ఇలా వున్నాయి :

– లేబరు కోడ్‌లను రద్దు చేయాలి.

– అత్యవసర రక్షణ సేవల చట్టాన్ని రద్దు చేయాలి.

– ప్రైవేటీకరణ, జాతీయ నగదీకరణ పైప్ లైన్‌ను ఆపివేయాలి.

– వ్యవసాయం, విద్య, వైద్యం వంటి కీలక రంగాలకు ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి.

– మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టం అమలుకు నిధుల కేటాయింపును పెంచాలి. ఈ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాలి.

– సంపన్నులపై 'సంపద పన్ను' విధించటం ద్వారా పైచట్టం అమలుకు ఆర్థిక వనరులను సమీకరించాలి.

తద్వారా జాతీయ ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించి, పరిపుష్టం చేయవచ్చు.

– పెట్రోలియం ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని గణనీయంగా తగ్గించాలి. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను అరికట్టాలి.

– జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దు చేయాలి. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి.

గత దశాబ్ద కాలానికి పైగా ఉమ్మడి కార్మికోద్యమం నిరంతరం ప్రతిపాదిస్తున్న డిమాండ్లతో పాటు, పై డిమాండ్లను జాతీయ కార్మిక సదస్సు ఆమోదించిన ప్రకటన పునరుద్ఘాటించింది. కార్మికులందరికీ కనీస వేతనాలు, సార్వత్రిక సామాజిక భద్రత, కాంట్రాక్టు కార్మికుల సర్వీసు క్రమబద్ధీకరణ, స్కీం వర్కర్లను సంబంధిత సకల ప్రయోజనాలకు అర్హులైన 'కార్మికులు'గా గుర్తించటం వంటి డిమాండ్లన్నీ అందులో వున్నాయి. కోవిడ్ విపత్తు, తద్వారా విధించబడుతున్న లాక్‌డౌన్‌లు, ఆంక్షల మూలంగా జీవనోపాధి, ఆదాయాలను కోల్పోతున్న వారందరికీ ఉపశమనం కల్పించాలి. అందుకు అనుగుణంగా నగదు బదిలీ ద్వారా ప్రజల ఆదాయాలను పెంచటం, అవసరమైన వారందరికీ ఉచిత ఆహార ధాన్యాలను సరఫరా చేయాలన్న డిమాండ్లు కూడా ఉమ్మడి కార్మికోద్యమం నిరంతరంగా ముందుకు తెస్తున్నది.

నేటి కార్మికవర్గం కేవలం తన తక్షణ డిమాండ్లైన కొన్ని ఆర్థిక కోర్కెలు, పని ప్రదేశంలో ఎదురౌతున్న సమస్యలు, ప్రయోజనాలు, హక్కులకే పరిమితమై పోరాడటం లేదు. పైన పేర్కొన్న డిమాండ్లు అన్ని తరగతుల శ్రమజీవుల ప్రధాన డిమాండ్లతో మిళితమై వున్నాయి. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్భాగమైన నయా వుదారవాదంతో పై అంశాలన్నీ ముడిపడి వున్నాయి. సామాన్య ప్రజలకు వినాశకరంగా మారినందున నయా ఉదారవాదం ప్రపంచ వ్యాపితంగా అప్రదిష్ట పాలైంది. అందుచేత ఈ డిమాండ్లను సాధించాలంటే నయా ఉదారవాద విధానానికి ముగింపు పలకాలి.

1991లో పివి నరసింహారావు నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సరళీకరణ విధానాలను దేశంలో ప్రవేశపెట్టిన వెంటనే ఆ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య కార్మికోద్యమం పోరాటాలను ప్రారంభించింది. 1991 నవంబరు 29న తొలి దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె జరిగింది. గత మూడు దశాబ్దాలుగా సడలని పట్టుదలతోనూ, నిలకడగానూ ఐక్య కార్మికోద్యమం తన పోరాటాన్ని కొనసాగిస్తున్నది. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదికతో పాటు దాదాపు అన్ని రంగాల స్వతంత్ర ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో 2020, నవంబరు 26న 20వ జాతీయ సమ్మె జరిగింది. ఈ వరుస సమ్మెల్లో పాల్గొంటున్న పారిశ్రామిక క్లస్టర్లు, రంగాలతో పాటు, కార్మికుల సంఖ్య కూడా నిరంతరంగా పెరుగుతున్నది. ఈ సమ్మెలకు ప్రజల నుండి విస్తారమైన మద్దతు లభిస్తున్నది. దేశంలో తమకు ఎక్కువ సభ్యత్వం వుందని చెప్పుకుంటున్న ఐఎన్‌టియుసి, బిఎంఎస్‌లు 1991 కార్మిక సంఘాల ఉమ్మడి వేదికలో పాలుపంచుకోలేదు. ఆ రెండు సంస్థలూ 2009లో మాత్రమే కార్మిక సంఘాల ఉమ్మడి వేదికలో చేరాయి. ఈ కాలంలో ఆ వేదిక ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా అనేక దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలు, పోరాటాలను నడిపింది.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాక 2015 సెప్టెంబరు 2న జరిగిన సార్వత్రిక సమ్మెకు కొద్దికాలం ముందు ఉమ్మడి కార్మికోద్యమం నుండి బిఎంఎస్ నిష్క్రమించింది. బిఎంఎస్ భాగస్వామిగా వున్న 'కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక' ఆ సమ్మె పిలుపునిచ్చిందని గమనించాలి. ఉమ్మడి కార్మిక వేదిక నుండి బిఎంఎస్ నిష్క్రమించిన తర్వాత కూడా బిఎంఎస్ సభ్యులతో పాటు, వారి పలు అనుబంధ సంఘాలు కూడా సమ్మెల్లో

పాల్గొంటున్నాయి. ఈ ఒరవడి ఐక్య పోరాటాల పట్ల సాధారణ కార్మికుల్లో పెరుగుతున్న అభిలాషను సూచిస్తున్నది. అంతేకాదు, యూనియన్ అనుబంధాలతో నిమిత్తం లేకుండా సమస్యలు, డిమాండ్లపై పని ప్రదేశాలలో కార్మికులందరి మధ్య ఐక్యతను నిర్మించాల్సిన ప్రాధాన్యతనూ పై ధోరణి తెలియజేస్తున్నది. కొన్ని సంఘాలు, వాటి నాయకుల్లోని ఊగిసలాటలను అధిగమించేందుకు, పోరాటాలను ఉధృతం చేసేందుకు క్షేత్ర స్థాయి కార్మికుల ఐక్యత మాత్రమే ఉమ్మడి కార్మికోద్యమ నిర్మాణానికి ఉపకరిస్తుంది.

> ❝ ప్రభుత్వ విధానాలతో తమ సమస్యలు ముడివడి వున్నాయన్న వాస్తవాన్ని కార్మిక వర్గంలోని అత్యధికులు గుర్తించే క్రమంలో వున్నారు. గత మూడు దశాబ్దాల 'నయా-ఉదారవాద విధానాల' అనుభవం అందుకు తోడ్పడుతున్నది. నయా-ఉదారవాద 'వ్యవస్థ'పై పోరాటం ఎక్కుపెట్టకుండా, కేవలం దాని 'ప్రభావాల'పై మాత్రమే సాగించే పోరాటాలతోనే తమ దైనందిన సమస్యలను పరిష్కరించుకోవటం అసాధ్యమని కార్మికవర్గం గుర్తిస్తున్నది. ఆ చైతన్యం క్రమంగా పెరుగుతున్నది. ❞

ప్రభుత్వ విధానాలతో తమ సమస్యలు ముడివడి వున్నాయన్న వాస్తవాన్ని కార్మిక వర్గంలోని అత్యధికులు గుర్తించే క్రమంలో వున్నారు. గత మూడు దశాబ్దాల 'నయా-ఉదారవాద విధానాల' అనుభవం అందుకు తోడ్పడుతున్నది. నయా ఉదారవాద 'వ్యవస్థ'పై పోరాటం ఎక్కుపెట్టకుండా, కేవలం దాని 'ప్రభావాల'పై మాత్రమే సాగించే పోరాటాలతోనే తమ దైనందిన సమస్యలను పరిష్కరించుకోవటం అసాధ్యమని కార్మికవర్గం గుర్తిస్తున్నది. ఆ చైతన్యం క్రమంగా పెరుగుతున్నది.

2022 ఫిబ్రవరి 23-24 సార్వత్రిక సమ్మెకు ఉమ్మడి కార్మికోద్యమం రూపొందించిన డిమాండ్ల రూపకల్పనలోనూ పై అవగాహనే ప్రతిబింబిస్తున్నది. వినాశకరమైన నయా ఉదారవాద విధానాలు కార్మికుల జీవితాలు, జీవనోపాధులపైనేగాక మొత్తం దేశంపైనా, ఆర్థికవ్యవస్థ, శ్రామిక ప్రజలందరినీ ప్రభావితం చేస్తున్నది. ఈ అంశంపై నేటి కార్మికోద్యమంలో వుమ్మడి అవగాహన నెలకొంటున్నది. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ వంటి విధాన పరమైన అంశాలను సమ్మె డిమాండ్లలో చేర్చటాన్ని మొదట కొన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. కాని అనంతర కాలంలో నయా ఉదారవాద విధానాలు, చివరకు పని పరిస్థితులు, కష్టించి సాధించిన కార్మిక హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై పోరాడేందుకు కూడా ఉమ్మడి కార్మికోద్యమంలో ఏకాభిప్రాయం ఏర్పడుతున్నది.

సమైక్య రైతు పోరాటం మోడీ ప్రభుత్వం మెడలు వంచి మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయించటం ద్వారా గొప్ప చారిత్రక విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి సమ్మె జరుగనున్నది. ఈ మూడు చట్టాలూ 'నయా ఉదారవాద పథకం'లో భాగమే. తద్వారా చిన్న రైతుల అధీనంలోని వ్యవసాయాన్ని దేశ, విదేశీ కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు, వారిని బహుళజాతి కంపెనీల దయాదాక్షిణ్యాలకు వదిలేసేందుకు ఆ వ్యవసాయ చట్టాలు ఉద్దేశించబడ్డాయి. అవి రైతులను, ముఖ్యంగా చిన్న రైతులను నాశనం చేస్తాయి. అంతేకాదు, పేదల ఆహార భద్రతకు, అనేక రంగాల్లో పెద్ద సంఖ్యలోగల అసంఘటిత రంగ కార్మికులకు కూడా అపార నష్టం కల్గిస్తాయి.

ఐక్య రైతాంగ పోరాటం ఆరంభమైన తొలి రోజు నుండే దేశంలోని కార్మికవర్గం నిరంతరం దానికి అండగా నిలిచింది. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) ఇచ్చిన ప్రతి కార్యాచరణ పిలుపునూ కార్మికవర్గం బలపరచింది. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా వుద్యమం సాగే క్రమంలోనే ఎస్‌కెఎం రూపుదాల్చింది. దేశ వ్యాపితంగా మనుగడలో ఉన్న దాదాపు 500 రైతు సంఘాలతో ఏర్పడిన వేదిక అది. ఆ పోరాటానికి కార్మికవర్గం అందించిన అండదండలు కేవలం పత్రికా ప్రకటనలు జారీ చేసేందుకు, రైతు ప్రదర్శనల్లో నాయకుల ఉపన్యాసాలకే పరిమితం కాలేదు. యస్‌కెయం ఇచ్చిన భారత్ బంద్, జైల్‌భరో వంటి కార్యక్రమాలన్నింటా వేలాది కార్మికులు భౌతికంగా పాల్గొన్నారు. ఉమ్మడి కార్మికోద్యమం, ఎస్‌కెఎంలు తమ పిలుపులను సమన్వయం చేసుకున్నాయి. 2020 నవంబరు 26న 'కార్మిక సంఘాల ఐక్య వేదిక' దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. అదే రోజున 'ఛలో ఢిల్లీ' పిలుపుతో ఎస్‌కెఎం వేలాదిమంది రైతాంగాన్ని సమీకరించింది. వారిని దేశ రాజధానిలోకి ప్రవేశించ కుండా బిజెపి ప్రభుత్వం ఆటంక పరచింది. దానితో వారు ఢిల్లీ సరిహద్దుల్లోనే బైఠాయించి ధర్నాను ప్రారంభించారు.

మూడు నల్ల చట్టాల రద్దు, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కల్పన, విద్యుత్ బిల్లు రద్దు వంటి రైతాంగ డిమాండ్లను 'కార్మిక సంఘాల ఐక్య వేదిక' తన డిమాండ్ల జాబితాలో చేర్చుకుంది. 2020 నవంబరు 26 దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెతో పాటు సంయుక్త కార్మికోద్యమం నిర్వహించిన ప్రతి కార్యక్రమంలోను ప్రధాన డిమాండ్లలో రైతాంగ డిమాండ్లు భాగమై మారుమోగాయి. కార్మికుల్లోను, పట్టణ ప్రాంత విశాల ప్రజానీకంలోను రైతాంగ డిమాండ్లను విస్తారంగా ప్రచారం చేయటంలో కార్మికవర్గం ముఖ్యమైన పాత్ర పోషించింది. దానితో పాటు రైతాంగ పోరాటానికి విశాల మద్దతును కూడగట్టేందుకు, దాన్నొక ప్రజా వుద్యమంగా మార్చేందుకు కూడా కార్మికవర్గం కృషి సల్పింది. ఢిల్లీ సమీప రాష్ట్రాలకే పరిమితం కాకుండా, సుదూరంలోని అన్ని దక్షిణాది రాష్ట్రాల నుండి కూడా వేలాదిమంది కార్మికులు దేశ రాజధానికి తరలి వచ్చారు. పోరాడే రైతాంగానికి మద్దతుగా అనేక రోజుల పాటు సంఘీభావం తెల్పుతూ ఢిల్లీ సరిహద్దుల్లోని ధర్నా శిబిరాల్లోనే ఉండిపోయారు. కార్మికవర్గం ఈ వీరోచిత వుద్యమానికి ఆర్థిక సహకారాన్ని కూడా అందించింది. స్వల్ప వేతనాలు పొందే స్కీం వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికుల నుండి, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉద్యోగుల వరకూ అన్ని తరగతుల శ్రామిక వర్గమూ కలసి ఈ పోరాటానికి కోట్లాది రూపాయల సహకారం అందించి బాసటగా నిలిచారు.

'లేబరు కోడ్‌లను రద్దు చేయాలి', 'ప్రైవేటీకరణను ఆపాలి' వంటి కార్మికోద్యమ డిమాండ్లను కూడా ఎస్‌కెఎం క్రమంగా తన కార్యాచరణలో భాగంగా చేసుకుంది. ఎస్‌కెఎం నాయకులు 2021 నవంబరు 11 నాటి 'కార్మికుల జాతీయ సదస్సు'కు హాజరై రెండు రోజుల సమ్మెకు తమ మద్దతు ప్రకటించారు. దేశంలోని అతి పెద్ద రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలైన అఖిలభారత రైతుసంఘం (ఎఐకెయస్), అఖిలభారత వ్యవసాయ కార్మికసంఘం(ఎఐఎడబ్ల్యుయు)లు 2022 ఫిబ్రవరి 23-24ల్లో 'గ్రామీణ హర్తాళ్'కు పిలుపునిచ్చాయి.

రైతులు, వ్యవసాయ కార్మికుల డిమాండ్లకు

> **“ గత మూడు దశాబ్దాలలో నిరంతరమైన, ఎడతెరిపిలేని కార్మికవర్గ పోరాటాల ఫలితం గా పాలకవర్గాలు నయా ఉదారవాద విధానాల అమలు వేగాన్ని తగ్గించాయి. ఈ కాలంలో ఐక్య కార్మికోద్యమం నిర్వహించిన 20కి పైగా దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలతో పాటు, రంగాలవారీ అసంఖ్యాకమైన సమ్మె పోరాటాలు జరిగాయి. ”**

దేశ కార్మికవర్గం మద్దతుగా నిలవటం ఇది మొదటి సారి కాదు. భారతదేశంలో 40 సంవత్సరాల క్రితం 1982 జనవరి 19న “కార్మిక సంఘాల జాతీయ ప్రచార కమిటి” పిలుపుపై తొలి ‘దేశవ్యాపిత ఐక్య సార్వత్రిక సమ్మె’ జరిగింది. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, పని పరిస్థితుల మెరుగుదల, సమగ్ర చట్టం చేయాలని, ఇతర డిమాండ్లను కూడా ఆ సమ్మె సందర్భంగా కార్మికులలో ప్రచారం చేశారు. సమ్మె అనంతరం కూడా దాదాపు తొమ్మిది నెలల పాటు ఆ డిమాండ్లపై దేశ వ్యాపిత ప్రచార కార్యక్రమం కొనసాగింది. ఆ సమ్మె రోజున దేశమంతటా వేలాదిమంది రైతులు, వ్యవసాయ కార్మికులు సమ్మె, ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆనాటి పోలీసు కాల్పుల్లో 10 మంది చనిపోయారు. వారిలో ఇద్దరు రైతులు, ఇద్దరువ్యవసాయ కార్మికులు, ఒక విద్యార్థి అమరులైనారు. ఆ అమరులను స్మరిస్తూ సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయులు సంయుక్తంగా ఈ జనవరి 19న ‘ కార్మికులు– కర్షకుల సమైక్యతా దినం’గా నిర్వహిస్తున్నారు.

నిన్న మొన్నటి వరకూ మోడీని అజేయుడిగా భావించారు. కానీ సమాజంలోని విశాల ప్రజానీకం మద్దతుతో అపూర్వమైన ఐక్య రైతాంగ ఉద్యమం వ్యవసాయ నల్ల చట్టాలను రద్దుచేసేలా మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి గొప్ప విజయం సాధించింది. ఐదు రాష్ట్రాల్లో, ముఖ్యంగా రైతాంగ వుద్యమానికి ప్రధాన కేంద్రాలైన ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఇతర రాష్ట్రాలలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలు, ఈ రాష్ట్రాల్లో బిజెపిపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత కూడా మోడీ ప్రభుత్వానికి వ్యవసాయ చట్టాలను రద్దుచేయక తప్పని పరిస్థితిని కల్పించింది.

ఐక్య రైతాంగ వుద్యమం సాధించిన చారిత్రక విజయం రైతాంగంలోనే కాక మొత్తం కార్మికులు, శ్రామిక ప్రజల్లో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపింది. తమ ఐక్యత, నిర్ణయాత్మక పోరాటాలతో విజయాలు సాధించగలమన్న విశ్వాసాన్ని శ్రామికవర్గంలోను, ప్రజల్లోను ఆ పోరాటం కల్పించింది.

గత మూడు దశాబ్దాలలో నిరంతరమైన, ఎడతెరిపిలేని కార్మికవర్గ పోరాటాల ఫలితం గా పాలకవర్గాలు నయా ఉదారవాద విధానాల అమలు వేగాన్ని తగ్గించాయి. ఈ కాలంలో ఐక్య కార్మికోద్యమం నిర్వహించిన 20కి పైగా దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలతో పాటు, రంగాలవారీ అసంఖ్యాకమైన సమ్మె పోరాటాలు జరిగాయి.

ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు, ఇన్సూరెన్స్ , టెలికం ఉద్యోగులు, ఉక్కు, బొగ్గు, విద్యుత్, ఆయిల్ వంటి పలు రంగాల కార్మికులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వుద్యోగులు, మెడికల్ రిప్రజంటేటివ్‌లు, స్కీం వర్కర్లు, బహుళజాతి కార్పొరేషన్‌లతో సహా ప్రైవేట్ రంగ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు తదితర అన్ని రంగాల కార్మిక వర్గమూ తమ రంగాల సమస్యలపై గొప్ప పోరాటాలు నిర్వహించారు. ప్రైవేటీకరణకు, క్షీణిస్తున్న పని పరిస్థితులకు, కార్మిక సంఘాల ప్రాథమిక హక్కులు, పని ప్రదేశాలలో కార్మికుల హక్కులు, పెన్షన్ వంటి సామాజిక భద్రతా హక్కులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పై పోరాటాలన్నీ కేంద్రీకరించాయి. ఫలితంగా ప్రభుత్వం తాను ఆశించిన విధంగా ప్రైవేటీకరణ పథకాలను ముందుకు తీసుకు పోలేక పోయింది. ప్రభుత్వ రంగానికి చరమగీతం పాడుతానని ప్రకటించిన ప్రణాళికలను కూడా మోడీ ప్రభుత్వం అనుకున్నంత త్వరితంగా ముందుకు తీసుకెళ్లలేక పోతున్నది. కానీ ప్రభుత్వం ఆ దిశలోనే ముందుకు సాగుతున్నది.

ఈ కాలంలో బ్యాంకు ఉద్యోగులే 62 సార్లు సమ్మెలు చేశారు. 2021లో కార్మికవర్గం ఐక్యంగా రెండు సార్లు –మార్చి 15–16లోను, డిసెంబరు 16–17తేదీల్లోను– రెండు రోజుల సమ్మెలను నిర్వహించారు. రెండు ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటుపరం చేయనున్నట్లు గత బడ్జెట్‌లో బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. బ్యాంకుల ప్రైవేటీకరణపై పార్లమెంటు శీతాకాల సమావేశంలో బిల్లును కూడా ప్రవేశపెట్టింది. కానీ పై పోరాటాల నేపథ్యంలో, ఆ ప్రతిపాదనను తాత్కాలి కంగానైనా వాయిదా వేసుకోక తప్పలేదు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా కార్మికులు ఆంధ్రప్రదేశ్ ప్రజలందరినీ కలుపుకుని దాదాపు ఒక సంవత్సర కాలంగా సమైక్యంగా పోరాడుతున్నారు. వైఎస్ఆర్‌సిపి, టిడిపి వంటి పాలకవర్గ పార్టీలు ప్రైవేటీకరణకు, నయా ఉదారవాదానికి మద్దతుగా నిలుస్తున్నాయి. కానీ ప్రజల అండదండలున్నందున విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటానికి పై పార్టీలు కూడా తమ మద్దతు నివ్వక తప్పలేదు. ఆ పరిశ్రమలోని ‘కోక్ ఓవెన్’ను ప్రైవేట్ యాజమాన్యాలకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం చాటుమాటు ప్రయత్నాలు చేస్తున్నది. కానీ ఆ ప్రభుత్వమే మొత్తం పరిశ్రమను ప్రైవేటుపరం చేయటంలో అడుగు ముందుకు కదపలేకపోతున్నది. గతంలో ఇదే మోడీ ప్రభుత్వం విశాఖలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టే ప్రయత్నాలను తాత్కాలికంగానైనా వాయిదా వేసుకుంది. ఢిల్లీ సమీపంలోగల ఘజియాబాద్‌లోని ‘సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్’(సిఇఎల్)లోనూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం సాగుతున్నది. లాభసాటిగా నడుస్తున్న ఈ కంపెనీలోని 100 శాతం ప్రభుత్వ వాటాలను ‘నందాల్ ఫైనాన్స్ అండ్ లీజింగ్’కు నామమాత్రపు మొత్తానికి కట్టబెట్టాలని మోడీ ప్రభుత్వం వేసిన పథకం పారలేదు. అక్కడ కూడా అమ్మకానికి వుద్దేశించిన ‘ లెటర్ ఆఫ్ ఇంటెంట్’ జారీని ప్రభుత్వం వాయిదా వేయక తప్పలేదు. విద్యుత్ రంగంలోని ఇంజనీర్లతో సహా వుద్యోగులందరూ దేశవ్యాపిత సమ్మెకు పిలుపునివ్వడంతో, ‘విద్యుత్ సవరణ బిల్లు’ను పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసుకుంది.

‘సమీకృత శిశు అభివృద్ధి పథకం’ (ఐసిడియస్)ను నిర్వీర్యం చేసేందుకు గత మూడు దశాబ్దాలుగా కేంద్రంలో వరుసగా ఆధికారం చేపట్టిన ప్రభుత్వాలన్నీ ప్రయత్నం చేస్తున్నాయి. కానీ అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్లు దేశవ్యాపితంగా చేస్తున్న సమరశీల పోరాటాల ఫలితంగా పాలకులు ఆ పని చేయలేక

పోయారు. అంతేకాదు. అంగన్‌వాడీ ఉద్యోగులు పోరాటాల ద్వారా తమ పారితోషికాలను, పని పరిస్థితులను కొంత మేరకు మెరుగు పరచుకోగల్గారు.

రాష్ట్రాల స్థాయిలో కూడా ఇలాంటివే పలు ఉదాహరణలున్నాయి. ప్రైవేటైజేషన్ ప్రయత్నాలకు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్ విద్యుత్ రంగం ఉద్యోగులు ఇటీవలే పోరాడి, విజయం సాధించారు. అక్కడి విద్యుత్ విభాగం విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం సైన్యాన్ని నియమించింది. కానీ ఉద్యోగుల పోరాటంతో ప్రభుత్వం తన చర్యలను ఉపసంహ రించుకుంది. వినిమయదారులను కలుపుకొని పోరాడటం ద్వారా హర్యానాలోని విద్యుత్ ఉద్యోగులు ప్రైవేటీకరణ యత్నాలను వమ్ము చేశారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో ప్రైవేటీకరణ విధానాలను విద్యుత్ వుద్యోగులు సమైక్యంగా ప్రతిఘటించటంతో ప్రైవేటీకరణ నిర్ణయం నుండి ప్రభుత్వం వెనుదిరిగింది.

కార్మిక హక్కులను కాలరాసేందుకు, యజమానులకు అనుకూలంగా పని పరిస్థితులను మార్చేందుకు ప్రయత్నాలు ముమ్మర మౌతున్నాయి. పాలక వర్గాలు తమకు అనుకూలమైన నిర్ణయాలను ఎంతో వేగంగా అమలు జరపాలని కోరుతున్నాయి. ఆ కుట్రలను నిలువరించేందుకు సిద్ధం కావాలి. అందుకు ఉమ్మడి కార్మికోద్యమం బలమైన ప్రతిఘటనకు సన్నద్ధం కావాలి. 'కార్మిక సంస్కరణల' మాటున 'లేబరు కోడ్‌ల'కు ఆమోదం పొందటం ద్వారా మోడీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రమాణాలను ఘోరంగా వుల్లంఘించింది. కానీ అది జరిగి సంవత్సరం దాటుతున్నా ఇంత వరకు ఆ కోడ్‌లను చట్టబద్ధంగా ప్రకటించ లేకపోతున్నది.

పైన తెల్పినవన్నీ కేవలం ప్రైవేటీకరణను, లేబరు కోడ్‌ల అమలును వాయిదా వేసేందుకు ఉపకరించే తాత్కాలికమైన లేదా పాక్షికమైన విజయాలు మాత్రమే. అందులో ఎలాంటి సందేహానికీ తావు లేదు. లేబరు కోడ్‌లపై చట్టబద్ధ ప్రకటన వెలువడలేదు. వాటిని అధికారయుతంగా అమలు జరపటం లేదు. కానీ కార్మిక హక్కులను నిర్వీర్యం చేసే విధానాలను అనేక రాష్ట్రాల్లోని కార్మికశాఖ అధికారులు అనుసరిస్తున్నారు. బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రక్రియలో ఆశించిన ఫలితాలు సాధించలేక పోతున్నది. అందుకే అది 'నగదీకరణ' మార్గం పట్టింది. దానితో ప్రజా ధనంతో నిర్మించిన దేశపు మౌలిక వనరులను దాదాపు ఉచితంగానే స్వదేశీ, విదేశీ బడా

> ❝ కార్మిక హక్కులను కాలరాసేందుకు, యజమానులకు అనుకూలంగా పని పరిస్థితులను మార్చేందుకు ప్రయత్నాలు ముమ్మర మౌతున్నాయి. పాలక వర్గాలు తమకు అనుకూలమైన నిర్ణయాలను ఎంతో వేగంగా అమలు జరపాలని కోరుతున్నాయి. ఆ కుట్రలను నిలువరించేందుకు సిద్ధం కావాలి. అందుకు ఉమ్మడి కార్మికోద్యమం బలమైన ప్రతిఘటనకు సన్నద్ధం కావాలి. ❞




కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నది.

నయా-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఎడతెగని పోరాటాలు సాగిస్తున్న నేపథ్యంలోనే, వ్యవసాయ చట్టాల రద్దుకై సమైక్య రైతాంగ పోరాటం ప్రారంభమైంది. ఆ పోరాటం, దానికి ఉమ్మడి కార్మికోద్యమ వేదిక నుండి అందిన చురుకైన సౌహార్థత తోడై మన సమాజంలోని పునాది వర్గాలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల మధ్య ఐక్యత బలపడేందుకు సానుకూల పరిస్థితిని సృష్టించాయి. తామంతా కలిసి సాగాలన్న స్పృహ కూడా కార్మికులు, కర్షకుల్లో క్రమంగా పెరుగుతున్నది. ఢిల్లీ సరిహద్దు రైతాంగ వుద్యమంలో సమీకృతులైన ప్రజా సమూహాల్లో "కార్మిక కర్షక ఐక్యత వర్థిల్లాలి" అనేది సహజంగా ఆవిర్భవించిన ఒక వుత్సాహ పూరిత నినాదంగా మారుమోగింది. సంవత్సర కాలానికి పైగా సాగిన రైతాంగ ఉద్యమంలో పలు తరగతుల రైతాంగం మధ్య ఐక్యత పెరిగింది. కార్పొరేట్ అనుకూల వ్యవసాయ సంస్కరణల వ్యతిరేక ఉద్యమంలో చిన్న రైతులతో పాటు ధనిక రైతులు కూడా పాల్గొన్నారు.

మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను తీవ్రస్థాయిలో అమలు పరుస్తున్నందున దేశంలోని చిరు వ్యాపారాలు శిథిలమౌతున్నాయి. ఈ కాలంలోనే లక్షలాది సూక్ష్మ, చిన్న, మధ్య (ఎంఎస్ఎంఇ)స్థాయి సంస్థలు మూతబడ్డాయి. ఈ రంగానికి ఏవిధమైన ఉపశమనం చేకూర్చటంలోనూ మోడీ ప్రభుత్వం విఫలమైంది. తమిళనాడులోని తిరుప్పూరు, గుజరాత్‌లోని సూరత్‌లోని వేలాది పారిశ్రామిక క్లష్టర్లు సమ్మెలో కెళ్లాయి. పాలక వర్గాల్లోని బడా, బడాయేతర బూర్జువా విభాగాల మధ్య వైరుధ్యం పెరుగుతున్నది.

నయా ఉదారవాద పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాలు బలపడేందుకు ప్రస్తుత పరిస్థితి అనుకూలంగా ఉన్నది. అందుకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాల మధ్య క్షేత్రస్థాయిలో ఐక్యత మరింత బలపడవలసి వుంది. పునాది వర్గాల మధ్య ఐక్యతను వర్గ ఐక్యతగా మార్చాలి. వర్గ పోరాటాలను తీవ్రతరం చేయాలి. వర్గ పోరాటాలను తీవ్రతరం చేయటం ద్వారా మాత్రమే శ్రామిక ప్రజలకు అనుకూలంగా వర్గశక్తుల బలాల్లో మార్పులు చేయటం సాధ్యం. ఆ లక్ష్య సాధనకు దగ్గరి మార్గాలేమీ లేవు.

నయా-ఉదారవాద ప్రాజక్టును సమగ్రంగా అవగాహన చేసుకోవలసిన అవసరం వుంది.

**❝ మన దేశంలోని కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సమాఖ్య వ్యవస్థలోని పరిమితులనూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కల్పిస్తున్న ఆటంకాలను అధిగమిస్తూ వీలైన మేరకు ప్రత్యామ్నాయ విధానాలను అమలు పరిచేందుకు ప్రయత్నిస్తున్నది. అక్కడి ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకుంటున్నది. తిరువనంతపురం విమానా శ్రయాన్ని, కోచిలోని భారత్ పెట్రోలి యం కార్పొరేషన్ లిమిటెడ్ ( బిపిసిఎల్) ప్రైవేటీకర ణకు మోడీ ప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరే కించింది. ❞**

బడా కార్పొరేట్ సంస్థలు లాభాలు పెంచుకోవటం, సంపదలు పోగేసుకోవటం, కార్మిక సంఘాలను బలహీన పరచటం, కార్మికుల హక్కులపై దాడి చేయటం, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రకృతి వనరులతో సహా ప్రజా సంపదను బడా కార్పొరేట్లకు బదిలీ చేయటం నయా ఉదారవాద విధానాల సారాంశం. మతం, కులం, తెగ, ప్రాంతాల ప్రాతిపదికపై ప్రజలను చీల్చేందుకు, ప్రజాతంత్ర, రాజ్యాంగపరమైన హక్కులపై దాడిచేసి ప్రతిపక్షం గళం నొక్కేందుకు, తమ తక్షణ జీవిత సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు పాలకవర్గాలు మితవాద శక్తులను ప్రోత్సహిస్తున్నాయి.

నిరుద్యోగం, ఉపాధి కోతలు, అధిక ధరలు, పని గంటలు- పని భారం పెంపుదల వంటి రోజువారీ, తక్షణ సమస్యల పరిష్కారంతో పాటు శ్రామికులు పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలు, హక్కులను హరించటం ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలతో ముడిపడి ఉన్నాయి. కీలకమైన ఈ అంశాన్ని అర్థం చేసుకునేలా మొత్తం కార్మిక వర్గాన్ని, శ్రామిక జనులందరినీ చైతన్యపరచాలి. నయా ఉదారవాద విధానాలు, పెట్టుబడిదారీ విధానంలో వారి సమస్యలకు పరిష్కారం లేదని గమనించేలా చెయ్యగల్గాలి.

నేడు పలు దేశాలు, ప్రత్యేకించి లాటిన్ అమెరికా దేశాల్లో నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సమైక్యంగా పోరాడుతున్నారు. నిర్దిష్టమైన సమస్యలపై ప్రారంభమైన వుద్యమాలు, ఆ సమస్యలకు మూలమైన నయా-ఉదారవాద విధానాలను ప్రశ్నించటం, వాటికి వ్యతిరేకంగా పోరాడటం మొదలైంది. నయా ఉదారవాదాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వాలను, శక్తులను వాటికి మద్దతునిస్తున్న రాజకీయ పార్టీలను ప్రజలు తమ ఓటుతో శంకరగిరి మాన్యాలు పట్టిస్తున్నారు. ప్రజానుకూలమైన ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకొస్తున్న రాజకీయ పార్టీలను ఎన్నుకుంటున్నారు.

మన దేశంలోని కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సమాఖ్య వ్యవస్థలోని పరిమితులనూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కల్పిస్తున్న ఆటంకాలను అధిగమిస్తూ వీలైన మేరకు ప్రత్యామ్నాయ విధానాలను అమలు పరిచేందుకు ప్రయత్నిస్తున్నది. అక్కడి ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకుంటున్నది. తిరువనంతపురం విమానా శ్రయాన్ని, కోచిలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ( బిపిసిఎల్) ప్రైవేటీకర ణకు మోడీ ప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరే కించింది. కొట్టాయంలోని హిందుస్థాన్ న్యూస్ ప్రింట్ లిమిటెడ్, కాసరగోడ్‌లోని బిహెచ్‌ఇఎల్ -ఎలక్ట్రికల్ మెషిన్స్ లిమిటెడ్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అనేక ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణకు, వాటిని లాభసాటి సంస్థలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన పలు చర్యలను ఆ ప్రభుత్వం చేపట్టింది. కోవిడ్ మహమ్మారి మొదటి వెల్లువ కాలంలో తాను ప్రకటించిన ఆకస్మిక, వరుస లాక్‌డౌన్‌లతో జీవనోపాధులు, ఆదాయాలు కోల్పోయి వీధులపాలైన లక్షలాది మంది వలస కార్మికులను మోడీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. కానీ అందుకు భిన్నంగా కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తన శక్తి మేర వలస కార్మికులకు సహాయ, సహకారాలను అందించింది. అంతే కాదు. లేబరు చట్టాల్లో కార్మిక వ్యతిరేక మార్పులను అమలు చేయబోమని ఆ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది.

మన దేశంలో 'సంయుక్త కిసాన్ మోర్చా'(ఎస్‌కెఎం) సమైక్య రైతు ఉద్యమానికి నాయకత్వం వహించింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోని బిజెపి ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక ప్రభుత్వాల అవతారమెత్తాయి. ఆ ప్రభుత్వాల నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా 'మిషన్ ఉత్తర ప్రదేశ్', 'మిషన్ ఉత్తరాఖండ్' ఉద్యమాలను 'సంయుక్త కిసాన్ మోర్చా' ముందుండి నడుపుతున్నది. ఇదే కాలంలో బిజెపి ప్రభుత్వ విచ్ఛిన్నకరమైన నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా 'జాతీయ కార్మిక సదస్సు', "ప్రజలను కాపాడండి. దేశాన్ని కాపాడండి"- నినాదంతో 'మిషన్ ఇండియా' ఉద్యమానికి పిలుపునిచ్చింది.

పై అవగాహన, లక్ష్యాలకు అనుగుణంగా 2022 మార్చి 28,29 తేదీలలో జరుగనున్న జాతీయ సమ్మె ప్రచార కార్యక్రమ ప్రణాళికను రూపొందించుకోవాలి. పెరుగుతున్న నిరుద్యోగం, విపరీతమైన ఉపాధి కోతలు, దిగజారుతున్న పని పరిస్థితులు, ఆకాశాన్నంటుతున్న ధరలు, సామాన్య ప్రజల జీవనం- ఆదాయాలు, ప్రాథమిక హక్కులపై దాడులతో అన్ని తరగతుల శ్రమజీవుల్లో అసంతృప్తి పెరుగుతున్నది. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి రెండవ వెల్లువలో మోడీ ప్రభుత్వం అనుసరించిన నేరపూరితమైన నిర్లక్ష్యం ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచింది. పలు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అందుకు అద్దం పడతాయి.

సమైక్య రైతు వుద్యమ విజయం ప్రజల్లో ఉత్సాహాన్ని నింపింది. పోరాటాలు, విజయాల పట్ల విశ్వాసాన్ని పెంచింది. ఈ స్ఫూర్తిని, కార్మికవర్గపు సమ్మె సందేశాన్ని, వారి సమస్యలు, డిమాండ్లను కార్మికులలో విస్తృతంగా ప్రచారం చేయటంతో పాటు మొత్తం శ్రమజీవుల్లోకి తీసుకెళ్లాలి. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, అసంఘటిత రంగం, ప్రభుత్వ రంగం, స్కీం వర్కర్స్ వంటి రంగాలన్నింటా సమ్మె సంపూర్ణంగా జరిగేలా కృషి చేయాలి. ఈ సార్వత్రిక సమ్మెకు సమాజంలోని అభ్యుదయ వాదులందరి మద్దతును కూడగట్టాలి.

నయా-ఉదారవాద విధానాల మూలంగా ఉత్పన్నమైన అసంతృప్తినంతటినీ, ఆ విధానాలను తీవ్రంగా అమలు జరుపుతున్న మోడీ ప్రభుత్వంపై వ్యతిరేకతగా మార్చాలి. ఇప్పటి వరకూ 'మన వుద్యమం చేరుకోలేని వారందరినీ చేరుకునేలా' మన సమ్మె ప్రచారాన్ని నిర్వహించాలి. సమస్యలకూ, విధానాలకూ మధ్యగల సంబంధాన్ని వారికి వివరించాలి. విధానాలను నిర్ణయించే రాజకీయాలను ఎండగట్టాలి. రానున్న కాలంలో కార్మిక వర్గానికి అనుకూలంగా వర్గ శక్తుల బలాబలాల్లో మార్పు చేసేందుకు అనుగుణంగా వర్గపోరాటాలను ఉధృతం చేయాలి. ఆ కృషిలో ఈ సమ్మె ఒక మైలురాయిగా నిలవాలి.

**(అనువాదం: వై సిద్ధయ్య)**

ఇంటర్వ్యూ

# మోడీ విధానాలను ప్రశ్నించడానికి సగటు ప్రజలు ముందుకొస్తున్నారు



డా॥ థామస్ బ్లామ్ హాన్సెన్

**(కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో డా. థామస్ హాన్సెన్ ఆంత్రొపాలజీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో రాజకీయ జీవితం, వివిధ జాతుల, మతాల అస్థిత్వాలు, డా.హాన్సెన్ ప్రధాన పరిశోధనాంశాలు. "ఆధునిక భారతదేశంలో కాషాయ వెల్లువ: ప్రజాస్వామ్యం, హిందూ జాతీయవాదం", "ముంబైలో వలస పాలన అనంతర కాలంలో హింస, అస్థిత్వ రాజకీయాలు" అనే గ్రంధాలను ఆయన రచించారు. ఇటీవల ఫ్రంట్‌లైన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి కొన్ని ముఖ్యమైన భాగాలను మార్పిస్టు పాఠకులకు అందిస్తున్నాం...సంపాదకుడు)**

**ప్రశ్న:** హిందూ జాతీయవాదం మూలాలు వివిధ అంశాలలో ఉన్నాయి. క్రైస్తవ మత ప్రచారానికి ప్రతిస్పందనగా ఈ దేశంలో మితవాద భావజాలం తలెత్తిందనే వాదన ఉంది. మెజారిటీగా ఉన్నప్పటికీ తాము తక్కువ వాళ్ళం అనే భావన ఈ దేశంలోని హిందువులలో ఉండడం కూడా ఒక కారణం. 1875లో ఆర్యసమాజం ఏర్పడింది. హిందువులు వైదిక ఆర్యుల సంతతి అని ఆర్యసమాజం ప్రకటించింది. వీటన్నింటిలో హిందూత్వ ఉద్యమం ఎక్కడినుండి మొదలైంది?

**జవాబు:** మీరు ఆర్యసమాజం గురించి సరిగ్గానే ప్రస్తావించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సభ్యుల నేపథ్యాన్ని పరిశీలిస్తే వారిలో చాలామంది ఆర్యసమాజ్ సభ్యులుగా ముందు చేరినవారే. వారిమీద ఇతర ప్రభావాలు కూడా ఉన్నాయి. ఆర్యసమాజ్ ఒక హిందూ సంస్కరణ ఉద్యమం. క్రైస్తవ మత ప్రచారకులు పంజాబ్‌లో సాగించిన కార్యకలాపాలకు అది ప్రతిస్పందించింది. దానితోబాటు హిందూ జాతీయవాదం మీద జనాభా లెక్కల ప్రభావం కూడా ఉంది.

1870 దశకంలో మొదలైన జనాభా లెక్కల వివరాలు చాలామంది అగ్రవర్ణ హిందువులలో ఆందోళన కలిగించాయి. ముస్లింలు తమ జనాభా బలంతో ఈ దేశాన్ని చేజిక్కించుకుంటారన్న భయం వారికి కలిగింది. ఈ రకమైన ఆందోళన బెంగాల్‌లో ప్రత్యేకించి ఎక్కువ ప్రభావం కలిగించింది. అక్కడ భూయజమానులు ప్రధానంగా హిందువులు. వారి భూములను సాగుచేసేది ప్రధానంగా ముస్లిములు. జనాభాకు సంబంధించిన ఆందోళన వెనుక స్పష్టంగా ఒక వర్గ సంబంధిత ఆందోళన కూడా ఉంది. అది దేశ విభజన తర్వాత కూడా కొనసాగుతోంది. చాలా రాష్ట్రాల్లో మతాంతర వివాహాలపై ఉన్న ఆంక్షలు దీనిని సూచిస్తున్నాయి. ఇప్పుడు కొన్ని చోట్ల జరుగుతున్న 'లవ్ జిహాద్' ప్రచారం కూడా దీనికి సంకేతం. దేశ విభజనకు మునుపు భారత ఉపఖండంలో ముస్లింలు 40 శాతం ఉండేవారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పుడు ముస్లింలు 15 శాతం మాత్రమే ఉన్నారు. అయినప్పటికీ వారి జనాభా పెరిగిపోతోందనే ఆందోళనను ఆరెస్సెస్, ఇతరులు కొందరు ఇంకా సజీవంగా ఉంచుతున్నారు.

జనాభా లెక్కలు ముస్లింలలో కూడా రాజకీయ సమీకరణకు దోహదం చేశాయి. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ దేశంలో హిందూ మెజారిటీ వత్తిడులనుండి ముస్లింల ప్రయోజనాలను కాపాడుకోడానికి ఏర్పడినట్టు ప్రకటించింది. అయితే ఈ రోజు మనం చూస్తున్న హిందూ జాతీయవాదం మహారాష్ట్రలోని ఒకానొక బ్రాహ్మణ సామాజిక నేపథ్యంలో పుట్టింది. దానినుంచి రాడికల్ జాతీయవాదులు వచ్చారు. వలసపాలనకు ప్రతినిధులుగా ఉన్న అధికారులను హత్యలు చేశారు. అదే సమయంలో దేశ రాజకీయాలపై బలమైన ప్రభావం చూపించిన బాల గంగాధర తిలక్ కూడా ప్రజాబాహుళ్యంలో హిందూ జాతీయ భావాలను ప్రేరేపించాడు.

ఈ పరిస్థితుల్లో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు ముందుకొచ్చారు. యూరపియన్ సాంస్కృతిక జాతీయవాద ప్రభావం వి.డి.సావర్కర్ మీద పడింది. ఇటాలియన్ జాతీయవాది మాజినీకి సావర్కర్ పెద్ద అభిమాని. అతని రచనలను మరాఠీ భాషలోకి తర్జుమా చేశాడు. అయితే సావర్కర్, హిందూ మహాసభ రాజకీయాలను బహిరంగంగా వెల్లడించినట్టు ఆరెస్సెస్ తన రాజకీయాలను మొదట్లో వెల్లడించలేదు.

కొన్ని దశాబ్దాలపాటు, చెప్పాలంటే ఇప్పటికీ, ఆరెస్సెస్ తానొక రాజకీయాలు లేని సంస్థననే చెప్పుకుంటుంది. ఉమ్మడి శత్రువైన ముస్లింలకు వ్యతిరేకంగా హిందూ సమాజాన్ని సంఘటితం చేసి ఆ క్రమంలో కుల విభజనను అధిగమించాలని కోరుకుంటుంది. ఇప్పుడు కొందరు చరిత్రను తప్పుగా తిరగరాసి ఆరెస్సెస్ జాతీయోద్యమంలో భాగస్వామి అయినట్టు చిత్రీకరించాలని ప్రయత్నిస్తున్నారు. కాని వారు ఏనాడూ కాంగ్రెస్‌ను బలపరచలేదు. నిజానికి యూనిఫాంలతో ఉన్న క్రమశిక్షణ కలిగిన సైనిక బృందాలు ఈ దేశాన్ని నడిపించడానికి అవసరమన్న భావన ఆనాటి వలసపాలకుల్లోనూ, ఆరెస్సెస్‌లోనూ ఉమ్మడిగా ఉండేది.

బ్రిటిష్ వారు ఈ దేశాన్ని నిర్వహించగల సుసంఘటితమైన ఒక చిన్న బృందం అని తొలినాటి ఆరెస్సెస్ నేతలు తలపోశారు. అలా కాకపోతే వలస ప్రభుత్వ పోలీసుల యూనిఫాం మాదిరిగానే ఉండే యూనిఫాంను ఆరెస్సెస్ ఎందుకు రూపొందించినట్టు? ఒక కేంద్రీకృతమైన సిద్ధాంతంతో, ఏ వొక్క ప్రత్యేకతా లేని విధంగా, ఉన్నత కులాల ఆధిపత్య విలువలను ప్రతిబింబించే హిందూత్వాన్ని ఆధారం చేసుకుని ఈ సమాజాన్ని హిందూ సమాజంగా తయారుచేసే లక్ష్యంతో ఆరెస్సెస్ పని చేస్తుంది.

జనసంఘం ఏర్పడిన తర్వాతే వాళ్ళకి పార్లమెంటరీ రాజకీయాలమీద ఆసక్తి పెరిగింది. కాని కొన్ని దశాబ్దాల వరకూ రాజకీయాలు వాళ్ళకి ప్రధానమైన చర్చనీయాంశమూ కాదు, వ్యూహమూ కాదు.

ముస్లింలు అంటే భయాన్ని కలిగిస్తూ, చరిత్రలో ముస్లింలు ఆధిపత్యం చలాయించిన కాలానికి ఇప్పుడు హింసాత్మకంగా ప్రతీకారం తీర్చుకోవాలనే అసందర్భపు ఊహలను రెచ్చగొడుతూ హిందూ జాతీయవాదం వ్యవహరిస్తుంది. అయితే ఇంకోవైపు ప్రజాబాహుళ్యం పాల్గొనే రాజకీయాలన్నా, ప్రజాస్వామ్యమన్నా కూడా వీళ్ళకి భయమే. ఆ రాజకీయాలు, ప్రజాస్వామ్యం సంఖ్యాపరంగా మెజారిటీగా ఉండే ఒబిసిలను, దళితులను, గిరిజనులను, ముస్లింలను ముందుకు తెస్తాయని, దానివలన ఉన్నత కుల హిందువుల ఆధిపత్యం కాస్తా దెబ్బ తింటుందని భావించడమే వీళ్ళ భయానికి కారణం.

ఆరెస్సెస్ నిర్మాణం ప్రజాస్వామ్యానికి పూర్తి వ్యతిరేకం. క్రమశిక్షణ కలిగిన కొద్దిమంది ఉన్నతకులాల నేతలే హిందూ సమాజాన్ని ముందుకు నడిపించగలరని ఆరెస్సెస్ బలంగా భావిస్తుంది. అందరినీ అక్కున చేర్చుకుని అందరి పట్లా ఉదారంగా వ్యవహరించే విధానంతో గాంధీ కోట్లాది మందిని కదిలించాడు. ఆ ఉద్యమంలో హిందూ ఆధిపత్యానికి చోటు లేదు. అందుకే మహాత్మా గాంధీ అంటే ఆరెస్సెస్‌కు అంత ద్వేషం.

1980, 1990 దశకాల్లో నడిచిన రామ జన్మభూమి ఉద్యమంతో హిందూ జాతీయవాదులు ప్రజాబాహుళ్యాన్ని సమీకరించడం మొదలుబెట్టారు. కండకావరాన్ని ప్రదర్శిస్తూ మైనారిటీలను భయభ్రాంతులకు గురిచేసే మెజారిటేరియన్ రాజకీయాలను అనుసరించారు. అగ్రకుల నేతల ఆధిపత్యంలోని ఆరెస్సెస్ నిర్వహించగల రాజకీయం ఇదొక్కటే. ఇది అప్రజాస్వామికమే గాక, భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య సాంప్రదాయాలకు విరుద్ధం.

బిజెపిని బలపరిచేవారిలో చాలామంది విద్యావంతులైన మధ్యతరగతి ప్రజలు ఉన్నారు. హిందూ భావన పట్ల, హిందూ శక్తి పట్ల వీరు గర్వంగా స్పందిస్తారు. వీరిలో చాలామందికి ప్రజాస్వామ్యం అన్నా, ఎన్నికల రాజకీయాలు అన్నా చాలా విముఖత ఉంటుంది. ఎందుకంటే ఎన్నికల రాజకీయాలలో పేదవారు, మైనారిటీలు తదితర సమూహాల హక్కులు ప్రాధాన్యత సంతరించుకుంటాయి. అటువంటిదేదీ ఈ మధ్యతరగతి విద్యావంతులకు నచ్చదు.

**ప్రశ్న:** భారత్‌లోని సంఘ పరివారం, మితవాద ఉద్యమాలు ఆవు గురించి తెగ గింజుకుంటాయి. 1880లలో ఐక్య పరగణాలలో సాగిన గోరక్షణ ఉద్యమం ఈ దేశంలో హిందూత్వ శక్తుల మొదటి ఉద్యమంగా పరిగణిస్తారు. ఇటీవల గొడ్డుమాంసం ఆహారంగా తీసుకునే విషయంలో తలెత్తిన వివాదాలు, సంఘటనలు కూడా మనముందున్నాయి. ఈ దేశంలో హిందూత్వ ఉద్యమం మరి వేరే ఏదైనా చిహ్నాన్ని కాకుండా ఆవునే చిహ్నంగా ఎందుకు ఎంచుకుంది?

**జవాబు:** ఐక్య పరగణాలలో జరిగిన గోరక్షణ ఉద్యమం మొదటి ఉద్యమంగా నేను అంగీకరిస్తాను. హిందువులందరిలో ఒక ఉమ్మడి లక్ష్యాన్ని ఏర్పరచడానికి, అదే సమయంలో ముస్లింల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టడానికి ఆ ఉద్యమం తోడ్పడుతుంది. ఆవు అనేక రకాలుగా ఒక చిహ్నంగా ఉపయోగపడుతుంది. ఒక తల్లిగా, పాలు ఇచ్చేదిగా, ఇంకా పలు విధాలుగా ఆవు ఉంటుంది. ఉత్తర భారతంలో ఉన్నత కులాల మధ్య గోరక్షణ ఉద్యమం బాగా వ్యాపించింది. దాని ప్రకంపనలు నేటికీ కానవస్తున్నాయి.

ముస్లింలు గొడ్డు మాంసం తింటారు, హిందువులు ఆవును పూజిస్తారు' అనే భావన హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలను నిలబెడుతుంది. హింసకు పాల్పడేవారుగా, గొడ్డుమాంసాన్ని తినేవారుగా, రక్తదాహం కలవారుగా ముస్లింలను చిత్రించడం అనేది సుమారు ఒక వంద సంవత్సరాల క్రితం మొదలైంది. ఐతే భారత్‌లో తినే గొడ్డుమాంసంలో అత్యధిక భాగం గేదెల నుండే వస్తుంది.

గో రక్షణ అనేది ఉన్నతకులాల భావనను సమర్ధిస్తుంది. హిందువులు అంటే శాకాహారులు అన్న భావన కలిగిస్తుంది. అయితే దీనిని బలపరిచే వాస్తవమైన ఆధారాలేవీ లేవు. 20వ శతాబ్దపు తొలిరోజుల్లో బ్రిటిష్ పాలకులు ఇక్కడి జనాభా నుండి సేకరించిన వివరాల ప్రకారం 40 శాతం హిందువులు గొడ్డుమాంసం తింటారు. ఈ వాస్తవం ఉన్నతకులాలవారికి తీవ్రమైన ఆగ్రహం తెప్పించింది. దాంతో బ్రిటిష్ వారు ఆ తరహా వివరాల సేకరణ మానుకున్నారు.

**ప్రశ్న:** భారత్‌లోని హిందూత్వ ఉద్యమానికి వి.డి.సావర్కర్ నాయకుడుగా రావడం ఊపునిచ్చింది. నాగరికతకు, మతానికి ఉన్న తేడా గురించి సావర్కర్ చర్చ లేవనెత్తాడు. హిందూత్వ గురించి, నాగరికత గురించి సావర్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని ఇప్పుడు హిందూత్వ వాదులు ఇంకా ఉపయోగిస్తున్నారా?

**జవాబు:** హిందూయిజం కేవలం ఒక మతం కాదన్నది సావర్కర్ వాదన. హిందూ నాగరికత అనే ఒక గొడుగు కింద అనేక ఆరాధనా పద్ధతులు ఉన్నాయి. హిందూ సంస్కృతిలో బహుళ స్రవంతులు ఉన్నాయి. ఈ వాదన ఇప్పటికీ ఇంకా ప్రచారంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ అనుసరించేది కుహనా లౌకిక వాదం అంటూ ఆరెస్సెస్, బిజెపి చేసే విమర్శకు ఇది ప్రాతిపదికగా ఉంది. క్రైస్తవం మాదిరిగా, ఇస్లాం మాదిరిగా హిందూ యిజం ఒక సంఘటితమైన మతం కాదనీ, మౌలికంగానే హిందూయిజంలో సహనం అంతర్లీనంగా ఉంటుందనీ వాళ్ళు వాదిస్తారు. మత విద్వేషం అనేది పశ్చిమ ఆసియా నుండి వచ్చిన మతాలవారు కనిపెట్టినదని వాళ్ళు అంటారు. హిందూయిజం ఒక సంస్కృతి కాబట్టి హిందువుగా పుట్టినవారు, విదేశీ మతాలనబడేవాటికి చెందినవారు అందరూ హిందువులేనని అంటారు. సిక్కులు, బౌద్ధులు కూడా హిందువులేనన్నది వారి వాదన.

మీ పవిత్ర భూమి ఏది? మీ పితృభూమి ఏది? అనిసావర్కర్ అడుగుతాడు.

ఒక హిందువుకు భారత దేశమే పితృభూమీ, పవిత్రభూమీ అవుతుందని అంటాడు. హిందూ ఆరాధనా పద్ధతులపట్ల గానీ, సాంప్ర దాయ హిందూ తాత్విక సిద్ధాంతాల పట్ల గాని సావర్కర్‌కు ఎటువంటి ఆసక్తీ లేదు. ఆరెస్సెస్‌లో చాలామంది, సావర్కర్ అనుయాయులతో సహా దేవాలయాలను సందర్శించరు. భారతదేశం హిందువులందరి స్వస్థలం కావాలంటారు, కాని హిందువు అంటే ఎవరన్న విషయాన్ని చాలా విశాలంగా నిర్వచిస్తారు.


ఆర్ఎస్ఎస్ అనుయాయి ఘాట్సే చేత హత్యగావించబడిన గాంధీజీ

ఇటీవల సవరించిన పౌర సత్వ చట్టంలో కూడా భారత దేశం హిందువుల స్వస్థలంగా ఉండాలన్న భావనే ప్రధానంగా వ్యక్తమౌతుంది. పొరుగుదేశంలో ఉండే మైనారిటీ మతస్తులు ఎవరైనప్పటికీ, వారికి భారతదేశ పౌరసత్వం పొందే అర్హత ఉంటుంది కానీ ముస్లింలకు మాత్రం అర్హత లేదు. పాతకాలపు జాతీయవాదం చెప్పిన 'అఖండ భారత్' – అంటే ఈ ఉపఖండమంతా ఒకే ఒక హిందూదేశం అనే భావన– కూడా ఈ పౌరసత్వచట్ట సవరణ వెనక కనపడుతుంది.

**ప్రశ్న:** ద్విజాతి సిద్ధాంతానికి అసలైన మూలం ఏది? అది ఆరెస్సెస్ నుంచి పుట్టిందా లేక ముస్లిం లీగ్ నుంచా?

**జవాబు:** ఇద్దరినుంచీ అని నేననుకుంటున్నాను. కాని తరచూ ఈ ద్విజాతి సిద్ధాంతం జిన్నా నుంచి, ముస్లిం లీగ్ నుంచి, లేదా పాకిస్తాన్ చుట్టుపక్కల ఉన్నవారి నుంచి బయలుదేరిందని అంటూంటారు.

**ప్రశ్న:** బి.ఆర్.అంబేద్కర్ రచనల్లో ద్విజాతి సిద్ధాంతం వెనుక సావర్కర్ పాత్ర ఉన్నట్టు పేర్కొన్నారు. మీ అభిప్రాయం ఏమిటి?

**జవాబు:** హిందూ రాష్ట్ర అనే భావనను మొట్టమొదటగా లేవనెత్తినవాడు సావర్కర్ అని అంబేద్కర్ చెప్పినది సరైనది అని నేను భావిస్తున్నాను. భారతదేశంలో ఉన్న ముస్లింల రాజకీయ ప్రయోజనాలను కాపాడాలన్న ప్రధాన లక్ష్యంతో ముస్లిం లీగ్ ఉండేది. 1930 దశకంలో మాత్రమే ముస్లిం లీగ్ పాకిస్తాన్ నినాదాన్ని లేవనెత్తింది.

ఫైజల్ దేవ్‌జీ రాసిన 'ముస్లిం జియాన్' (ముస్లి ల పవిత్ర స్థలం) అనే గొప్ప గ్రంథంలో దక్షిణాసియాలోని ముస్లింలకు స్వస్థలంగా 'పాకిస్తాన్' అనే భావన ఏవిధంగా ఉనికిలోకి వచ్చిందో వివరించాడు. ఈ వివరణ ప్రతీ జాతికీ ఒక స్వస్థలం ఉండాలన్న ప్రాతిపదిక మీద ఆధారపడి ఉంది. 1920, 1930 దశకాల్లో నెలకొన్న రాజకీయ అల్లకల్లోల పరిస్థితుల్లో ముస్లిం లీగ్‌లో తలెత్తిన ఆందోళన ద్విజాతి సిద్ధాంతం రూపు దిద్దుకోడానికి దారి తీసింది. దానిని జిన్నా, ఇతరులు స్వీకరించారు. అందుచేత ఈ ద్విజాతి సిద్ధాంతం, హిందూ రాష్ట్ర సిద్ధాంతం కవలపిల్లలని చెప్పాలి.

ముస్లింలీగ్ నాయకుల్లో చాలా మందికి బాహాటంగా కాకపోయినా, లోపల్లోపల కాంగ్రెస్ ఉద్యమం హిందూ మెజారిటీ ఆధ్వర్యంలో నడిచే ఉద్యమం అన్న అనుమానం ఉండేది. హిందువులు, ముస్లింలు వేర్వేరు విలువలను పాటిస్తారనీ, వేర్వేరు దేవతలను ఆరాధిస్తారనీ, వేరువేరు ఆహారాలను తింటారనీ, వేరువేరు పద్ధతుల్లో పరస్పర సంబంధాలను నెలకొల్పుకుంటారనీ జిన్నా వాదించేవాడు. కాని వాస్తవంగా చూస్తే అటువంటిది వాస్తవం కాదు. అప్పుడూ కాదు, ఇప్పుడూ కాదు. కాని పాకిస్తాన్ కావాలనే నినాదం వెనుక ఒక స్వతంత్ర దేశం గనుక ఉంటే ముస్లింలకు రక్షణ, గౌరవం ఉంటాయని, ఒక కొత్త సమాజాన్ని నిర్మించుకో వచ్చని ఆశలు ఉండేవి.

### గాంధీజీ హత్య

**ప్రశ్న:** మహాత్మాగాంధీ హత్యకు ఆరెస్సెస్ కారణమన్న నింద ఉంది. దీర్ఘకాలదృష్టితో చూసినప్పుడు ఆ హత్య వలన ఆరెస్సెస్ లబ్ధి పొందగలిగిందా? హత్య జరిగిన వెంటనే దానికి చాలా నష్టం కలిగింది. ప్రభుత్వం ఆరెస్సెస్ ను నిషేధించింది. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?

**జవాబు:** వాళ్ళకి హత్య వలన వెంటనే ఏ లాభమూ కలగలేదు. వారిపై నిషేధం విధించారు. నెహ్రూ, ఇతర కాంగ్రెస్ నేతలు భారతీయ తరహా ఫాసిజమే ఆరెస్సెస్ అని ప్రకటించారు. ఆ నిషేధం కొంత పునరాలోచనకు దారి తీసింది. అయితే దేశ విభజన సమయంలో నెలకొన్న మతకల్లోల వాతావరణంలో ఆరెస్సెస్ చాలా వేగంగా విస్తరించింది. వాళ్ళు ప్రదర్శించిన దూకుడు కొంత ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టింది.

నిషేధం విధించాక వాళ్ళు వేరే పద్ధతులను అనుసరించాల్సివచ్చింది. ముఖ్యంగా రాజకీయాలవైపు వచ్చారు. జనసంఘం ఆ విధంగా ఏర్పడింది. భారతదేశంలోని రాజకీయాలలో మితవాదాన్ని ఏవిధంగా జొప్పించాలి అని వారు చాలా కాలం తాపత్రయ పడ్డారు.

ఆ కాలంలో వేరే పార్టీలు – స్వతంత్ర పార్టీ వంటివి– ఉండేవి. కాని తొలి దశాబ్దాలలో కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగింది.

ఒకవేళ గాంధీజీ జీవించివుంటే పరిస్థితులేవిధంగా ఉండేవి? ఇది కేవలం నా ఊహాగానమే. కానీ గాంధీ ఉండివుంటే నెహ్రూ తరహా కేంద్రీకృత ప్రణాళికా విధానాన్ని, పంచవర్ష ప్రణాళికలను, నెహ్రూ తరహా ఆర్థిక విధానాలను వ్యతిరేకించివుండేవారు. ఆనాటికి గాంధీకి కాంగ్రెస్ పార్టీమీద గణనీయమైన పట్టు ఉంది. ఎప్పుడైతే గాంధీ లేడో, ఒక విధమైన రాజకీయ పునరేకీకరణ జరిగింది.

గాంధీ సాంస్కృతికంగా, సామాజికంగా కొన్ని విషయాల్లో మితవాద వైఖరిని అనుసరించినా, రాజకీయంగా మాత్రం మితవాదిగా ఎన్నడూ లేదు. అతను రంగంలో లేకపోయేసరికి వామపక్ష, మితవాద ధృవాలుగా విడిపోవడం జరిగింది. దీని వలన ఆరెస్సెస్‌కు దీర్ఘకాలంలో ఏదైనా ప్రయోజనం కలిగిందా అనడిగితే ఇదమిత్థంగా చెప్పలేను.

కానీ 1970 దశకంలో జెపి ఉద్యమం ద్వారా మళ్ళీ పుంజుకోడానికి అవకాశం వచ్చింది. జయప్రకాష్ నారాయణ్ గాంధీకి సన్నిహితుల్లో ఒకరు. 1970, 1980 దశకాల్లో 'గాంధియన్ సోషలిజం' గురించి చాలామంది మాట్లాడేవారు. జనతాపార్టీలోనే కాకుండా, బిజెపిలో కూడా దీనిగురించి మాట్లాడేవారు. నిజానికి వారిలో చాలామందికి అదేమిటో తెలియదు కూడా.

ఇక గాంధీజీ హత్యకు సంబంధించి వస్తే, నాథూరామ్ గాడ్సేకు, ఆరెస్సెస్‌కు సైద్ధాంతిక పొంతన ఉంది. అందుకే ఇప్పుడు ఏదోవిధంగా గాడ్సేకు ఒక గౌరవాన్ని కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. 1990 దశకంలో నేను అతడి సోదరుడు గోపాల్ గాడ్సేను కలిశాను. అప్పటికి అతను దశాబ్దాలపాటు జైలు జీవితం గడిపి వచ్చాడు. అయినప్పటికీ అతనిలో ఏమాత్రమూ పశ్చాత్తాపం కనిపించలేదు. మా మధ్య జరిగిన సంభాషణ అంతా ముస్లింలు కుట్రలు పన్నుతున్నారన్న నిరాధార విషయాలచుట్టూనే సాగింది.

## జె.పి. ఉద్యమం ప్రభావం

**ప్రశ్న:** మీరు జెపి ఉద్యమం గురించి ప్రస్తావించారు. ఆ కాలంలో ఎమర్జెన్సీ విధించారు. ఇందిరాగాంధీ విధించిన ఆ ఎమర్జెన్సీ వలన దేశంలోని మితవాద శక్తులకు లాభం కలిగిందని భావిస్తున్నారా?

**జవాబు:** నిస్సందేహంగా. జెపి ఉద్యమం, ఆ తర్వాత వచ్చిన ఎమర్జెన్సీ భారతదేశ రాజకీయ చరిత్రలో కొత్త పరిణామాలకు తెర తీశాయి. చాలామంది పండితులు ఎమర్జెన్సీ గురించి చక్కని రచనలు చేశారు. అయితే జెపి ఉద్యమంమీద ఆమూలాగ్రంగా పరిశోధించాల్సివుంది. జెపి ఉద్యమం మితవాద ఉద్యమమా లేక వామపక్ష ఉద్యమమా? వాస్తవానికి అందులో రెండూ ఉన్నాయి. సామాజికంగా అభ్యుదయ భావాలు కలిగినవారు, లోహియా సోషలిస్టు భావాలతో ప్రేరేపితులైనవారు ఉన్నారు. అందులో గాంధేయవాదులు కూడా ఉన్నారు. వారిని అటు మితవాదులుగా గాని, ఇటు వామపక్షవాదులుగా గాని పరిగణించలేము.

ఒకసారి ఉద్యమం మొదలయిన తర్వాత దానికి జనసంఘం, ఆరెస్సెస్ తమ యంత్రాంగాన్నంతటినీ అందించాయి. తమ నిర్మాణ కౌశలాన్ని తోడు చేశాయి. ఆరెస్సెస్ లేకపోతే ఆ ఉద్యమానికి అంత ప్రభావం కలిగించే శక్తి వచ్చివుండేది కాదు. అయితే, ఆ ఉద్యమాన్ని ఆరెస్సెస్ నడిపించిందని చెప్పగలమా? ఆ విధంగా చెప్పలేం. దానిని జెపి సారథ్యం వహించి నడిపించారు. అతను చాలా సంక్లిష్టమైన వ్యక్తిత్వం కలవారు. అతనిపై ఏదో ఒక ముద్ర వేసేయడం కుదరదు. ఆరెస్సెస్‌తో కలిసి పని చేశాడు కనుక అతనిపై మితవాది అన్న ముద్ర వేయాల్సిందేనని కొందరు భావిస్తారు. కాని నేను ఆ విధంగా చెప్పలేను. ఒక సైద్ధాంతిక చట్రంలో గాంధేయ వాదులను ఖచ్చితంగా ఫలానాస్థానంలో ఉండాలని మనం నిర్దేశించలేం.

ఆ ఉద్యమం కోట్లాదిమందిని ఉత్తేజితుల్ని చేసిందనేది నిర్వివాదాంశం. అందులో పాల్గొన్న వారి నడుమ కొత్త బంధాలు ఏర్పడ్డాయి. జెపి ఉద్యమంలో పాల్గొన్నవారితో బాటు జైళ్ళలో నిర్బంధించబడిన పాత ఆరెస్సెస్ కార్యకర్తలు చాలామంది చెప్పినదేమంటే అటువంటి బంధాలనుండే జనతాపార్టీ పుట్టింది. ఆ స్నేహాలనుండి, ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ఏర్పడిన కూటములనుండి, ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి రావాలన్న ఆకాంక్షతో జనతాపార్టీ పుట్టింది. అందులో సోషలిస్టులు ఉన్నారు, ఆరెస్సెస్ వారున్నారు, ఉదారవాదులు ఉన్నారు, కాంగ్రెస్ ఆర్థిక విధానాలపట్ల విశ్వాసం లేనివారున్నారు. మామూలు పరిస్థితుల్లో ఇటువంటివారంతా ఒక దగ్గర కలవడం అసాధ్యం. ఒకసారి కలిసి 1977లో అధికారంలోకి వచ్చాక వారు ఎక్కువ కాలం పాలించలేకపోయారు. వేర్వేరు ప్రజాపునాదులున్న వారంతా తీవ్ర విభేదాలలో కూరుకుపోయారు.

ఓ విధంగా చెప్పాలంటే ఆ పరిస్థితి భారతదేశంలో ఒక కొత్త మితవాద ఉద్యమానికి పునర్జన్మనిచ్చింది. అయితే అది చాలా కష్టసాధ్యంగా సాగింది. 1980లో ఏర్పడిన బిజెపి రెండే రెండు సీట్లు గెలుచుకుంది. అస్పష్టమైన గాంధేయ సోషలిజం కార్యక్రమంతో అది ముందుకు వచ్చింది. ఆ తర్వాత ఎల్‌కె అద్వానీ రంగప్రవేశం చేశారు. విశ్వహిందూ పరిషత్ ప్రముఖమైన పాత్ర పోషించగలదని ఆయన భావించారు. బాహాటంగానే మత రాజకీయాలను తెరమీదకు తెచ్చారు. అయోధ్యలోని బాబ్రీ మసీదు వివాదం చుట్టూ రాజకీయాలను తిప్పి తద్వారా హిందూ మత విశ్వాసాలను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. చాలా తెలివిగా బాబ్రీ మసీదు వివాదాన్ని ఎంచుకున్నారు. అప్పటికే అది ఒక విడదీయలేని చిక్కు సమస్యగా ఉంది. ఆ స్థలానికి మతపరంగా ప్రాధాన్యత ఉంది. భారతదేశాన్ని ముస్లిం పాలకులు జయించిన చారిత్రిక సందర్భానికి చిహ్నంగా కూడా దానికి ప్రాధాన్యత ఉంది.

**ప్రశ్న:** జనసంఘంతో కలిసి వ్యవహరించడం ద్వారా జయప్రకాష్ నారాయణ్ మితవాద రాజకీయాలు బలపడడానికి దోహదం చేశాడని మీరు అభిప్రాయపడుతున్నారా?

**జవాబు:** జెపిని మితవాదిగా జమ కట్టడం మరీ అతి అవుతుంది. గాంధీ విషయంలోనూ అంతే. గాంధీ మితవాదా? లేక వామపక్షవాదా? అనడిగితే సమాధానం చెప్పడం అంత తేలికేమీ కాదు. ఎందుకంటే గాంధీలో చాలా ధోరణులు ఉన్నాయి. జెపి విషయంలోనూ అంతే. మనం 1970 దశకంలో రాజకీయ సమీకరణలు ఏవిధంగా ఉన్నాయో మరిచిపోకూడదు. అప్పట్లో వామపక్షాలకు కాంగ్రెస్సే ప్రధాన లక్ష్యంగా ఉండేది. ఆ పార్టీ అనుసరించిన బూర్జువా జాతీయవాదాన్ని, ఇందిరా గాంధీ ప్రజల్లో పాపులారిటీ కోసం అమలు జరిపిన విధానాలను, సంపన్నుల ప్రయోజనాలను కాపాడిన తీరును వామపక్షాలు వ్యతిరేకించాయి.

ఆ కాలానికి సంబంధించి ఒక సాధికారమైన చరిత్ర గ్రంథం ఏదీ ఇంకా రాలేదు.

**ప్రశ్న:** ఈ దేశంలోని మితవాదరాజకీయాల చుట్టూ సమీకరించడంలో రామజన్మభూమి వంటి మతపరమైన చిహ్నాలు ఎంతవరకూ తోడ్పడతాయి? ఇతర కారణాలు కూడా ఉండవచ్చు కదా?

**జవాబు:** దేశంలో రాముడిపై ఉన్న భక్తిని బాహాటంగానే సొమ్ము చేసుకోడానికి రామజన్మభూమి ఉద్యమం తోడ్పడింది. రాముడిగురించి అందరికీ తెలిసిన పురాణగాథను ఉపయోగించుకుని అంతకు పూర్వం ఉండిన రామాలయాన్ని పడగొట్టి అక్కడ బాబ్రీ మసీదు నిర్మించారనే ఒక కథను అల్లారు. నిజానికి అక్కడ పని చేసిన పురావస్తు శాస్త్రవేత్తలెవరూ అంతకు ముందు అక్కడ ఒక ఆలయం ఉండేదన్న విషయాన్ని రుజువు చేయలేదు.

కానీ అక్కడ రామాలయం ఉండేదనీ, దాన్ని ధ్వంసం చేసి ముస్లింలు తమ దురాక్రమణ ద్వారా అక్కడ మసీదు నిర్మించారనీ ఒక అభిప్రాయాన్ని ప్రచారంలో పెట్టారు. నిజానికి రాముడు పురాణ గాథల్లోని ఒక వ్యక్తే తప్ప చారిత్రిక వ్యక్తి కాదు. శిలాన్యాస్ పేరుతో దేశం నలుమూలలనుండీ ఇటుకలు తెచ్చిన దగ్గరినుంచీ, వివిధ రకాల యాత్రలను నిర్వహించడం వరకూ వాళ్ళు చేపట్టిన కార్యక్రమాలను చూస్తే అవన్నీ ఒక పథకం ప్రకారం జరిగాయని బోధపడుతుంది. భౌగోళికంగా భారత్ అనేదానిని హిందూయిజం తోటి, హిందూ సంస్కృతి తోటి ముడిపెట్టి రెండూ ఒకటేనన్న భావనను కలిగించడానికి చేసిన ప్రయత్నం అది.

అద్వానీ తన రథయాత్రను సోమనాథ దేవాలయం నుండి ప్రారంభించాడు. అక్కడే ముస్లింలు తొలి విధ్వంసం సాగించారని పరిగణిస్తారు కనుక అక్కడినుంచీ ప్రారంభించారు. ఆ యాత్ర అయోధ్య వరకూ సాగింది. ఆ తర్వాత ఏక్‌తా యాత్ర నిర్వహించారు. అది కన్యాకుమారి నుండి ప్రారంభమై కాశ్మీర్ వరకూ సాగింది. ఆ చివరి ఘట్టంలో శ్రీనగర్ వరకూ యాత్ర సాగడం సాధ్యపడలేదు. అప్పుడు అటల్ బిహారి వాజపాయిని హెలికాప్టర్‌లో శ్రీనగర్ తీసుకెళ్ళారు.

ఇక్కడ కూడా ఇండియా భౌగోళిక స్వరూపాన్ని మతం ప్రాతిపదికన ఉండే రాజ్యంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు.

ఆ వివాదం మతానికి సంబంధించినదే అయినా, ఒక కొత్త హిందూ రాజ్యం భావనకు ప్రతీకగా అయోధ్యను, హిందూత్వ ఆధారంగానే భారతదేశం ఉనికిలోకి వచ్చిందన్న భావనను ముందుకు తెచ్చారు. ఆ యాత్ర జరిగేనమయంలో నేను ఇండియాలోనే ఉన్నాను. యాత్ర ఆద్యంతమూ వాళ్ళు వ్యూవ్‌లను ప్రదర్శించారు. మతంతో జాతీయతను ముడిబెట్టి ప్రచారం సాగించారు. సాధారణ హిందువులలో తాము దేశం కోసం పాటుపడుతున్నామన్న భావనను వాళ్ళు కలిగించారు. ఆ విధంగా వాళ్ళకి రామజన్మభూమి అంశం తోడ్పడింది.


జయప్రకాశ్ నారాయణ్

### నయా ఉదారవాద విధానాలు, రాజకీయాలు

**ప్రశ్న:** 1990 దశకంలో డా.మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన నయా–ఉదారవాద విధానాలు దేశంలో మితవాద శక్తుల ఉద్యమం పెరగడానికి ఏ విధంగా తోడ్పడ్డాయి?

**జవాబు:** ఈ విషయాన్ని నేను నా "కాషాయ కెరటం" (శాఫ్రన్ వేవ్) అన్న గ్రంథంలో చర్చించాను. మొదట్లో బిజెపి ఈ విధానాలను తీవ్రంగా విమర్శించింది. ఆరెస్సెస్ లోని పాతతరం నాయకులంతా ఆ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ విధానాలు పాశ్చాత్యవినిమయ ధోరణులకు, నైతిక దిగజారుడుకు, అతి పాశ్చాత్యీకరణకు దారి తీస్తాయని ఆందోళన చెందారు. ఎస్.గురుమూర్తి అనే ఆరెస్సెస్ వ్యక్తి నాయకత్వంలో 'స్వదేశీ జాగరణ్ మంచ్' అనే సంస్థకూడా ఏర్పడింది. నయా–ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయంగా ఆధునిక తరహా స్వదేశీ విధానాన్ని ప్రతిపాదించింది. అయితే, 1990 దశకం మధ్యలో బిజెపి తన పల్లవి మార్చింది.

మొదట్లో ఉదారవాద విధానాలపట్ల విముఖతకు కారణం బిజెపి ఫక్తు మితవాద పార్టీగా ఆనాడు లేకపోవడమే. అమెరికాలోని రిపబ్లికన్ పార్టీ అటువంటి ఫక్తు మితవాద పార్టీకి నమూనాగా చెప్పుకోవచ్చు. స్వేచ్ఛా మార్కెట్‌కు, వ్యక్తుల సంపదను పెంచుకోడానికి ఎటువంటి అవధులూ ఉండరాదనేది ఆ పార్టీ విధానం. అటువంటి భావాలను మొదట్లో ఆరెస్సెస్ లోని చాలామంది ఆమోదించేవారు కాదు. ఇప్పటికీ వారిలో కొందరికి ఈ భావాలంటే పడదు.

ఈ తరహా నాయకులు ఆర్థిక విధానాలలో ఉదారవాదం అంటే విముఖత కలిగి వుండడమే కాదు, కుటుంబం, సంస్కృతి వంటి అంశాలలో ఉదారవాద భావాలను తీవ్రంగా వ్యతిరేకిస్తారు కూడా. కేవలం కొద్దిమంది చేతుల్లో అపారమైన సంపద పోగుపడడాన్ని కూడా వారు వ్యతిరేకించారు. అయితే బిజెపి అధికారంలోకి వచ్చిన చోట్ల ఆ పార్టీ నేతల్లో కొంతమంది ఆ అధికారాన్ని అడ్డం పెట్టుకుని బాగా సంపద పోగేసుకున్నారు. ఈ పాతతరం వారు ఆ ధోరణులను వ్యతిరేకించారు.

1990 దశకంలో బిజెపి తన రాజకీయ పాట పల్లవి మార్చింది. 1998లో వాజ్‌పేయి ప్రధాని అయ్యేనాటికి బిజెపి పూర్తిగా కాంగ్రెస్ తాలూకు సరళీకరణ విధానాలను భుజానికెత్తుకుంది. ఈ విధమైన మార్పు రావడానికి ఒక దశాబ్ద కాలం పట్టింది. బిజెపిలోని ప్రమోద్ మహాజన్ వంటివారు పూర్తిగా నయా–ఉదారవాద విధానాలకు అనుకూలం. ఆ కాలంలో 'కర' సేవకులకు, 'కారు' సేవకులకు మధ్య ఉండే తేడాను గురించి జోకులు వేసుకునేవారు కూడా. 1990 దశకంలో ఈ విధానాలు దేశంలో పరిస్థితులు పెనువేగంగా మార్పుకు దారి తీస్తున్నాయని, అనేక కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు భావించేలా చేశాయి. కొత్త కొత్త భవనాలు లేచాయి. డబ్బు సంపాదించి ధనవంతులు కావడానికి కొత్త కొత్త పద్ధతులు వచ్చాయి. వినిమయ సంస్కృతి వచ్చింది. పాత, కొత్త తరాల మధ్య అంతరం పెరిగింది. ఈ పెనుమార్పులు సృష్టించిన ప్రభావం బిజెపి ఓట్ల వేటకు అనువైన పరిస్థితులను కలిగించింది.

ఇన్ని మార్పుల మధ్య "మేము భారతీయ విలువలకు కట్టుబడివున్నాం" అన్న బిజెపి సందేశం ఆ పార్టీకి ఒక మితవాద వైఖరిని అవలంబించడానికి వీలు కల్పించింది. ఆ వైఖరి ఆధునిక కాలానికి అనుగుణంగా ఉంటూనే సాంప్రదాయ భారతీయ విలువలకు కూడా కట్టుబడివుండే లక్షణాన్ని కలిగివుంది. ఇది చాలామంది వోటర్లను ఆకర్షించింది. ఆ విధంగా, పరోక్షంగా నయా–ఉదారవాద విధానాలు బిజెపి అధికారంలోకి రావడానికి దోహదం చేశాయి. అంతే తప్ప ఆ విధానాలు స్వతహాగా బిజెపి విధానాలైతే కావు.

**ప్రశ్న:** అసలు బిజెపికి ఒక పొందికైన ఆర్థిక విధానం అంటూ ఏదైనాఉందా?

**జవాబు:** లేదు. అటువంటిది ఏదీ వాళ్ళకి ఉందని నేను భావించడంలేదు. వాజ్‌పేయి కాలంలో వాళ్ళు చేసిందల్లా కాంగ్రెస్ ప్రవేశపెట్టిన విధానాలను ఆచరణలో కొనసాగించడమే. ఎటువంటి గణనీయమైన మార్పులనూ వారు తీసుకురాలేదు. స్వదేశీ జాగరణ్ మంచ్‌ని పూర్తిగా పక్కకు నెట్టేశారు. ప్రభుత్వ పెత్తనం కింద నడిచే ఆర్థిక వ్యవస్థవైపు వెనక్కి మళ్ళాలని వారిలో ఎవరూ అనుకోలేదు. యువతరంలోను, కొత్తగా ముందుకొచ్చిన మధ్యతరగతిలోను నయా–ఉదారవాద విధానాలు బాగా సానుకూలతను సంపాదించాయి. ఈ కొత్త మధ్యతరగతి వోట్లను గెలుచుకోవాలని బిజెపి భావించింది. ఎందుకంటే ఆ తరగతి దగ్గర డబ్బు ఉంది, ఆకాంక్షలున్నాయి, ఆశలున్నాయి.

కాబట్టి ఈ రోజు బిజెపి అనుసరించే ఆర్థిక విధానాలు ఓ పద్ధతీ పాడూ లేకుండా ఉన్నాయి. జిఎస్‌టి బిల్లునే తీసుకోండి. అది యుపిఎ హయాంలోనే తయారైంది. వ్యవసాయ చట్టాలనే తీసుకోండి, అదేమీ వాళ్ళ బుర్రల్లోంచి వచ్చినది కాదు. ఆ చట్టాల్లోని చాలా అంశాలు యుపిఎ హయాంలోనే మొదలయ్యాయి. కొన్ని సగం సగం అమలులోకి వచ్చాయి కూడా. ఆరెస్సెస్‌లో చాలా మందికి రిజర్వేషన్లు అంటే పడదు. కాని ఈ రోజు బిజెపి ఆ రిజర్వేషన్లను ఏమైనా అటూ ఇటూ మార్చగలదా? లేదు. ఎందుకంటే ఇప్పుడు వాళ్ళకి దేశంలో చాలా చోట్ల ఒబిసిల్లో, దళితుల్లో మద్దత్తుదార్లు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలో ప్రయోజనాలు పొందలేకపోయిన కొన్ని పారిశ్రామిక బృందాలకి ఇప్పుడు బిజెపి చాలా రకాలుగా సానుకూలంగా వ్యవహరిస్తోంది. అయినప్పటికీ, అది అనుసరిస్తున్న ఆర్థిక విధానాల్లో మౌలికంగా ప్రత్యేకమైన మార్పులు అంటూ ఏవీ లేవు. బహుశా పెద్ద నోట్ల రద్దు అనేది ఒక్కటే బిజెపి మార్కు ఉన్న విధానం అని చెప్పొచ్చు.

దాని వలన నరేంద్రమోడీకి తాత్కాలికంగా విజయం లభించినట్టు అనుకున్నా, అవినీతిని అరికట్టడం గానీ, నల్ల ధనం నిర్మూలన గానీ, ఆర్థిక వ్యవస్థప్రక్షాళన గానీ ఏదీ జరగలేదు. వెనక్కి తిరగి చూసుకుంటే పెద్దనోట్ల రద్దు కార్యక్రమం అమలు జరిగిన తీరు అనేక అనుమానాలకు దారితీస్తున్నది కూడా.

**ప్రశ్న:** ఆర్థిక విధానాల విషయంలో బిజెపికి, కాంగ్రెస్‌కు మధ్య తేడా ఏమైనా ఉందా?

**జవాబు:** 2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు చాలామంది వ్యాపారవేత్తలు అనేక ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ కన్నా ఎక్కువగా సరళీకరణను వేగవంతం చేస్తాననీ, ఎన్నో సంస్థలను ప్రైవేటీకరిస్తాననీ, అనేక ఆంక్షలను ఎత్తివేస్తాననీ మోడీ 2014లో అన్నాడు. కాని వాస్తవానికి ఆ విధంగా జరగలేదు.

ఆర్థిక రంగం గురించి, పారుబకాయిల గురించి ఆలోచిద్దాం. ఈ సమస్యను అప్పటికే కాంగ్రెస్ పార్టీ గుర్తించింది. కాని ఇప్పటికీ ఆ విషయంలో బిజెపి నిర్ణయాత్మకంగా వ్యవహరించలేకపోతున్నది. కొత్త విధానాలను రూపొందించడంలో కాంగ్రెస్ పార్టీ బిజెపి కన్నా చాలా మెరుగు. కాంగ్రెస్ దగ్గర చాలా మంది టెక్నోక్రాట్స్ ఉన్నారు. ఇందులో సందేహంలేదు. యుపిఎ ప్రవేశపెట్టిన చాలా సంక్షేమ పథకాలను, సంక్షేమరాజ్యాన్ని బిజెపి ఇప్పుడు ధ్వంసం చేస్తున్నది అని చెప్పడం వాస్తవ పరిస్థితిని సరిగ్గా వివరించదు. నిజానికి బిజెపి కూడా చాలా సంక్షేమ పథకాలను తీసుకువస్తోంది.

కొన్ని దశాబ్దాలుగా భారతీయులు ప్రభుత్వాల నుండి సహాయాన్ని ఆశించడానికి, చాలా రంగాల్లో ప్రభుత్వమే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరడానికి అలవాటు పడ్డారు. ఆ పరిస్థితిని మార్చడానికి బిజెపి ప్రయత్నించడం లేదు. ఎందుకంటే బిజెపి ఆ పని చేయలేదు. అధికారంలో కొనసాగడానికి బిజెపి చాలామంది ప్రజలు ఆశిస్తున్నమేరకు స్పందించాల్సివుంది.

ఒకవేళ కాగ్రెస్ మళ్ళీ అధికారంలోకి గనుక వస్తే విద్యా విధానంలో, సాంస్కృతిక విధానంలో, మైనారిటీలకు సంబంధించిన విధానంలో చాలా పెద్ద మార్పులు ఉంటాయని నేను భావిస్తున్నాను.

అయితే, పెట్టుబడులు, ఆర్థిక వ్యవస్థపై నియంత్రణలను తొలగించడం, ప్రైవేటీకరణ, ఆర్థిక సంస్కరణలు వంటి అంశాలలో కాంగ్రెస్ కూడా ఇప్పటి విధానాన్నే అమలు చేస్తుంది. అరుణ్‌శౌరి బిజెపి ప్రభుత్వాన్నుంచి బైటకు వచ్చినప్పుడు చెప్పి విషయాలు నాకు గుర్తున్నాయి. బిజెపికి, కాంగ్రెస్‌కి మధ్య తేడా పెద్దగా లేదని ఆయన అన్నాడు. బిజెపి అంటే "కాంగ్రెస్ ప్లస్ కౌ " (కాంగ్రెస్ కి గోవుని కలిపితే అదే బిజెపి) అన్నాడు.

**ప్రశ్న:** దేశంలోని మితవాద ఉద్యమానికి ప్రవాస భారతీయులనుండి ఏమేరకు నిధుల తోడ్పాటు లభిస్తోంది? హిందూ జాతీయవాద ఉద్యమాలకు అందుతున్న నిధుల గురించి మీకు ఏ మేరకు అవగాహన ఉంది?

**జవాబు:** విదేశాలనుండి నిధులను సమీకరించడానికి చాలా ప్రాముఖ్యత ఉంది. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి రెండు సంవత్సరాలలోనూ ఏం చేశారో చూడండి. అతను న్యూయార్క్ వచ్చి అక్కడి అభినందన సభలో పాల్గొన్నారు. నేను నివసించే సిలికాన్ వ్యాలీ ప్రాంతానికి వచ్చాడు. గల్ఫ్ దేశాలకు వెళ్ళాడు. లండన్, కెనడా, ఆస్ట్రేలియా పర్యటించాడు. ఇవన్నీ విదేశాల్లో నిధులను సేకరించడానికి చేసిన పర్యటనలే. ప్రవాస భారతీయుల్లో అత్యంత సంపన్నులు జీవించే ప్రాంతాలన్నింటికీ అతను వెళ్ళాడు. వాళ్ళు కూడా తాము నివసించే దేశాల్లో హిందూత్వ గురించి ప్రచారం చేయడానికి ఉత్సుకతతో ఉన్నారు. ఇక్కడ ఎక్కువమంది ఎన్‌ఆర్‌ఐలు డెమాక్రటిక్ పార్టీకి వోటు చేస్తారు. వారిలో ఎక్కువమంది బిజెపికి ఆర్థికంగాను, రాజకీయంగాను మద్దత్తు ఇస్తారు.

### వామపక్షాలముందున్న కర్తవ్యం

**ప్రశ్న:** హిందూత్వ ఉద్యమానికి గట్టి ప్రతిఘటన ఇచ్చేది వామపక్షాలు మాత్రమే అని మీరు భావిస్తున్నారా?

**జవాబు:** భారతదేశంలో వామపక్షాలు కొంత పునరాలోచన చేయాలని నేను అనుకుంటున్నాను. కేరళలో వామపక్షాలు విజయాలు సాధిస్తున్నాయి. అక్కడ దేశంలోకెల్లా అత్యుత్తమమైన ప్రజారోగ్య వ్యవస్థని, ప్రజా పాలనా వ్యవస్థని అవి నెలకొల్పడమే ఆ విజయాలకు కారణం. మొత్తంగా చూస్తే భారతదేశంలో రాజకీయ శక్తుల పునస్సమీకరణ జరుగుతోందని నేను భావిస్తున్నాను. 1980 దశకంలో ముందుకొచ్చిన కుల రాజకీయాలు వ్యవస్థాపరంగా శాశ్వత ప్రభావాన్ని కలిగించే మార్పులను తీసుకురాలేకపోయాయి. బిఎస్‌పి బలంగా ముందుకొచ్చినా, చిహ్నాలమీద చూపించిన శ్రద్ధ ఆర్థిక, వ్యవస్థాపర సంస్కరణలపై చూపలేకపోయింది.

సంక్షేమ పథకాల అమలును సమర్ధవంతంగా నిర్వహించడంలో, పాలనలో అవినీతిని కనిష్టస్థాయిలో ఉంచడంలో వామపక్షాలు ఆదర్శవంతమైన ఉదాహరణలను నెలకొల్పాయి. కానీ ఇంకా చేయాల్సింది చాలా ఉంది. వామపక్షాలు ఇతర శక్తులను కలుపుకురావలసివుంది. దేశంలో బలంగాపెరుగుతున్న దళిత ఉద్యమానికి వామపక్షాలకు మధ్య సంబంధం కొంత వత్తిడికి గురవుతోంది. దళితులనుండి, గిరిజనులనుండి బిజెపికి చాలా ప్రతిఘటన ఎదురౌతోంది. కాని ఆ తరగతులకు, వామపక్షాలకు మధ్య సంబంధం అంత స్పష్టంగా ఉండడం లేదు. ఒబిసి ఉద్యమాలతో కూడా కలిసి వ్యవహరించాల్సివుంటుంది. కాని అది కష్టం. దళితులు, గిరిజనులు, ముస్లింలు, మైనారిటీలు కలిస్తే జనాభాలో మెజారిటీ భాగం అవుతారు. బిజెపి పాలనలో అత్యధికంగా బాధలు పడుతున్నది వాళ్ళే. ఈ శక్తులనన్నింటినీ సమీకరించాలి.

### కాంగ్రెస్ పాత్ర

**ప్రశ్న:** దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు హిందూత్వ ఉద్యమాన్ని ప్రతిఘటించే విషయంలో పాత్ర ఉందా?

**జవాబు:** తప్పకుండా ఉంది. దేశవ్యాప్త ఉనికి ఉన్న ఏకైక ప్రతిపక్షపార్టీ కాంగ్రెస్. అందుచేత కాంగ్రెస్‌కు పాత్ర తప్పకుండా ఉంది. అయితే అందుకు ఆ పార్టీ బిజెపి కంటె భిన్నమైన కార్యక్రమాన్ని చేపట్టాలి. కాంగ్రెస్ ఆర్థిక విధానాలను బిజెపి స్వాధీనం చేసుకుంది. అది ప్రధాన సమస్య. అందుచేత బిజెపి కంటె విభిన్నంగా ఉండే స్పష్టమైన కార్యక్రమాన్ని కాంగ్రెస్ తీసుకోవలసివుంటుంది.

దేశంలో చాలా చోట్ల జరుగుతున్న హింసకు కారకులైనవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా బిజెపి పోలీసు బలగాలను దుర్వినియోగపరుస్తోంది. ముస్లింలకు, దళితులకు, ఇతర నిమ్న కులాలవారికి నిరంతరంగా ముప్పు ఎదురౌతున్నది ఈ పోలీసులనుంచే. ఇది వాస్తవం. పోలీసుల చేతుల్లో ఆ తరగతుల ప్రజలు హింసలను అనుభవిస్తున్నారు. తీరని అన్యాయం వారికి జరుగుతోంది. కాని పోలీసు వ్యవస్థను, న్యాయ వ్యవస్థను సంస్కరించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా దేశంలో ఎవరూ చూడడం లేదు.

నేనే గనుక కాంగ్రెస్‌కు చెందిన రాజకీయనాయకుడిని అయితే, పోలీసు వ్యవస్థను, న్యాయవ్యవస్థను సంస్కరించడం నా ఎజండాలో ప్రథమ ప్రాధాన్యత కలిగిన అంశంగా తీసుకుంటాను. దేశంలో అందరికీ న్యాయం అమలు జరిగేలా చేయడం అన్నింటికన్నా ముఖ్యం. దేశంలో ఎక్కువమంది సామాన్య ప్రజలు వాక్స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛగా

తిరగగలడాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, చట్టబద్ధమైన పాలను బాగా ఇష్టపడతారు, కోరుకుంటారు. దేశంలో సంపన్నుల్లో ఎక్కువమందికి ఇవి ఇష్టం లేదు. పైగా ఈ ఆదర్శాలను దెబ్బతీసి తమ స్వంత ప్రయోజనాలను నెరవేర్చుకోడానికే వారు ఎక్కువగా ప్రయత్నిస్తూంటారు. ప్రతిపక్షాలు ఈ వైరుధ్యం మీదనే ప్రధానంగా కేంద్రీకరించాలి.

**ప్రశ్న:** రైతుల ఉద్యమాన్ని, వారి విజయాన్ని మీరెలా అంచనా వేస్తారు?

**జవాబు:** వారి దృఢదీక్ష పట్ల నేనెంతో ముగ్ధుడనయ్యాను. 2019–20లో పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా జరిగిన నిరసనోద్యమాలు, ఆ తర్వాత ఈ రైతుల ఉద్యమం భారతదేశంలో ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టేందుకు దోహదపడ్డాయి. దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చాలా మెరుగుపడవలసివుండగా రైతు చట్టాలు అందుకు భిన్నంగా బడా పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందాయి. ఇప్పుడు రైతులు విజయం సాధించారు గనుక బిజెపి ఒక మెరుగైన విధానంతో ముందుకు రావాలి. ఒక మంచి విధానాన్ని రూపొందించగలవారు వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా సరైన విధానాన్ని రూపొందించాలి.

అయితే మంచి, ఆచరణాత్మక విధానాలను రూపొందించడమెలాగో బిజెపికి ఇంకా తెలిసినట్టు లేదని నేను అనుకుంటున్నాను. నాయకులను గొప్పగా చూపించడం, సిద్ధాంతాలను వల్లించడం ఎంత చేసినా మంచి పరిపాలనకు అవి ఎన్నడూ సాటిరావు. మంచి పాలన చేయకుండా ఎవరూ అధికారంలో నిలదొక్కుకోలేరు. కోవిడ్–19కి తగిన విధంగా స్పందించడంలో, సిఎఎ విషయంలో, రైతుల ఉద్యమం విషయంలో మోడీ ప్రభుత్వం చాలా దెబ్బతింది. **మోడీ మాయాజాలం ఇప్పుడు పని చేయడంలేదు. ఈ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ప్రజలు ఇప్పుడు భయపడడం లేదు. ఇదొక మంచి పరిణామం. నగటు భారతీయుడు అధికారాన్ని, అన్యాయాన్ని ఎదిరించి ప్రశ్నించడానికి చూపే సంసిద్ధత, ధైర్యం చూస్తే నాకెంతో గొప్పగా అనిపిస్తుంది. ఆ స్ఫూర్తి మళ్ళీ ఇప్పుడు కనిపిస్తోంది. దేశానికి ఇదెంతో శుభపరిణామం.**

**ప్రశ్న:** గణనీయమైన సంఖ్యలో మైనారిటీలు ఉన్న ఈ దేశంలో హిందూ జాతీయవాదం భవిష్యత్తు ఏ విధంగా ఉండబోతుంది?

**జవాబు:** హిందూ జాతీయవాదం ఒక సెంటిమెంటుగా, ఒక సిద్ధాంతంగా భారతదేశంలో చాలా కాలంపాటు కొనసాగుతుంది. అయితే భారతదేశం చాలా పెద్ద దేశం. చాలా వైవిధ్యభరితమైన, సంక్లిష్టమైన దేశం. ఇక్కడ బిజెపి తన అత్యంత కేంద్రీకృత స్వభావంతో నిలదొక్కుకోలేదు.

కాంగ్రెస్ మాదిరిగా ఓ 50 ఏళ్ళు నిరాఘాటంగా తానూ పరిపాలించగలనని బిజెపి కలలు కంటోంది. ఇది వారి కలే. అది నెరవేరే అవకాశాలు చాలా తక్కువ. ఇతర రాజకీయ సమీకరణలు ముందుకొస్తాయి. వాటిలో కొన్ని హిందూ జాతీయవాద స్వభావాన్ని కలిగినవి కూడా ఉండొచ్చు. తక్కినవాటిలో ప్రాంతీయ రాజకీయ అస్థిత్వాల ప్రాతిపదికన ఉండేవి ఎక్కువగా ఉంటాయి.

భారతదేశంలో హిందూ జాతీయవాదం ప్రాధాన్యత చాలాకాలం ఉంటుంది. ఒక రాజకీయపరమైన భావనగానే గాక సాంస్కృతిక విలువల పరంగా కూడా దాని ప్రభావం ఉంటుంది. వాళ్ళు పాఠశాలల్లో సిలబస్‌ను, బోధనాంశాలను మార్చేశారు. కీలకమైన అధికార స్థానాల్లో వారి మనుషుల్ని కూచోబెట్టారు. అధికార యంత్రాంగంలో సైతం ఉన్నారు. దాని ప్రభావం దీర్ఘకాలంపాటు



మోడీ మెడలు వంచిన రైతు ఉద్యమం

కొనసాగుతుంది. కాని ఈ దేశాన్ని ఒక కేంద్రీకృత పాలన కింద, అగ్రకులాలు నిర్దేశించిన విధంగా దేశమంతా ఒకే తీరుగా నడిపించాలనే వారి కల కేవలం ఒక కలగానే ఉండిపోతుంది. భారతీయుల్ని గురించి తెలుసుకోండి. ఈ దేశంలోని వైవిధ్యాన్ని, భిన్న జాతులను, భిన్న ఆకాంక్షలను తెలుసుకోండి. ఆ భిన్నత్వమే బిజెపి కల నెరవేకుండా అడ్డు పడుతుంది.

**ప్రశ్న:** హిందూజాతీయవాద ఉద్యమాలు పెరగం వలన ముస్లిం మత ఉద్యమాలమీద ఎటువంటి ప్రభావం పడింది?

**జవాబు:** ఆరెస్సెస్, బిజెపి అమలు చేస్తున్న అత్యంత ప్రమాదకరమైన వ్యూహం భారతీయ ముస్లింలను ఎటూ పోలేని ఓ మూలకి నెట్టివేస్తోందని చెప్పాలి. 20 కోట్లకు పైగా ఉన్న జనాభా విషయంలో అదే విధంగా ఎల్లకాలమూ ఎటువంటి పర్యవసానాలూ లేకుండా చేయడం ఎవరికీ సాధ్యం కాదు. భారతదేశంలో ముస్లింలు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిలోనూ అనేక వైవిధ్య భరితమైన సమూహాలు ఉన్నాయి. స్వతంత్రం వచ్చిన తర్వాత కాలంలో ఎప్పుడూ లేనంతగా ప్రస్తుతం వారిలో పేదరికం పెరిగింది. చదువులో వెనుకబడ్డారు. ఆర్థిక వ్యవస్థలో ఓ పక్కకు నెట్టబడ్డారు. లోక్‌సభలో అతి తక్కువ ప్రాతినిధ్యం వారికి ఉంది. రాష్ట్రాల్లోనూ అదే పరిస్థితి.

వారి జీవితాలమీద, వారి హక్కులమీద ఇంత తీవ్రంగా, నిరంతరాయంగా దాడి జరుగుతున్నా ముస్లింలలో అత్యధిక మెజారిటీ ప్రశాంతంగా, నిబ్బరాన్ని కోల్పోకుండా హుందాగా వ్యవహరించడం చాలా గొప్ప విషయంగా నేను భావిస్తాను. కాని వారి తరఫున ప్రాతినిధ్యం వహించడానికి ఎంఐఎం మరికొన్ని పార్టీలు తప్ప వేరే ఎవరూ లేకపోవడం చూస్తే గుండెలు బద్దలవుతున్నాయి. ప్రతిపక్షాలలో చాలా ఎక్కువ భాగం ముస్లింల హక్కుల గురించి మాట్లాడడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. ఇది తీవ్ర నిరుత్సాహాన్ని కలిగిస్తున్నది. ఆ పని చేయకుండా కేవలం లౌకిక విలువలగురించి, గతంలో అవి ఎంత గొప్పగా అమలు జరిగాయో ఆ జ్ఞాపకాలగురించి ఎంత మాట్లాడినా ఉపయోగం ఏమిటి ?

ఈ విషయంలో మమతా బెనర్జీ ఒక్కరే మినహాయింపు. అందుకు ఆమెను ప్రశంసించాలి. భారతీయ ముస్లింలకు ఇంతకన్నా మెరుగైన, ధైర్యం కలిగిన నాయకత్వం అవసరం. కేవలం వారి మతపరమైన హక్కుల గురించే కాకుండా, వారి పేదరికాన్ని గురించి, సమాజంలో సముచిత స్థానం లేకపోవడం గురించి లేవనెత్తగల నాయకత్వం కావాలి. సామాజికంగా వెలివేయబడుతున్న పరిస్థితుల గురించి, పోలీసుల వేధింపులగురించి, లైంగిక వివక్షత గురించి, కులం పేరుతో, ఉపకులం పేరుతో పెరుగుతున్న విభజనలగురించి లేవనెత్తగల నాయకత్వం కావాలి. అన్ని వైపులా శత్రుమూకలు ఆవరించివున్న స్థితిలో అటువంటి మార్పు రావడం అంత తేలికైన విషయం కాదు. ❊

ఉద్యమం

# వామపక్షాల పయనం ఎటు?

**ఎస్ వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

రానున్న ఎన్నికలలో సీపీఐ(ఎం) దారి ఎటు?

కేంద్రకమిటీ సమావేశాల సందర్భంగా అగ్ర నాయకత్వంతో కేసీఆర్ చర్చల అర్థమేమిటి?

హుజూరాబాద్, సాగర్ ఉపఎన్నికల సందర్భంగా ఎత్తుగడల సారాంశం ఏమిటి?

కాంగ్రెస్‌తో కలిసి 19 పార్టీల ఐక్య కార్యాచరణ ఎందుకు జరిగినట్టు?

ఇవన్నీ తెలంగాణలో ఇప్పుడు చర్చనీయాంశాలే. సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భం కూడా కావటం ఇందుకు మరో కారణం. సాగర్‌లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించినపుడు, ఇక టీఆర్ఎస్‌తో రానున్న ఎన్నికలలో జతకడతారన్న చర్చ నడిచింది. ఖమ్మం మునిసిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతునీయటం, జాతీయస్థాయి 19 పార్టీల పిలుపులో భాగంగా ఇక్కడ కాంగ్రెస్‌తో కూడా కలిసి ధర్నా చేయటంతో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తారన్న ఊహాగానాలు జరిగాయి. స్థూలంగా వామపక్షాలు ఎవరితో పొత్తు పెట్టుకుంటాయన్న విషయం చుట్టే చర్చ తిరుగుతున్నది. నిజానికి సీపీఐ(ఎం) ఎత్తుగడలలో స్పష్టత లేక కాదు. అయినా అపార్థాలకు అవకాశం ఎందుకొచ్చింది? ఇవన్నీ రాష్ట్ర 3వ మహాసభ చర్చించి మరింత స్పష్టతనిచ్చింది. రానున్న మూడు సంవత్సరాలలో సాధించవల్సిన లక్ష్యాల గురించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసింది. రాష్ట్ర ప్రజల ముందు, ప్రజాస్వామ్యవాదుల ముందు నిర్దిష్ట ప్రతిపాదనలు ఉంచింది. ప్రజా ఉద్యమాలకు పిలుపునిచ్చింది.

రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలన పట్ల వివిధ తరగతులలో పెరుగుతున్న అసంతృప్తిని ఆసరా చేసుకుని బీజేపీ పాగా వేయాలని ప్రయత్నిస్తున్నది. ప్రజలలో అసంతృప్తి పెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాలతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలు కూడా కారణం. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలు మరింత దూకుడుగా అమలు చేస్తున్నారు. ఇన్స్యూరెన్స్, బ్యాంకు, రక్షణ రంగాలతో సహా అన్నింటి ప్రైవేటీకరణకు పూనుకుంటున్నారు. మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు కట్టబెడుతున్నారు. బడా పెట్టుబడిదారులకు పండగ రోజులుగా ఉన్నాయి. టాటా, బిర్లాలే కాదు, అంబానీ, అదానీల సంపద ఇప్పుడు ఆకాశమే హద్దుగా పెరుగుతున్నది. కరోనా కాలంలో కూడా బడా బాబులకు సంపద దోచిపెట్టారు. ఫార్మా రంగంలో కొత్త శతకోటీశ్వరులను తయారుచేసారు. కరోనాకు ముందే ఆర్థికవ్యవస్థ మందగమనంలోకి పోయింది. ఐసీయూలో ఉన్నదని ప్రధాని ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేసిన అరవింద సుబ్రహ్మణ్యం చెప్పారు. అప్పటికే గత నాలుగున్నర దశాబ్దాలలో ఎప్పుడూ లేనంత నిరుద్యోగం దేశంలో పెరిగిందని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ తేల్చింది. కేంద్ర ప్రభుత్వ సంస్థే ఇంతటి నిజాన్ని తేల్చి చెప్పటం మోడీ ప్రభుత్వానికి మింగుడుపడలేదు. దీనికి తోడు రెండేండ్లుగా కరోనా విస్తరించింది. కేంద్రంలో బీజేపీ సర్కారు కరోనా కట్టడికి బాధ్యత వహించలేదు. రాష్ట్రాల మీద బాధ్యత నెట్టి చేతులు దులుపుకున్నది. పెట్రోలు, డీజిల్ ధరలు బాగా పెంచింది. చరిత్రలో ఎప్పుడూ లేనంతగా నిత్యజీవితావసర సరుకుల ధరల పెరుగుదలకు దారితీసింది. అధికారాలు, వనరులు కేంద్రం గుప్పిట్లోకి తీసుకున్నది. కార్మిక చట్టాలు రద్దు చేసింది. వ్యవసాయరంగాన్ని కూడా అంబానీ, అదానీల చేతుల్లో పెట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం మూడు రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి, వ్యవసాయ రంగం మీద దాడికి ప్రయత్నించింది. రైతాంగ సుదీర్ఘ పోరాటంతో తాత్కాలికంగా చట్టాలు ఉపసంహరించుకున్నది. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని అణచివేసేందుకు నియంతృత్వ పోకడలు అమలుచేస్తున్నది. రాష్ట్రాల హక్కులు హరిస్తూ, ఫెడరల్ వ్యవస్థమీద దాడికి పూనుకున్నది. బడాబాబుల చేతుల్లో సంపద పెట్టడానికి అన్ని రాష్ట్రాలు తమ చేతుల్లోకి రావాలని భావిస్తున్నది. ఇందులో భాగంగానే దక్షిణాదిలో తెలంగాణ మీద కన్నువేసింది.

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసే విధానాలు గతంలో కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ అమలుచేస్తున్న విధానాలకు భిన్నంగా ఏమీ లేవు. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటం వల్ల వచ్చిన సానుకూలతతో పాటు సంక్షేమ పథకాలతో ప్రజల ఓట్లు పొందగల్గింది. కానీ తక్షణం ఓట్లు తెచ్చే పథకాలను మాత్రమే ఎంతోకొంత అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నది. దళితులకు, గిరిజనులకు మూడెకరాల భూమి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ప్రభుత్వ శాఖలలో ఖాళీ పోస్టుల భర్తీ లాంటి వాగ్దానాలు అమలు చేయలేదు. ఇవి ప్రజల జీవితాలలో మార్పుతెచ్చే చర్యలు. కేవలం తాత్కాలిక ఉపశమనం కల్గించే పింఛన్లు, రైతుబంధు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ లాంటి పథకాలు మాత్రమే ఎంతోకొంత అమలుకు సిద్ధపడ్డారు. నిరుద్యోగ భృతి కూడా అమలుచేయలేదు. భూస్వాములకు, ధనిక రైతులకు, సాగులో లేనివారికి కూడా రైతుబంధు ఇవ్వడానికి సిద్ధపడ్డారు... కానీ కౌలు రైతులకు మాత్రం నిరాకరించారు. హరితహారం పేరుతో పోడుభూములు గుంజుకునే ప్రయత్నం చేసారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో అస్సైన్డ్ భూములు గుంజుకుంటున్నారు. రైతుల భూములు కారుచవకగా కాజేస్తున్నారు. గొర్రెలు, చేపలు, దళితబంధు పేరుతో కొద్దిమందికి మాత్రం

> ❝ బీజేపీ ప్రయత్నాలను నిలవరించే ప్రయత్నం చేయటంలో ఇంతకాలం టీఆర్ఎస్ అవకాశవాదం ప్రదర్శించింది. జీఎస్టీ వాటా కోసం గానీ, ప్రణాళికా నిధుల కోసం గానీ, కరోనా కట్టడికి నిధుల కోసం గానీ కేంద్రంతో పోరాడటానికి ఊగిసలాడింది. లాలూచీ కుస్తీ నడిపింది. తనకు రాజకీయంగా అవసరమైనపుడు గట్టిగా మాట్లాడి, తర్వాత రాజీపడటం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం మళ్ళీ కేంద్ర బీజేపీ సర్కారు విధానాల పట్ల గట్టిగా మాట్లాడుతున్నది. ❞

సహాయం చేసి గ్రామాల్లో క్రీమీలేయర్ తయారీ మీద దృష్టి సారించారు. ఎక్కువమందికి ఆర్థిక సహాయం అందే ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, ఎంబీసీ కార్పొరేషన్, వృత్తుల ఫెడరేషన్లను నిర్లక్ష్యం చేస్తున్నారు. కోటిమంది కార్మికుల కనీస వేతనాల సవరణకు సిద్ధంగా లేదు. వ్యవసాయ కూలి, కౌలురైతుల మాట ఉచ్ఛరించడానికే సిద్ధంగా లేరు. పారిశ్రామికవేత్తలకు మాత్రం అనుమతులు సులభతరం చేయటమే కాదు, పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తున్నారు. భూమితో సహా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. భూ ఆక్రమణదార్లకు, కాంట్రాక్టర్లకు అన్నీ అనుకూలమే. అసంతృప్తి చెందిన ప్రజలు ప్రశ్నించే అవకాశం లేదు. నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. వినతిపత్రాల స్వీకరణకు కూడా నిన్నమొన్నటిదాకా సిద్ధపడలేదు. ముఖ్యమంత్రి ఇప్పటికీ సిద్ధంగా లేరు.

కాంగ్రెస్‌గానీ, మరే ప్రతిపక్షంగానీ మిగలవద్దన్న లక్ష్యంతో ఆపరేషన్ ఆకర్ష్ ప్రయోగించారు. నియోజకవర్గాల పెంపుతో వీరందరినీ సర్దుబాటు చేయవచ్చునని పథకరచన చేసారు. అసంతృప్తి చెందిన ప్రజలకు ప్రతిపక్షాలకు చెందిన క్షేత్రస్థాయి నాయకులు అందుబాటులో లేకుండా ఒక శూన్యత సృష్టించారు. వామపక్షాలకు అంత విస్తృతమైన యంత్రాంగం లేకపోవటం ఒక బలహీనత. ఈ శూన్యతను ఉపయోగించుకునే ప్రయత్నంలో బీజేపీ ఉన్నది. నియోజకవర్గాల పెంపుదల జరగనందువల్ల ఇతర పార్టీల నుంచి వచ్చినవారందరినీ సంతృప్తిపర్చగలిగిన స్థితిలో టీఆర్ఎస్ నాయకత్వం లేదు. ఒక దశలో కాంగ్రెస్ నాయకత్వ శ్రేణులను బీజేపీ ఆకర్షించే వాతావరణం ఏర్పడింది. కాంగ్రెస్ నాయకత్వం మారిన తర్వాత, ప్రస్తుతానికి, కాంగ్రెస్ నాయకత్వ శ్రేణుల నుంచి ఫిరాయింపులు ఆగాయి. ఒకవైపు వివిధ తరగతుల ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని, మరోవైపు టీఆర్ఎస్ శ్రేణులలో పెరుగుతున్న అసంతృప్తిని బీజేపీ ఉపయోగించుకోజూస్తున్నది. వీటితో పాటు ప్రజలలో మతపరమైన విభజన సృష్టించే ప్రయత్నం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల నుంచి ప్రజల దృష్టి మరలించే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు మెజారిటీ హిందువులను మతం పేరుతో ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నది. టీఆర్ఎస్ ప్రభుత్వ విధానాల మీద పోరాటం పేరుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన పాదయాత్ర మర్మం ఇదే. చార్మినార్‌ను ఆనుకుని ఆరెస్సెస్ ఏర్పాటుచేసిన, మతఘర్షణలకు గుర్తుగా ఉన్న వివాదాస్పద గుడి దగ్గర నుంచి పాదయాత్ర ప్రారంభించటంలోనే మతాన్ని వాడుకునే ఎత్తుగడ ఉన్నది. దుబ్బాక ఉప ఎన్నికల్లో బహిరంగంగానే హిందువుల ఓట్లు అర్థించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా రోహింగ్యాల ప్రస్తావన తెచ్చారు. పాత నగరం మీద సర్జికల్ స్ట్రైక్స్ చేస్తామన్నారు. మాట్లాడితే "మేము 80 శాతం" అని మతపరమైన లెక్కలు చెపుతున్నారు. రాష్ట్రంలో ఒక ప్రమాదకరమైన శక్తిగా బీజేపీ ఎదిగే ప్రయత్నం చేస్తున్నది. ఇది రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు ముప్పు కలిగిస్తుంది.

బీజేపీ ప్రయత్నాలను నిలవరించే ప్రయత్నం చేయటంలో ఇంతకాలం టీఆర్ఎస్ అవకాశవాదం ప్రదర్శించింది. జీఎస్టీ వాటా కోసం గానీ, ప్రణాళికా నిధుల కోసం గానీ, కరోనా కట్టడికి నిధుల కోసం గానీ కేంద్రంతో పోరాడటానికి ఊగిసలాడింది. లాలూచీ కుస్తీ నడిపింది. తనకు రాజకీయంగా అవసరమైనపుడు గట్టిగా మాట్లాడి, తర్వాత రాజీపడటం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం మళ్ళీ కేంద్ర బీజేపీ సర్కారు విధానాల పట్ల గట్టిగా మాట్లాడుతున్నది. యాసంగి బియ్యం కొనుగోలుకు కేంద్రం నిరాకరించింది. రైతుల ప్రయోజనం కోసం నిలబడి కేంద్రంతో కొట్లాడవల్సింది పోయి కేంద్రం కొనుగోలు చేయటం లేదు కాబట్టి వరిపంట వేయవద్దని రైతులకే చెపుతున్నారు. ఈ ధోరణి విడనాడాలి. తెలంగాణ ప్రజల కోసం పోరాడేందుకు నికరంగా నిలబడాలి. అవకాశవాదం విడనాడాలి. కలిసొచ్చే పార్టీలను కలుపుకుని కేంద్ర నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా,

'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

> **ఈ పరిస్థితులన్నీ సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభ చర్చించింది. రాష్ట్రంలో సీపీఐ(ఎం), ఇతర వామ పక్షాలు బలపడకుండా మతోన్మాదాన్ని నిలువరించటం గానీ, ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు తేవటంగానీ సాధ్యపడదని నిర్ధారించింది. కాంగ్రెస్‌గానీ, టీఆర్ఎస్‌గానీ ప్రజావ్యతిరేక విధానాలే అమలుచేస్తాయి. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనంగా ఉండగా, బూర్జువా పార్టీల మీద ఆధారపడి కనీసం లౌకిక విలువలను కాపాడటం కూడా సాధించలేము.**

లౌకిక విలువల కోసం పోరాడాలి.

కాంగ్రెస్ వైఖరి కూడా బీజేపీకే ఉపయోగపడుతున్నది. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఈటల గెలుపుకు తోడ్పడే ఎత్తుగడలే వేసింది. అనుక్షణం పదవుల వేట, అధికారం యావ తప్ప ప్రజల గురించి ఆలోచన లేదు. ప్రైవేటీకరణ విధానాలు దేశంలో ప్రవేశపెట్టిందే కాంగ్రెసు. బడా పారిశ్రామికవేత్తలను అంటకాగిందే కాంగ్రెసు. ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతూ నియంతృత్వంగా ఎమర్జెన్సీ పాలన విధించింది కూడా కాంగ్రెస్సే. అందువల్ల కేంద్ర బీజేపీ సర్కారు అమలుచేస్తున్న ఆర్థిక విధానాల మీదగానీ, నియంతృత్వ పాలన మీద గానీ నిజాయితీగా పోరాటానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, కాంగ్రెసు, కమ్యూనిస్టులతో కూడిన 19 పార్టీల నిరసన కార్యక్రమాన్ని కూడా ఎన్నికల సభగా మలిచే ప్రయత్నం చేసింది. టీఆర్ఎస్ వ్యతిరేక సభగా మలిచేందుకు ప్రయత్నించింది. లౌకిక విలువల కోసం నిలబడే విషయంలోనూ అవకాశవాదమే!

ఇలాంటి వాతావరణంలో రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా ఎత్తుగడలు పరిశీలించాలి. ప్రస్తుత పరిస్థితిలో చిత్తశుద్ధితో పరిశీలించే వారెవరికైనా బీజేపీ ప్రమాదం అర్థం కాకుండా ఉండదు. అందుకే వామపక్షాలు సొంతంగా పోటీ చేసే శక్తి లేని నేపధ్యంలో హుజురాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. సాగర్ ఉప ఎన్నికల్లో బీజేపీ ప్రధాన పోటీదారు కాదు. అక్కడ కాంగ్రెసు, టీఆర్ఎస్‌ల మధ్యనే పోటీ. వామపక్షాలకు ఓట్లు వందల్లోనే ఉంటాయి. అందువల్ల జాతీయస్థాయిలో తాను అధికారంలో ఉన్నంతకాలం బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడుతూ, నియంతృత్వ విధానాలు అమలుచేసిన కాంగ్రెస్‌ను ఓడించే ఎత్తుగడలు వేసింది సీపీఐ(ఎం). కానీ కాంగ్రెసును ఓడించగల స్థానంలో ఉన్న టీఆర్ఎస్ రాష్ట్రంలో అధికార పార్టీ. ప్రజావ్యతిరేక విధానాలు అమలుచేస్తున్నది. అందువల్లనే వామపక్షాల నిర్ణయాన్ని కొందరు అపార్థం చేసుకున్నారు.

ఒక ప్రాంతీయ పార్టీగా రాష్ట్రాల హక్కుల కోసం, ఫెడరల్ రాజ్యాంగ విలువల కోసం కేంద్రంతో పోరాడవల్సిన బాధ్యత టిఆర్ఎస్‌కు ఉన్నది. లౌకిక పార్టీలుగా చెప్పుకునే కాంగ్రెస్, టీఆర్ఎస్‌లు లౌకిక విలువల కోసం బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరంగా నిలబడటంలేదు. అవకాశవాదం ప్రదర్శిస్తున్నాయి. పైగా తమ ఎన్నికల ప్రయోజనాలకు భిన్నంగా ఉన్నపుడు, బీజేపీకి వ్యతిరేకంగా నికరంగా నిలబడుతున్న వామపక్షాల మీద నిందలు వేస్తున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా టీఆర్ఎస్ కలిసిరాలేదు. 19 పార్టీల కార్యాచరణలో కాంగ్రెస్ కలిసివచ్చింది. ఇది కొందరు టీఆర్ఎస్ నేతలకు మింగుడుపడలేదు. నిజానికి ఈ ధర్నాలో వారు కూడా కలిసివచ్చి ఉండాల్సింది. సాగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించటంతో కాంగ్రెసు శ్రేణులు, టీఆర్ఎస్ పాలనతో అసంతృప్తి చెందిన మధ్యతరగతికి చెందిన కొందరికి నచ్చలేదు. రానున్న శాసనసభ ఎన్నికలలో వామపక్షాలు టీఆర్ఎస్‌తో కలిసిపోతున్నాయని సోషల్‌మీడియాలో ఆరోపణలు చేసారు. హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సమావేశాలు జరిగిన సందర్భంగా కేరళ ముఖ్యమంత్రి విజయన్‌నూ, పార్టీ నాయకత్వాన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. రాష్ట్రాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ముఖ్యమంత్రిగా, ఈ ఆహ్వానాన్ని అంగీకరించి వెళ్ళటం, రాష్ట్ర ముఖ్యమంత్రిని కూడా ఈ పోరాటంలో కలిసిరావాలని కోరటం ఆయన బాధ్యత. అదే చేసారు. హాజరైన సీపీఐ(ఎం) కేంద్ర నాయకత్వం కూడా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా, ప్రజాతంత్ర, లౌకిక విలువల కోసం కేంద్రంతో పోరాటంలో టీఆర్ఎస్ కలిసిరావాలని కోరింది. ఇలాంటి ప్రయత్నం చేయటం కమ్యూనిస్టుల బాధ్యత. కానీ ఈ ఘటనను కూడా రెండేండ్ల తర్వాత జరగబోయే శాసనసభ ఎన్నికలకు ముడిపెట్టి కొందరు ప్రచారం చేసారు. బీజేపీ ప్రమాదాన్ని గుర్తించకుండా, తమ ఎన్నికల ప్రయోజనం కోసం కమ్యూనిస్టులను వాడుకోవాలని చేసే ప్రయత్నమే ఇది.

ఈ పరిస్థితులన్నీ సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభ చర్చించింది. రాష్ట్రంలో సీపీఐ(ఎం), ఇతర వామపక్షాలు బలపడకుండా మతోన్మాదాన్ని నిలువరించటం గానీ, ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు తేవటంగానీ సాధ్యపడదని నిర్ధారించింది. కాంగ్రెస్‌గానీ, టీఆర్ఎస్‌గానీ ప్రజావ్యతిరేక విధానాలే అమలుచేస్తాయి. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనంగా ఉండగా, బూర్జువా పార్టీల మీద ఆధారపడి కనీసం లౌకిక విలువలను కాపాడటం కూడా సాధించలేము. ప్రజాస్వామ్యం, రాష్ట్రాల హక్కులు, లౌకిక విలువల కోసం ఒక ప్రాంతీయ పార్టీగా టీఆర్ఎస్ పోరాడాలన్నా, కమ్యూనిస్టులు బలపడినపుడే సాధ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల మీద, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాల ద్వారా మాత్రమే కమ్యూనిస్టు ఉద్యమం బలపడుతుంది. ఎన్నికలు వచ్చినపుడు ఎన్నికల ఎత్తుగడలు చర్చించవచ్చు. అంతేకాదు, మతోన్మాదులను కేవలం ఎన్నికల్లో ఓడించాలన్న ప్రయత్నం చాలదు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో ప్రజలను సమీకరించి నిరంతరం పోరాడటం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. అందుకే.. రానున్న కాలంలో రాష్ట్రంలో ప్రజాసమస్యల మీద ఉద్యమాలు ఉధృతం చేయాలని మహాసభ నిర్ణయించింది. వర్గదోపిడీకి, మతోన్మాదానికి, వివక్షకు వ్యతిరేకంగా కలిసొచ్చే సామాజిక శక్తులను కూడా సమీకరించి పోరాడాలని నిర్ణయించింది. వామపక్షాల ప్రజాపునాదిని బలోపేతం చేయాలని నిర్ణయించింది. వామపక్షాలు కేంద్రంగా ప్రజాతంత్ర, వర్గ, సామాజిక శక్తులతో ప్రత్యామ్నాయం నిర్మించాలని పిలుపునిచ్చింది. ❊

అంతర్జాతీయం

# రెండు సంక్షోభాలు ఒకే వ్యూహం


రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

సామ్రాజ్యవాదుల విస్తరణవాదం ప్రపంచాన్ని నిరంతరం యుద్ధాల్లోనూ, యుద్ధ భయంలోనూ ఉంచుతోంది. రెండవ ప్రపంచ యుద్ధం వరకు సామ్రాజ్యవాదులు తమలో తాము కొట్లాడుకుంటూ కోట్లమంది ప్రాణాలు తీశారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కమ్యూనిజం నుండి రక్షణ పేరుతో అమెరికా నేతృత్వంలో నాటో కూటమిని ఏర్పాటు చేశారు. అమెరికా తనంత తానుగా, నాటోతో కలిసి లాటిన్ అమెరికా, మధ్య ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండాల్లో అనేక యుద్ధాలకు పాల్పడింది. సోషలిస్టు కూటమికి వ్యతిరేకంగా ప్రచ్ఛన్న యుద్ధం మొదలు పెట్టి ప్రపంచ మంతటా విస్తరించిన సైనిక స్థావరాలతో భూగోళాన్ని నిప్పుల కుంపటి మీద నిలబెట్టింది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత కమ్యూనిస్టు బూచి స్థానంలో ఉగ్రవాద భయాన్ని ప్రవేశపెట్టి అనేక దేశాలపై దాడులకు పాల్పడింది. అమెరికన్ సామ్రాజ్యవాదులు పెంచి పోషించిన భూతం ఉగ్రవాదం అని ఆఫ్ఘన్, ఇరాక్, లిబియా, సిరియా యుద్ధాలు, అనంతర పరిణామాలు నిరూపించాయి.

ఇప్పుడు రెండు కొత్త సంక్షోభాలను సృష్టించడం ద్వారా అమెరికన్ సామ్రాజ్యవాదులు మళ్లీ భూగోళాన్ని యుద్ధ భయాల్లో ముంచెత్తుతున్నారు. వాటిలో ఒకటి, రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ సంక్షోభం. రెండవది చైనాకు వ్యతిరేకంగా తైవాన్ సంక్షోభం. రెండు సంక్షోభాలూ ప్రపంచంలోని రెండు ప్రాంతాల్లో, అంటే ఒకటి ఐరోపాలో, రెండోది ఆసియాలో సృష్టించినప్పటికీ రెండింటి వెనుక ఒకే వ్యూహం ఉంది. అది సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల యుద్ధ వ్యూహం.

**ఉక్రెయిన్ సంక్షోభం**

రష్యాతో యుద్ధ సన్నాహాల్లో భాగంగా ఐరోపా యూనియన్‌కు 8,500 మంది సైన్యాన్ని, భారీస్థాయిలో సాయుధ సామగ్రిని పంపుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించడంతో ఉక్రెయిన్ సంక్షోభం యుద్ధ సంక్షోభంగా మారింది. దాంతోబాటు 300 జావెలిన్ ట్యాంకు విధ్వంసక క్షిపణులను, భుజాల మీది నుండి ప్రయోగించే బహుళార్థ సాధక అస్సాల్ట్ ఆయుధాలను, బంకర్లను ధ్వంసం చేసే ఆయుధాలను అమెరికా ఉక్రెయిన్‌కు ఇప్పటికే పంపింది. అమెరికా ప్రస్తుతం పంపుతున్న 8,500 దళాలకు తోడు మరో 50,000 సైన్యాన్ని ఈ ప్రాంతానికి పంపడానికి సిద్ధంగా ఉన్నదని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక రాసింది.

జనవరి 24వ తేదీన అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ఐరోపా విదేశాంగ మంత్రులతో సమావేశం నిర్వహించారు. తూర్పు ఐరోపాలో రష్యాకు వ్యతిరేకంగా మరిన్ని నాటో దళాలను మోహరించే విషయం, ఆర్థికంగా కోలుకోలేని విధంగా రష్యాపై ఆంక్షలు పెట్టడం ఎలా అనే అంశాలను వారు చర్చించినట్లు పత్రికా వార్తలు తెలిపాయి. ఈ సమావేశం ముగిసిన వెంటనే తాను బాల్టిక్ సముద్రానికి ఒక యుద్ధ నౌకను, రష్యాకు వ్యతిరేకంగా లిథుయేనియాకు నాలుగు ఎఫ్-16 విమానాలనూ పంపుతానని డెన్మార్క్ ప్రకటిం చింది. బాల్టిక్, మధ్యధరా సముద్రాలకు యుద్ధ నౌకలను పంపుతానని స్పెయిన్ ప్రకటించింది. బాల్టిక్ సముద్రం, ఉక్రెయిన్‌లను ఆనుకుని ఉన్న నాటో సభ్య దేశం రుమేనియాకు సైన్యాన్ని పంపబోతున్నట్లు ఫ్రాన్స్ ప్రకటించింది. ఉక్రెయిన్‌లో యుద్ధ సన్నాహాల కోసం 130 కోట్ల డాలర్ల రుణం ఇస్తున్నట్లు ఇయు ప్రకటించగా, అమెరికాతో అంటకాగిన బ్రిటన్ తాను మరో 150 కోట్ల డాలర్ల రుణం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఉక్రెయిన్ కూడా రష్యాతో యుద్ధానికి సన్నాహాలను ముమ్మరం చేసింది. దేశాధ్యక్షుడు వ్లదిమిర్ జెలెన్‌స్కీ దేశ భద్రతా మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. యుద్ధ సంక్షోభంపై ప్రభుత్వం, పార్లమెంటు సభ్యుల మధ్య రహస్య సమావేశం జరిగింది. యుద్ధంలో ఉక్రెయిన్ నగరాలను ఎలా కాపాడుకోవాలో చర్చించేందుకు గాను జనవరి 28న దేశంలోని అన్ని నగరాల మేయర్ల సమావేశం కోసం రాజధాని కీవ్ మేయర్ విటాలి క్లిచ్‌కో పిలుపునిచ్చారు. కీవ్‌లోని తమ దౌత్యాధికారుల్లో కొంతమందినీ, వారి కుటుంబాలనూ ఖాళీ చేయిస్తున్నట్లు అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, జర్మనీలు ప్రకటించాయి.

“యూరప్‌లో యుద్ధ పరిస్థితి నెలకొని ఉంది” అని రష్యా పత్రిక “కొమ్మెర్‌శాంట్” ఇటీవల వ్యాఖ్యానించింది. పరిస్థితి చాలా “క్లిష్టంగా” ఉంది అని రష్యా విదేశాంగ శాఖ సహాయ మంత్రి సెర్గీ ర్యాబ్‌కోవ్ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. “అమెరికా పనిగట్టుకుని ఉద్రిక్తతలను రెచ్చగొడుతోంది. అమెరికా చర్యలను మేము చాలా ఆందోళనతో గమనిస్తున్నాం.” అని రష్యా అధ్యక్షభవనం ప్రెస్ సెక్రటరీ డిమిట్రీ పెస్కోవ్ వ్యాఖ్యానించాడు. రష్యా నేతలు పేర్కొన్నట్లే అమెరికా అధికారులు యుద్ధనాదాలు చేస్తున్నారు. యుద్ధానికి ‘ఉక్రెయిన్ అన్ని విధాలా సిద్ధంగా ఉంది. యుద్ధమే సంభవిస్తే రష్యాకు భారీ నష్టం జరుగుతుంది” అని ఉక్రెయిన్‌లోని అమెరికా ఉన్నత దౌత్యాధికారి క్రిస్టినా క్వీన్ పేర్కొన్నారు.

లక్ష మందికి పైగా సైన్యాన్ని, యుద్ధ టాంకులను ఉక్రెయిన్ సరిహద్దులకు రష్యా తరలిస్తోందని పశ్చిమ దేశాల ప్రసార సాధనాలు ఒకవైపు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుండగా మరోవైపు అమెరికా అధ్యక్షుని దగ్గర

> **“ 2014లో పశ్చిమదేశాల సహకారంతో నయా ఫాసిస్టు నాయకుడు పెట్రో పొరొషెంకో ఉక్రెయిన్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి, అక్రమ పద్ధతుల్లో అధికారాన్ని చేజిక్కించు కున్నప్పటి నుండి పరిస్థితిలో పెద్ద మార్పు వచ్చింది. అప్పటివరకు ఉక్రెయిన్‌లో ఉన్న ప్రభుత్వం రష్యాతో సత్సంబంధాలు కలిగి ఉండేది. నాటోను తూర్పు వైపుకు విస్తరిస్తూ వచ్చిన పశ్చిమ దేశాల కన్ను రష్యా పొరు గునే ఉన్న కీలకమైన ఉక్రెయిన్‌పై పడింది. అప్పటినుండి ఉద్రిక్తతలు పెరిగాయి. ”**

నుండి కింది స్థాయి దౌత్యవేత్తలు, సైనికాధికారుల వరకు రష్యాకు వ్యతిరేకంగా “సమరశంఖాలు” పూరిస్తున్నారు. రష్యా కోలుకోలేని విధంగా ఆర్థిక, ఇతర ఆంక్షలు ప్రకటిస్తున్నారు.

రష్యా కూడా సైనిక సన్నాహాల్లో భాగంగా జనవరి నాల్గవ వారంలో పారాట్రూప్ యూనిట్లు, యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, బాలిస్టిక్ క్షిపణులతో యుద్ధ విన్యాసాలు నిర్వహించింది. నల్ల సముద్రంలో ఉక్రెయిన్, క్రిమియాల వద్దనే కాకుండా మొత్తం రష్యా భూభాగాలైన సైబీరియా, దూరప్రాచ్యం, బాల్టిక్ సముద్రాల్లో విన్యాసాలు నిర్వహించింది. బెలారస్‌తో కలిసి సంయుక్త విన్యాసాలు నిర్వహిస్తోంది.

### చర్య-ప్రతిచర్య

ఉక్రెయిన్‌ను ఆక్రమించుకోడానికి రష్యా తన దళాలను ఉక్రెయిన్ సరిహద్దులకు దగ్గరలోని తన భూభాగాలకు పెద్ద ఎత్తున తరలిస్తోంది కాబట్టి తాము ఉక్రెయిన్‌కు మద్దతుగా రష్యాపై యుద్ధానికి దిగుతున్నామని పశ్చిమ దేశాల ప్రసార సాధనాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. కాని వాస్తవం దీనికి పూర్తి తలకిందులుగా ఉందని రష్యా చెబుతోంది. 1991లో సోవియట్ యూనియన్ కూలిపోయి వార్సా సంధి రద్దయినప్పటికీ అమెరికా, ఇతర సామ్రాజ్యవాదులు నాటో కూటమిని విస్తరించుకుంటూ రష్యా సరిహద్దుల వరకు వచ్చారు కనుక తమ దేశ రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని రష్యా వాదిస్తోంది. అందువల్ల ఏది చర్య ఏది ప్రతిచర్య అనేది ఉక్రెయిన్ సంక్షోభంలో పెద్ద చర్చగా సాగుతోంది.

ఇదే పరిస్థితి చైనా పొరుగున ఉన్న తైవాన్ విషయంలో కూడా మనకు కనిపిస్తుంది. తైవాన్‌ను స్వాధీనం చేసుకోడానికి చైనా ఆయుధాలను మోహరిస్తోందని, అందువల్ల తైవాన్‌కు రక్షణగా, చైనాకు వ్యతిరేకంగా తాము యుద్ధ సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా, దాని మిత్ర దేశాలు చెబుతున్నాయి. కానీ వాస్తవం దానికి విరుద్ధంగా ఉందనీ, ఒకే చైనా సిద్ధాంతానికి విరుద్ధంగా తైవాన్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకోడానికి అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలు మద్దతిస్తున్నాయి గనుక దాన్ని నివారించడం కోసం తాను సైనిక సన్నాహాలు చేస్తున్నానని చైనా చెబుతోంది. ఉక్రెయిన్ విషయంలో రష్యాకు వ్యతిరేకంగా అమెరికా ఏ వ్యూహమైతే అనుసరిస్తోందో తైవాన్ విషయంలో చైనాకు వ్యతిరేకంగా కూడా అదే వ్యూహం అనుసరిస్తోంది.

రష్యా-ఉక్రెయిన్ సంబంధాలు ఈ ప్రాంతంలో చాలా సున్నితమైనవి. ఎందుకంటే 2014కు ముందు వరకు ఉక్రెయిన్‌లో భాగంగా ఉన్న క్రిమియాలో రష్యా జనాభా అధికంగా ఉంది. 2014లో రష్యా సహకారంతో క్రిమియా స్వతంత్రం ప్రకటించుకుంది. ఉక్రెయిన్‌లోని అనేక సరిహద్దు ప్రాంతాల్లో రష్యన్ జనాభా అధికం. అంతే కాకుండా చమురు, గ్యాస్, ఇతర అనేక దిగుమతుల కోసం ఉక్రెయిన్ రష్యా మీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఉక్రెయిన్-రష్యా సత్సంబంధాలు ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలకు ముఖ్యమైన గ్యారంటీగా నిలుస్తాయి.

కానీ 2014లో పశ్చిమదేశాల సహకారంతో నయా ఫాసిస్టు నాయకుడు పెట్రో పొరొషెంకో ఉక్రెయిన్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి, అక్రమ పద్ధతుల్లో అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటి నుండి పరిస్థితిలో పెద్ద మార్పు వచ్చింది. అప్పటివరకు ఉక్రెయిన్‌లో ఉన్న ప్రభుత్వం రష్యాతో సత్సంబంధాలు కలిగి ఉండేది. నాటోను తూర్పు వైపుకు విస్తరిస్తూ వచ్చిన పశ్చిమ దేశాల కన్ను రష్యా పొరుగునే ఉన్న కీలకమైన ఉక్రెయిన్‌పై పడింది. ఉక్రెయిన్‌ను కూడా నాటో కూటమిలో చేర్చేందుకు పొరొషెంకో ప్రభుత్వం తీర్మానించింది. మరోవైపు దేశంలో పచ్చి ఫాసిస్టు జాతీయ వాదాన్ని రెచ్చగొట్టి మైనారిటీ రష్యన్ జనాభాపై తీవ్రమైన దమన కాండకు దిగింది. ప్రజాస్వామ్యం గురించి నిత్యం గగ్గోలు పెట్టే అమెరికా, ఇతర పశ్చిమ ఐరోపా దేశాలు ఉక్రెయిన్ ప్రభుత్వ ఫాసిస్టు దమనకాండకు మద్దతివ్వడమే కాకుండా ఆ దేశాన్ని నాటోలో చేర్చుకుని రష్యాకు పక్కలో బల్లెంగా మార్చడానికి ప్రయత్నించారు. రష్యాకు చెందిన అతి పెద్ద సైనిక స్థావరం ఈ ప్రాంతంలో ఉండడంతో అది ఉక్రెయిన్ చర్యను తమ దేశ భద్రకు ప్రమాదంగా పరిగణించింది. ఉక్రెయిన్‌లో భాగంగా ఉన్న క్రిమియా ప్రజలు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించి స్వతంత్రం ప్రకటించుకోవడం, దానికి రష్యా సైనికంగా మద్దతివ్వడంతో ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. దానితో పాటు తూర్పు ఉక్రెయిన్‌లోని డొనెట్స్క్, లుహాన్స్క్ ప్రజలు కూడా ప్రజాభిప్రాయం నిర్వహించుకుని ఉక్రెయిన్ నుండి వేర్పాటు ప్రకటించారు.

2014 నుండి ఇప్పటి వరకు ఉక్రెయిన్ దళాలకూ, రష్యా మద్దతు గల తిరుగు బాటుదారులకూ మధ్య జరిగిన ఘర్షణల్లో 10 వేలమందికి పైగా ప్రజలు మరణించారు. 24,000 మంది వరకు క్షతగాత్రులైనారు. 2015 అక్టోబర్‌లో మలేసియా ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన విమానం ఉక్రెయిన్ భూభాగంలో కూలిపోయి 298 మంది ప్రయాణీకులు మరణించిన తరువాత ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. రష్యా దళాలు ప్రయోగించిన క్షిపణి ఈ విమానానికి తగలడంతో అది కూలిపోయిందని పశ్చిమ దేశాలు వాదిస్తుండగా, రష్యా అధికారులు దాన్ని పదేపదే ఖండించారు.

ఉక్రెయిన్-రష్యాల మధ్య సయోధ్య కుదర్చడానికి ఫ్రాన్స్, జర్మనీల మధ్య వర్తిత్వంతో బెలారస్ రాజధాని మిన్స్క్‌లో 2015 ఫిబ్రవరిలో ఒక ఒప్పందం కుదిరింది. రెండు పక్షాలు కాల్పుల విరమణ జరపాలని, భారీ ఆయుధాలు మోహరించకూడదనీ ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరువురికీ అంగీకారయోగ్యమైన పూర్తిస్థాయి పరిష్కారం కనుగొనడం జరగలేదు.

ఈ లోగా రష్యా దురాక్రమణకు పాల్పడుతోందని ఆరోపిస్తూ 2016 ఏప్రిల్‌లో నాటో నాలుగు బెటాలియన్ల సైన్యాన్ని తూర్పు యూరప్‌కు పంపి, ఎస్తోనియా, పోలెండ్, లాత్వియా, లిథుయేనియాల్లో రొటేషన్ పద్ధతిలో మోహరించింది. వీటికి తోడు అమెరికా నాలుగు ట్యాంకు బ్రిగేడ్‌లను కూడా పంపింది.

డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన

తరువాత రష్యాపై కాలు దువ్వడం పెరిగింది. ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ట్రంప్ ప్రభుత్వం రష్యాపైనా, ఆ దేశ అధికారులపైనా ఆంక్షలకు దిగింది. రష్యా–ఉక్రెయిన్ ఘర్షణలను మరింత ఎగదోస్తూ 2018 మార్చిలో ఉక్రెయిన్‌కు మరింత ప్రమాదకరమైన మారణాయుధాల ఎగుమతికి అనుమతిచ్చింది. అదే ఏడాది అక్టోబర్‌లో అమెరికా, మరో ఏడు నాటో దేశాలు ఉక్రెయిన్‌తో కలిసి పశ్చిమ ఉక్రెయిన్ ప్రాంతంలో పెద్ద ఎత్తున యుద్ధ విన్యాసాలకు దిగాయి.

ఈ లోగా 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో ఉక్రెయిన్ కొత్త అధ్యక్షుడుగా జెలెన్స్కీ ఎన్నికవడంతో ఉద్రిక్తతలు కొంతమేరకు తగ్గాయి. టివి హాస్య నటుడైన జెలెన్స్కీ రష్యాతో పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధంగా లేడు. అయినప్పటికీ పశ్చిమ దేశాల ఒత్తిడితో గత మార్చిలో "రష్యా ఆక్రమిత క్రిమియాను, సవస్తొపోల్ నగరాన్ని తిరిగి ఆక్రమించుకోవడం, రష్యా ప్రభావంలోకి వెళ్లిన ఉక్రెయిన్ ప్రాంతాలను తరిగి తన స్వాధీనంలోకి తెచ్చుకోవడం" కోసం ఒక డిక్రీ ఆమోదించాడు. మరోవైపు అదే సమయంలో నాటో దళాలు "యూరప్ రక్షణ 2021" పేరుతో మార్చి 16 నుండి రష్యాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యుద్ధ విన్యాసాలు ప్రారంభించాయి. గత కొన్ని దశాబ్దాల కాలంలో యూరప్‌లో నాటో నిర్వహించిన అతి పెద్ద విన్యాసాలు ఇవి. 12 దేశాల్లోని 30 నాటో శిక్షణ కేంద్రాల్లో ఉన్న, 27 దేశాలకు చెందిన 28,000 సైన్యం ఈ విన్యాసాల్లో పాల్గొన్నది.

ఇక్కడ రష్యాకు రెండు సమస్యలు ఎదురైనాయి. ఒకవైపు నాటో తన వ్యతిరేకతను కూడా లెక్క చేయకుండా తూర్పువైపుకు విస్తరిస్తూ, క్రమంగా తనకు అత్యంత కీలకమైన భద్రతా సమస్యలను సృష్టించే ఉక్రెయిన్ వరకు వచ్చింది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత ఒకనాటి సోషలిస్టు తూర్పు యూరప్ దేశాలైన పోలెండ్, హంగరీ, బల్గేరియా, రొమేనియా, స్లోవేకియా, స్లోవేనియా, ఆల్బేనియా, క్రోయేషియా, మాంటెనీగ్రో, ఉత్తర మాసిడోనియాలనూ, సోవియట్ నుండి విడిపోయి స్వతంత్రదేశాలుగా ఏర్పడిన ఎస్తోనియా, లాత్వియా, లిథుయేనియాలనూ నాటోలో చేర్చుకుంది. ఆ విధంగా రష్యావైపు

**" 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో ఉక్రెయిన్ కొత్త అధ్యక్షుడుగా జెలెన్స్కీ ఎన్నికవడంతో ఉద్రిక్తతలు కొంతమేరకు తగ్గాయి. టివి హాస్య నటుడైన జెలెన్స్కీ రష్యాతో పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధంగా లేడు. అయినప్పటికీ పశ్చిమ దేశాల ఒత్తిడితో గత మార్చిలో "రష్యా ఆక్రమిత క్రిమియాను, సవస్తొపోల్ నగరాన్ని తిరిగి ఆక్రమించుకోవడం, రష్యా ప్రభావంలోకి వెళ్లిన ఉక్రెయిన్ ప్రాంతాలను తరిగి తన స్వాధీనంలోకి తెచ్చుకోవడం" కోసం ఒక డిక్రీ ఆమోదించాడు. "**

విస్తరించడం వెనుక రష్యాను పూర్తిగా లొంగదీసుకుని ప్రపంచాధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవాలన్న అమెరికా పన్నాగం ఉంది. దీంతోబాటు రష్యాకు ఎదురైన రెండో సమస్య ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరితే ఆ దేశంపై ఎటువంటి దాడి జరిగినా ఒప్పందం ప్రకారం అమెరికాతో సహా నాటో కూటమి రష్యాపై దాడికి దిగవచ్చు. ఉక్రెయిన్ పరిణామాలను యథావిధిగా వదిలేస్తే అక్కడ క్రమంగా రష్యా




వ్యతిరేక శక్తులు బలపడి క్రిమియాతో పాటు రష్యన్లు అధికంగా గల స్వయం ప్రతిపత్తి ప్రాంతాలపైన కూడా దురాక్రమణకు పాల్పడవచ్చు. ఒక రకంగా రష్యాకు ముందు నుయ్యి వెనుక గొయ్యి పరిస్థితులను నాటో కూటమి సృష్టించింది.

### తైవాన్‌లోనూ అదే వ్యూహం

అమెరికా తైవాన్ విషయంలో కూడా చైనాకు ఇదే పరిస్థితిని సృష్టించింది. 1979లో నిక్సన్, చౌఎన్‌లై సమావేశం అనంతరం చైనా ప్రధాన భూభాగాన్ని అమెరికా గుర్తించడమే కాకుండా ఒకే చైనా విధానాన్ని సమర్థించింది. హాంగ్‌కాంగ్, మకావూలతో పాటు తైవాన్ కూడా చైనాలో భాగమేనని ఐక్యరాజ్య సమితితో సహా క్రమంగా ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయి. కానీ చైనాను నిలువరించాలన్న విధానంలో భాగంగా అమెరికా చైనాకు వ్యతిరేకంగా తైవాన్‌ను పావుగా వాడుకోవడం ప్రారంభించినప్పటి నుండి తైవాన్–చైనా సంబంధాల్లో మార్పు వచ్చి ఉద్రిక్తతలు తలెత్తాయి. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ హయాంలో తైవాన్‌ను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించేందుకు దుందుడుకు ప్రయత్నాలు ప్రారంభించడంతో తైవాన్ జలసంధి ఉద్రిక్తతలకు నిలయంగా మారింది. ఉక్రెయిన్‌లో రష్యాకు ఎదురైన పరిస్థితే తైవాన్‌లో చైనాకు కూడా ఎదురైంది. తైవాన్ చైనాలో అంతర్భాగమనీ, ఒకే దేశం, రెండు వ్యవస్థలు అన్న డెంగ్ సియావో పింగ్ విధానం కింద తైవాన్ శాంతి యుతంగా ఎప్పటికైనా చైనాలో కలవాలనీ, ఒక వేళ అలా కాకుండా తొందరపడి తైవాన్ స్వతంత్రం ప్రకటించుకోడానికి ప్రయత్నిస్తే బలప్రయోగంతోనైనా దాన్ని చైనా ప్రధాన భూభాగంలో కలుపు కుంటామని చైనా ప్రకటించడమే కాకుండా దాని రాజ్యాంగంలో కూడా పేర్కొన్నది. ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించింది. ఇప్పుడు అమెరికా క్రమంగా తైవాన్‌ను సాయుధం చేస్తూ దాన్ని స్వతంత్రం ప్రకటించే దిశవైపు తీసుకుపోతోంది. సంబంధాల పునరుద్ధరణకు చైనా చేసిన ప్రయత్నాలకు 2016కు ముందు వరకు ఉన్న అధ్యక్షులు సానుకూలంగా స్పందించారు. కానీ 2016లో ఎన్నికైన ప్రస్తుత అధ్యక్షురాలు త్సాయ్ ఇంగ్ వెన్ తైవాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించే వైపు అడుగులు వేస్తున్నారు. నిజానికి ఆమె కూడా తన పూర్వ అధ్యక్షుల మాదిరిగానే చైనాతో సంబంధాల పునరుద్ధరణకు మొదట ప్రయత్నించారు. కానీ చైనాకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో అమెరికా పన్నిన వ్యూహంలో తైవాన్‌ను భాగం చేసుకోవడం ప్రారంభించినప్పటి నుండి ఆమె

> **" అందువల్ల ఉక్రెయిన్, తైవాన్ పరిణా మాలు రెండూ బయటకు చూస్తే ప్రతి చర్యలు తీసుకుంటున్నట్లు కనబడు తున్నాయి. కానీ వాస్తవంగా ఈ రెండు దేశాలను పావులుగా మార్చుకుని అటు యూరప్‌లో రష్యానూ, ఇటు ఆసియాలో చైనానూ కట్టడి చేయడానికి అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులు పన్నిన యుద్ధ వ్యూహమే నేడు ఈ రెండు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు కారణం. "**

ప్రవర్తనలో మార్పు వచ్చింది. పచ్చి మితవాత పాలక పార్టీ అయిన డిపిపి చైనా నుండి తైవాన్ వేరుపడాలనే నినాదాలు ఇస్తున్నది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా ఇతర సామ్రాజ్యవాద దేశాలు తైవాన్ వేర్పాటుకు మద్దతివ్వడమే కాకుండా, అమెరికా తన అమ్ముల పొదిలోని అత్యంత ఆధునిక ఆయుధాలను తైవాన్‌లో మోహరించి చైనాపై ఎక్కుపెట్టింది. దాని వల్ల నేడు ప్రపంచంలో తైవాన్ ఒక ఉద్రిక్త ప్రాంతం (హాట్ స్పాట్)గా మారింది. తైవాన్ పరిణామాలను అలాగే వదిలేస్తే అది స్వతంత్రం ప్రకటించుకునే అవకాశాలు పెరుగుతున్నాయి. అలా కాకుండా తైవాన్‌పై ఒత్తిడి పెడితే అమెరికా దాన్ని సాకుగా చూపించి తైవాన్‌ను మరింత సాయుధం చేస్తున్నది.




అందువల్ల ఉక్రెయిన్, తైవాన్ పరిణా మాలు రెండూ బయటకు చూస్తే ప్రతి చర్యలు తీసుకుంటున్నట్లు కనబడుతున్నాయి. కానీ వాస్తవంగా ఈ రెండు దేశాలను పావులుగా మార్చుకుని అటు యూరప్‌లో రష్యానూ, ఇటు ఆసియాలో చైనానూ కట్టడి చేయడానికి అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులు పన్నిన యుద్ధ వ్యూహమే నేడు ఈ రెండు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు కారణం. చైనా, దానికి తోడుగా రష్యా అమెరికా ప్రపంచాధిపత్యానికి విసురుతున్న సవాలును ఎదుర్కొనడానికే అమెరికా ఇటువంటి చర్యలకు దిగిందన్నది వాస్తవం. ఉక్రెయిన్‌లో ఉద్రిక్తతలు తగ్గాలంటే నాటో తమ దేశ భద్రతకు హామీ ఇవ్వాలనీ, ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోబోమని మాట ఇవ్వాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. అమెరికా, రష్యా విదేశాంగ మంత్రుల సమావేశంలో రష్యా నేరుగానే ఈ ప్రతిపాదన పెట్టింది. దీనికి అమెరికా చెప్పే సమాధానం మీదనే భవిష్యత్ పరిణామాలు ఆధారపడి ఉంటాయని రష్యా స్పష్టం చేసింది. దీనిపై చర్చించి కొద్దిరోజుల్లో సమాధానం చెబుతామని అమెరికా చెప్పినప్పటికీ దీనికి అంగీకరించ డానికి నాటో సిద్ధంగా లేదన్న సంకేతాలు వస్తున్నాయి. వాస్తవానికి ప్రస్తుత పరిస్థితుల్లో రష్యా ప్రతిపాదన ఆచరణయోగ్యమైనది. ఈ ప్రాంతంలో శాంతిని కాపాడ్డానికి చాలా ముఖ్యమైన ప్రతిపాదన. దీనిపై అమెరికా, నాటో ఎలా స్పందిస్తాయో చూడాలి.

మరోవైపు ఉక్రెయిన్ విషయంలో నాటోలో కూడా పూర్తి ఏకాభిప్రాయం లేదు. ముఖ్యంగా జర్మనీ రష్యాపై యుద్ధానికి మొదటి నుండి వ్యతిరేకిస్తున్నది. రష్యా నుండి యూరప్‌కు సముద్రం కింది భాగం ద్వారా వేస్తున్న గ్యాస్ పైప్‌లైన్ నార్డ్ స్ట్రీమ్-2 ఇప్పటికే దాదాపు 90 శాతం పూర్తికావచ్చింది. ఇది పూర్తయితే జర్మనీకి, పలు పశ్చిమ యూరప్ దేశాలకు మేలు జరుగుతుంది. కానీ అమెరికా ఆంక్షలకు జడిసి యూరప్‌లోని పలు దేశాలు ఈ విషయంలో తటపటాయిస్తున్నాయి. జర్మనీకి ఇంధన భరోసా ఇవ్వడం ద్వారా దాన్ని తమ మార్గంలోకి తెచ్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రయత్నిస్తున్నారు. మరోవైపు రష్యా మీద అమెరికా విధించే ఆర్థిక ఆంక్షల వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థే కాకుండా కష్టాల్లో ఉన్న ఐరోపా ఆర్థిక వ్యవస్థలు కూడా తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటాయి.

రష్యా, చైనాలపై సామ్రాజ్యవాదుల యుద్ధ సన్నాహాలు ఆ రెండు దేశాలూ ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక అంశాలలో మరింత సన్నిహితంగా వ్యవహరించేలా చేస్తున్నాయి. రెండు దేశాలు ఇటీవలి కాలంలో సంయుక్త సైనిక విన్యాసాలు చేయడమే కాకుండా పలు అంతర్జాతీయ పరిణామాల్లో సమన్వయంతో వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలను ఎదుర్కొనడానికి డాలరులో కాకుండా ఇతర కరెన్సీల్లో అంతర్జాతీయ వ్యాపారం పెంపొందించడానికీ, అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలు నిర్వహించే అమెరికా ఆధిపత్యంలోని స్విఫ్ట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

మొత్తం మీద చూసినప్పుడు ప్రచ్ఛన్న యుద్ధం తరువాత మళ్లీ అంత పెద్ద స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు సృష్టించడానికి సామ్రాజ్యవాదులు చైనా, రష్యాలను లక్ష్యంగా చేసుకున్నారు. దానికి ఉక్రెయిన్, తైవాన్‌లను పావులుగా వాడుకుంటున్నారు. ప్రపంచంలో భీకర యుద్ధ ప్రమాదం తెచ్చి పెట్టే అవకాశాలున్న ఈ రెండు సంక్షోభాలకూ కారణం ఒక్కటే. అది అమెరికా సామ్రాజ్య వాదుల ఆధిపత్య వ్యూహం. ఒకవైపు ప్రపంచం కరోనా మహమ్మారి నుండి, మరోవైపు ఆర్థిక సంక్షోభం నుండి పెద్ద ఉపద్రవాలు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ రెండు విషయాల్లోనూ విఫలమైన సామ్రాజ్యవాదం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ ఉద్రిక్తతలను రెచ్చ గొడుతోంది.

❊

# భిన్న సంస్కృతుల మధ్య అడ్డుగోడలు

(34వ పేజీ తరువాయి)

సృజనాత్మకంగా ఉంటుంది.

రెండు, వైవిధ్యభరిత సంస్కృతి అంటే సంకుచితమైన అస్తిత్వవాద రాజకీయాలు కాదు. తన సహచరులను అనుయాయులను వెనక్కు తిరిగి రాలేని స్థితికి నెట్టే పిడివాదం, ఒంటెత్తు వాదం కాదు. ఓరియాంటలిజం అంటే అర్థం "పశ్చిమ దేశాలకే "పరిమితమైనది కాదని ఎడ్వర్డ్ సేడ్ తెలివిగా సమాధాన మిచ్చారు. చారిత్రకంగా జరిగిన తప్పిదాలను సరిచేసుకునే నెపంతో –అవి ఊహాత్మకమైనవైనా, వాస్తవంలో జరిగినవే అయినా – ప్రతీకారం తీర్చుకోవాలనో, అణచివేయాలనో, లేదా "ఇతరుల"ను తుదముట్టించాలనో అనుకోడం లేదు. పైగా అధ్యయనం చేయటం ద్వారా పాఠాలు నేర్చుకుని, వర్తమాన భారత సమాజానికి సంబంధించిన కులం, మతం, జాతి మొదలైన విషయాలకు సంబంధించి వాస్తవాలు తెలుసుకోవాలని అనుకుంటున్నది.

మూడోది, వైవిధ్యభరితమైన సంస్కృతి అంటే ఏ మాత్రం కలిసే వీలులేని, పూర్తిగా మూసేసిన పెట్టె వంటిదో, ఎవరికీ అందనంత ఎత్తైన గోడల మధ్య బంధీనో కాదు. పరస్పర అవగాహన, ప్రయోజనాలు, సంక్షేమం కోరుకునేది. అన్ని విషయాలపైనా చర్చలకు ఆహ్వానించేది. పరస్పరం అర్థం చేసుకోడం, అంగీకారయోగ్యమైన అంశాలకు, భిన్నా భిప్రాయాల వలన ఏర్పడే ప్రతికూల భావనలకు, తప్పిదా లకు, తాము మాత్రమే నీతిమంతు లమని చూపించుకునే చర్యలకు ఇది దూరంగా ఉంటుంది.

నాలుగు, వైవిధ్యభరితమైన సంస్కృతి అంటే యూరప్ కేంద్రంగా ఉండే సంస్కృతికి బదులుగా ఆఫ్రికా కేంద్రంగా మలచబడిన సంస్కృతి కాదు. కేవలం మనిషే ప్రకృతిలో ప్రధానమని భావించే తాత్వికత గర్హించదగినది. వ్యవస్థలో ఏ ఒక్కరైనా ఇతరులపై ఆధిపత్యాన్ని ప్రదర్శించడం జాతుల మధ్య, దేశాల మధ్య జరిగే సాంస్కృతిక మార్పిడులలో అసమతుల్యతకి దారితీస్తుంది.

అనేక వ్యవస్థలకు, వ్యక్తులకు, కుటుంబానికి, జాతికి, ప్రాంతానికి, దేశానికి, ప్రపంచానికి కూడా వైవిధ్యభరితమైన సంస్కృతి విధేయంగా ఉంటుంది. అయితే అధిపత్యానికి తలవంచదు. ఒక సంస్కృతికి విధేయంగా ఉండడం అంటే మరో సంస్కృతికి వ్యతిరేకంగా ఉండడం కాదు. ఒక సంస్కృతిలో వాస్తవాలను తెలుసుకుంటున్నప్పుడు ఇతర సంస్కృతులలోని వాస్తవాలను కూడా గ్రహించవచ్చు. వైవిధ్యభరితమైన సంస్కృతిలో సంబంధాలు సంకుచితమైన, వ్యక్తిగత ప్రయోజనాలపై ఆధారపడి ఉండవు. దీనికి డబ్బే ప్రధానం కాదు. అత్యధిక ప్రజలకు, సంస్థలకు ఎక్కువ ప్రయోజనాలు చేకూర్చేది, ముఖ్యంగా నిరు పేదలకు, తమ నెలవుల నుండి తొలగించబడిన వారికి ఉపయోగంగా ఉండే సంస్కృతే ప్రధాన మైనది.

అనేక సంస్కృతుల, వ్యక్తుల జీవిత విలువలను, సంస్థలను, జాతులను ఏ బలప్రయోగం గాని, ఎటువంటి ఒత్తిడి గాని లేకుండా ఈ సంస్కృతి అంగీకరించగలగాలి. వ్యక్తులకు, సామాజిక నడవడికకు రాజ్యం, మార్కెట్ మధ్యవర్తిగా ఉండాలని చూడకూడదు. అధ్యయనాలలో నేను చూసిన ఈ కొత్త సంస్కృతి, ప్రజాతంత్ర బహుళత్వం కలది. ప్రజాతంత్ర బహుళత్వం అంటే "వైవిధ్యాన్ని, ఇతరులందరికి సంబంధించిన సాధారణ విషయాల కంటే ఎక్కువైనదిగా భావించకపోవడం. వివిధ తరగతుల పౌరులు ఒకరితో ఒకరు గౌరవప్రదంగా, నిరంతరంగా చర్చలు కొనసాగించుకోవడాన్ని ప్రోత్సహించే విధంగా, తమ భవిష్యత్తుకు సంబంధించిన విషయాలను ఒకరితో ఒకరు సదా పంచుకునే విధంగా ఉండాలి.

**(అనువాదం: కె ఉషారాణి)**


## వార్తా పత్రికల రిజిస్ట్రేషన్

**(రూలు 8వ ఫారం IV ప్రకారం)**

**మార్క్సిస్టు మాసపత్రిక ప్రచురణ వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం : | విజయవాడ |
| 2. | ఏ రకమైన పత్రిక : | మాసపత్రిక |
| 3. | ముద్రాపకుని పేరు: | బి.వి.రాఘవులు |
| | చిరునామ : | 1-1-60/2, ఎం.బి.భవన్, ఆర్.టి.సి క్రాస్ రోడ్స్, హైదరాబాద్ -20. |
| 4. | ప్రచురణ కర్త పేరు : | బి.వి.రాఘవులు |
| | చిరునామ : | 1-1-60/2, ఎం.బి.భవన్, ఆర్.టి.సి క్రాస్ రోడ్స్, హైదరాబాద్ -20. |
| 5. | సంపాదకుని పేరు : | ఎస్.వెంకట్రావు |
| | చిరునామ : | 85డి, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522501 |
| 6. | పత్రిక యాజమాన్యం : | భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, |

బి.వి.రాఘవులు అను నేను పైన పేర్కొన్న వివరాలు విశ్వసనీయమైనవని ఇందు మూలంగా తెలియజేస్తున్నాను.

సం/

**బి.వి.రాఘవులు**

**ప్రచురణ కర్త**

**ఈ మాసం ప్రత్యేకం**

# నయా-సామ్రాజ్యవాదం: దోపిడీ తీవ్రతరం

**చెన్ ఎన్ ఫ్యూ, లూబావో లిన్**

గుత్త పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక, ద్రవ్య ప్రపంచీకరణ సమకాలీన రూపమే నయా–సామ్రాజ్యవాదం. ఐదు ప్రధానాంశాల ప్రాతిపదికగా నయా–సామ్రాజ్యవాదాన్ని అర్థం చేసుకోవచ్చు.

మొదటిది, సరుకుల ఉత్పత్తి, చలామణిలో నూతన గుత్తాధిపత్యం. పెట్టుబడి కేంద్రీకరణ తీవ్రం కావటం వలన అతి పెద్ద గుత్తసంస్థలు ఏర్పడ్డాయి. వాటివద్ద పోగుపడ్డ సంపద అన్ని దేశాల సంపద కన్నా ఎక్కువగా ఉన్నది. ఈ పరిణామాలతో ఉత్పత్తి, చలామణి కూడా అంతర్జాతీయకరణ అయ్యాయి. రెండవది, ప్రపంచ ఆర్థిక అభివృద్ధిలో గుత్తాధిపత్య పాత్ర నిర్వహిస్తున్న ద్రవ్య పెట్టుబడి ఆర్థికవ్యవస్థలను ద్రవ్యీకరిస్తున్నది. ఫలితంగా అభివృద్ధి వక్రమార్గంలో జరుగుతున్నది. మూడవది, అమెరికా డాలర్, మేధోపరమైన సంపద హక్కులు అసమాన అంతర్జాతీయ శ్రమ విభజనకు, ప్రపంచ ఆర్థికవ్యవస్థలో అసమాన విభజన, సంపద అసమాన పంపిణీకి కారణమౌతున్నాయి. నాలుగవది, అంతర్జాతీయ గుత్తసంస్థలు ఏకమై ఆధిపత్యం చలాయిస్తున్నాయి. అంతర్జాతీయంగా పెత్తనం చలాయిస్తున్న గుత్తాధిపత్య సంస్థలలో గుత్తాధిపత్యం నెరపే ఒక నాయకుడు, కొన్ని బలమైన ప్రభుత్వాలు కలిసి ద్రవ్య రాజకీయాలకు ఆర్థిక పునాదిగా ఉన్నాయి. ఈ గుత్తాధిపత్యాన్ని ఆధారం చేసుకొని అసభ్య సంస్కృతి, సైనిక బెదిరింపులతో దోపిడి, అణచివేతలను కొనసాగిస్తున్నారు. ఐదవది, పెట్టుబడిదారీ విధానంలో ప్రపంచీకరించబడిన వైరుధ్యాలు, ఆ వ్యవస్థ ఎదుర్కొనే వివిధ రకాలైన సంక్షోభాలు తరచుగా తీవ్రం కావటంతో నూతన గుత్తాధిపత్య, దోపిడీదారీ, ఆధిపత్యవాద, మోసాలతో కూడిన, ఇతరులను పీల్చిపిప్పిచేస్తూ క్షీణించిపోతున్న, చావుకు సిద్ధమైన దశలో ఉన్న సమకాలీన పెట్టుబడిదారీ విధానమే అంతిమదశలోని సామ్రాజ్యవాదంగా ఉన్నది.

పెట్టుబడిదారీ చారిత్రక అభివృద్ధి క్రమం అనేక విభిన్న దశల గుండా సాగింది. 20వ శతాబ్దం ప్రారంభంలో పెట్టుబడిదారీ విధానం ప్రైవేటు గుత్తదశకు చేరింది. దీనినే లెనిన్ సామ్రాజ్యవాద దశ అన్నాడు. సామ్రాజ్యవాద దశ అసమానమైన ఆర్థిక, రాజకీయ అభివృద్ధిని తీసుకొచ్చింది. శక్తివంతమైన దేశాలు సముద్రాంతరాలకు విస్తరించటానికి, ప్రపంచాన్ని తమ మధ్య పంచుకోవటానికి కూటములుగా ఏర్పడ్డాయి. వాటి మధ్య సాగిన తీవ్రమైన పోరాటాలు రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీశాయి. 20వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో యూరేషియా ప్రాంతం నిరంతర యుద్ధాలతో సతమతమైంది. జాతీయ ప్రజాతంత్ర విప్లవాలు, కమ్యూనిస్టు ఉద్యమం ఒకదాని తర్వాత మరొకటి అభివృద్ధి అయాయి. రెండో ప్రపంచయుద్ధం తర్వాత కొన్ని వెనుకబడిన దేశాలు సోషలిస్టు విధానాన్ని ఎంచుకోవటంతో పెట్టుడిదారి విధానం, సోషలిజానికి మధ్య పోరాటం తీవ్రమైంది. పెట్టుబడిదారి విధానం స్థానంలో సోషలిజం వస్తుందని కమ్యూనిస్టు ప్రణాళికలో పేర్కొన్నప్పటికి కొద్ది దేశాలలో మాత్రమే అది సాధ్యమైంది. పెట్టుబడిదారి విధానం, సామ్రాజ్యవాదం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ అది నిలదొక్కుకున్నది. 1980, 90 దశాబ్దాలలో పెట్టుబడిదారి విధానం వ్యూహాత్మకమైన మార్పులతో నయా–ఉదారవాద విధానాలను అమలుచేస్తూ నయా–సామ్రాజ్యవాద దశకు చేరింది. ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత సామ్రాజ్యవాద అభివృద్ధిలో నూతన దశను ఇది తెలుపుతున్నది.

'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారి విధానపు అత్యున్నత దశ' అన్న పుస్తకంలో లెనిన్ సామ్రాజ్యవాదాన్ని ఈ విధంగా వివరించాడు. "సామ్రాజ్యవాదాన్ని గురించి కొద్ది మాటలలో చెప్పుకోవాలంటే పెట్టుబడిదారి విధానం యొక్క గుత్తదశయే సామ్రాజ్యవాదం. సామ్రాజ్యవాదానికి ఐదు ప్రధాన లక్షణాలు ఉన్నాయి. (1) ఉత్పత్తి, పెట్టుబడి కేంద్రీకరణ తీవ్రమై, ఆర్థిక జీవితంలో కీలకపాత్ర నిర్వహించే గుత్తసంస్థల ఏర్పాటుకు దారితీస్తాయి. (2) బ్యాంకు పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడితో కలిసిపోయి, ఈ ద్రవ్య పెట్టుబడి ప్రాతిపదికపై ద్రవ్య గుత్తాధిపత్యం ఏర్పడుతుంది. (3) సరుకుల కన్నా పెట్టుబడి ఎగుమతికి ప్రాధాన్యత పెరుగుతుంది. (4) అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారి కూటములు ఏర్పడి ప్రపంచాన్ని తమ మధ్య పంచుకుంటాయి. (5) బడా పెట్టుబడిదారి దేశాలు తమ మధ్య ప్రపంచాన్ని పంచుకోవటం పూర్తి అవుతుంది.

గుత్తసంస్థలు, ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం వహించే దశకు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారి విధానమే సామ్రాజ్యవాదం. ఈ దశలో పెట్టుబడుల ఎగుమతి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. బలమైన పెట్టుబడిదారి దేశాలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాలను తమ మధ్య పంచుకోవటం పూర్తవుతుంది. 1917 డిసెంబరులో లెనిన్ సామ్రాజ్యవాదాన్ని గురించి మరింతగా విశదీకరించాడు. "పెట్టుబడిదారి విధానం యొక్క ఒక ప్రత్యేక దశయే సామ్రాజ్యవాదం. ఈ ప్రత్యేకదశ గుత్త పెట్టుబడిదారి విధానం, క్షీణించిపోతున్న పెట్టుబడిదారి విధానం, చావుకు సిద్ధంగా ఉన్న పెట్టుబడిదారి విధానం అనే మూడు విధాలుగా ఉంటుంది". సామ్రాజ్యవాదంపై లెనిన్ సిద్ధాంతాన్ని దృష్టిలో ఉంచుకొని, సమకాలీన పెట్టుబడిదారి విధానాన్ని, అది మారుతున్న తీరును పరిశీలిద్దాం. నయా–సామ్రాజ్యవాదమే అంత్యదశ లోని పెట్టుబడిదారి విధానం.

### ఉత్పత్తి, మారకంలో నూతన గుత్తాధిపత్యం

సామ్రాజ్యవాదం యొక్క ఆర్థిక పునాది గుత్తాధిపత్యం అని లెనిన్ చెప్పాడు. పెట్టుబడిదారి విధాన మౌలిక సూత్రమైన పోటి ఫలితంగా ఉత్పత్తి, పెట్టుబడి కేంద్రీకరించబడతాయి. ఈ కేంద్రీకరణ ఒకదశకు చేరేసరికి గుత్తాధిపత్యంగా మారుతుంది. స్వేచ్ఛాపోటీకి మారుగా గుత్తసంస్థల కూటములు ఆధిపత్యం చలాయిస్తాయి. 1970 దశాబ్దం ప్రారంభంలో పెట్టుబడిదారి విధానానికి ఎదురైన "మాంద్యోల్బణ" సంక్షోభం పది సంవత్సరాలు కొనసాగింది. తర్వాత మాంద్యంతో ఉత్పత్తి పెరుగుదల పడిపోయింది. దేశీయ మార్కెట్లలో స్తబ్దత, పోటీ వలన ఎదురౌతున్న ఒత్తిడులు విదేశాల్లో ఉన్న అవకాశాల అన్వేషణకు గుత్త పెట్టుబడిని పురికొల్పాయి. నూతనతరం సమాచార, సాంకేతిక

> **❝ ఉత్పత్తి, మారకాలలో గుత్తపెట్టుబడి ప్రపంచవ్యాపితంగా పునఃపంపిణి అయింది. ప్రపంచవ్యాపితంగా ఉత్పత్తిని వికేంద్రీక రించటం ద్వారా ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న విలువలను, పని నిర్వహణ, యాజమాన్య విధానాలను బహుళజాతి కంపెనీలు విభజన చేసుకున్నాయి. వివిధ రకాలైన పద్ధతుల ద్వారా తమ కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటున్నాయి. మధ్యంతర ఉత్పత్తులను, ఉత్పత్తి, వాణిజ్యం, సేవలను విభజించి, ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్నాయి. ❞**

పరిజ్ఞానంతో విదేశాలలో ప్రత్యక్ష పెట్టుబడులు, అంతర్జాతీయ పారిశ్రామిక సరుకుల మారకం నిరంతరంగా నూతన శిఖరాలకు చేరుతున్నది. గతంలో జరిగిన ఉత్పత్తి, మారకాల ప్రపంచీ కరణ వీటి ముందు దిగదుడుపుగా ఉంటుంది.

ఉత్పత్తి, మారకాలలో గుత్తపెట్టుబడి ప్రపంచవ్యాపితంగా పునఃపంపిణి అయింది. ప్రపంచవ్యాపితంగా ఉత్పత్తిని వికేంద్రీకరించటం ద్వారా ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న విలువలను, పని నిర్వహణ, యాజమాన్య విధానాలను బహుళజాతి కంపెనీలు విభజన చేసుకున్నాయి. వివిధ రకాలైన పద్ధతుల ద్వారా తమ కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటున్నాయి. మధ్యంతర ఉత్పత్తులను, ఉత్పత్తి, వాణిజ్యం, సేవలను విభజించి, ప్రపంచం లోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తాయి. ఉత్పత్తి, ముడి సరుకుల అమ్మకం, కొనుగోలు కార్యకలాపాలను అనుబంధ కంపెనీలు, కాంట్రాక్టర్లు, సరఫరాదారుల ద్వారా కొనసాగి స్తారు. మధ్యంతర ఉత్పత్తులు, సేవల మారకం ప్రపంచవాణిజ్యంలో 60 శాతం ఉండగా, అందులో 80 శాతం బహుళజాతి కంపెనీల ద్వారా జరుగుతున్నదని వివిధ సంస్థలు అందిస్తున్న లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

నయా-సామ్రాజ్యవాద దశలో రెండవ ముఖ్యమైన అంశం ఉత్పత్తి, మారకాలు మరింతగా ప్రపంచీకరించబడటం. పెట్టుబడి కేంద్రీకరణ బడా బహుళజాతి గుత్తసంస్థలు ఆవిర్భవించటానికి దారి తీస్తున్నది. బహుళ జాతి సంస్థలు ప్రస్తుత అంతర్జాతీయ గుత్తాధి పత్యానికి నిజమైన ప్రతినిధులుగా ఉన్నాయి. బహుళజాతి గుత్తసంస్థలను గురించి దిగువ విధంగా చెప్పుకోవచ్చు. 1. ప్రపంచవ్యాపితంగా బహుళజాతి సంస్థలు పెరిగాయి. ఉత్పత్తి, మారకాల ప్రపంచీకరణ, సామాజికీకరణ ఉన్నతస్థాయికి చేరింది. 1980 తర్వాత అంతర్జాతీయ ఆర్థిక కార్యకలాపాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో బహుళజాతి సంస్థలు ప్రధానమైన పాత్ర నిర్వహిస్తున్నాయి. 1980 దశాబ్దంలో ఉత్పత్తి, వాణిజ్యం కన్నా విదేశాలలో పెట్టుబడులు శరవేగంతో పెరి గాయి. 1990లలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అసాధారణ స్థాయికి చేరాయి. విదేశీ పెట్టుబడుల ద్వారా బహుళజాతి సంస్థల సంఖ్య 15,000 నుండి 82,000కు పెరిగింది. 1980-2008 మధ్య బహుళజాతి సంస్థల అనుబంధ సంస్థలు 35,000 నుండి 8,10,000 లకు చేరుకున్నాయి. 2017లో పైస్థాయిలోని 100 ద్రవ్యేతర బహుళజాతి సంస్థల ఆస్తులు, అమ్మకాలలో విదేశాలలోని అనుబంధ సంస్థలవి 60 శాతంకు పైగా ఉన్నాయి. మొత్తం సిబ్బందిలో 60 శాతం వరకు విదేశీయులు ఉన్నారు.

బహుళజాతి సంస్థలు సంఖ్యరీత్యా ఎక్కువ లేనప్పటికీ వాటిశక్తి చాలా అధికంగా ఉంది. అవి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించటంలో ముందుండటంతో పాటు మార్కెట్లు, ముడి సరుకుల వనరులు, ద్రవ్య పెట్టుబడిపై అదుపుకలిగి ఉన్నాయి. కాబట్టి అవి ఉత్పత్తి, మారకంపై గుత్తాధిపత్యంతో పోటీలో అత్యంత సానుకూలతను కలిగి ఉన్నాయి. మార్కెట్ల విస్తరణ, ఉత్పత్తి ఖర్చులు తగ్గటం వలన 28,000 బడా కంపెనీల లాభాలు 1980-2013 మధ్య రెండు లక్షల కోట్ల డాలర్ల నుండి 7.2 లక్షల కోట్ల డాలర్లకు పెరిగాయి. ఈ సంస్థల ఉత్పత్తి మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 7.6 శాతం నుండి 10 శాతంకు పెరిగింది. కొన్ని బహుళజాతి సంస్థలకు అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం అనేక అభివృద్ధి చెందిన దేశాల ఆదాయాన్ని మించిపోయింది. ఉదాహరణకు 2009లో టయోటా కంపెని ఆదాయం ఇజ్రాయిల్ దేశ జిడిపిని మించిపోయింది. 2017లో వాల్‌మార్ట్ సంపాదించిన 50,000 కోట్ల డాలర్ల ఆదాయం బెల్జియం జిడిపి కన్నా ఎక్కువ. ప్రపంచంలోని 100 బహుళజాతి సంస్థలు ప్రపంచ జిడిపిలో 70 శాతాన్ని స్వంతం చేసుకొంటుండగా, 200 దేశాలలో 100 పెద్ద ఆర్థికవ్యవస్థలు 30 శాతం జిడిపిని మాత్రమే పొందుతున్నాయి. ఉత్పత్తి, మారకం, ఇతర కార్యకలాపాలు వికేంద్రీకరణ అవుతున్నప్పటికీ లాభాలలో అత్యధిక శాతం కొద్ది దేశాలకే చేరుతున్నాయి. వీటి మాతృసంస్థలు కొన్ని దేశాలలోనే కేంద్రీకృతమై ఉన్నాయి. 2017లో ప్రపంచంలోని పైస్థాయి 500ల కంపెనీలలో అమెరికా, జపాన్, జర్మని, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలకు చెందిన కంపెనీలు 50 శాతం ఉన్నాయి. పైస్థాయిలోని 100 కంపెనీలలో మూడింట రెండు వంతులు ఈ దేశాలకు చెందినవే ఉన్నాయి.

వ్యవసాయరంగంలోని బహుళజాతి సంస్థలు బాస్ఫ్, బేయర్, డౌ, డుపాంట్, మోన్‌సాంటో, సింజెంటాలు కలిసి 2015లో ప్రపంచ పురుగుమందుల మార్కెట్‌లో 75 శాతం, విత్తనమార్కెట్‌లో 63 శాతంపై ఆధి పత్యం కలిగివున్నాయి. 2010లో వైద్య పరికరాలను ఉత్పత్తి చేసే 25 కంపెనీలు వైద్య పరికరాల అమ్మకంలో 60 శాతంకు పైగా వాటాను కలిగివున్నాయి. మందుల ఉత్పత్తి రంగంలోని 10 బడా సంస్థలు 47 శాతం మందుల ఉత్పత్తి, అమ్మకం చేస్తున్నాయి.

**ద్రవ్య పెట్టుబడి నయా గుత్తాధిపత్యం**

బ్యాంకుల గుత్త పెట్టుబడి ద్రవ్య గుత్త పెట్టుబడితో కలవటం ద్వారా నూతన తరహా ద్రవ్య పెట్టుబడి రూపొందింది. ఆధిపత్యంలో ఉన్న సామ్రాజ్యవాద దేశాలలోని బ్యాంకులు సాధారణమైన సంస్థల స్థాయి నుండి శక్తివంత మైన గుత్తసంస్థలుగా మారటంతో 20వ శతాబ్దం ప్రారంభంలో సాధారణ పెట్టుబడిదారీ విధా నం నుండి ద్రవ్య పెట్టుబడి అధిపత్యానికి మారే పరిణామం చోటు చేసుకుంది. రెండవ ప్రపంచయుద్ధానికి ముందు నిరంతరం సంభవిం చిన యుద్ధాలు, సమాచారాన్ని పంపటానికి అధికంగా ఖర్చుకావటం, వాణిజ్య రక్షణలు తదితర సాంకేతిక, సంస్థాగతమైన ఆటంకాల వలన ప్రపంచంలో పెట్టుబడులు, వాణిజ్యం, ద్రవ్య సరఫరా, మార్కెట్లు తదితరాలు సాపేక్షం గా బలహీనంగా ఉండేవి. ద్రవ్య పెట్టుబడులు ఇతర చోట్లకు విస్తరించటానికి ఆర్థికవ్యవస్థల ప్రపంచీకరణ బలహీనంగా ఉండటం ఆటంకంగా ఉండేది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత చోటు చేసుకున్న సాంకేతిక విప్లవంతో ఆర్థికవ్యవస్థల ప్రపంచీకరణ వేగం పుంజు కుంది. 1970వ దశాబ్దం ప్రారంభంలో చమురు ధరలు పెరగటం ప్రపంచవ్యాపిత

> **❝ నయా-సామ్రాజ్యవాద దశలో కొద్దిసంఖ్యలో ఉన్న బహుళజాతి సంస్థలు, వాటిలో అత్యధిక భాగంగా ఉన్న బ్యాంకులు ప్రపంచవ్యాపితంగా విస్తారమైన సంబంధాలతో కలసిపోతు న్నాయి. భాగస్వాములు కావటం, షేర్‌హోల్డింగ్ తదితర విధానా లతో అత్యధిక భాగం చిన్న, మధ్య తరగతి సంస్థలను మాత్రమే కాక, ప్రపంచంలోని ప్రధానమైన ఆర్థికసంస్థలను కూడా బహుళజాతి సంస్థలు అదుపు చేస్తున్నాయి. కొద్దిసంఖ్యలోని బహుళజాతి బ్యాంకులు ప్రపంచ ఆర్థికవ్యవస్థను శక్తివంతంగా అదుపు చేస్తున్నాయి. ❞**

సంక్షోభానికి దారితీసింది. ఈ సంక్షోభంలో ద్రవ్యోల్బణం, మాంద్యం కలిసివచ్చాయి. తమ పెట్టుబడులను లాభదాయకమైన ప్రాంతాలలో పెట్టటం ద్వారా "మాంద్యోల్బణం" నుండి తప్పించుకోవటం, పోటిపడే శక్తిని పెంచుకోవటం కోసం ద్రవ్య పెట్టుబడులు సాంప్రదాయక పరిశ్రమలను సముద్రాంతర ప్రాంతాలకు తరలించాయి. ఇదేకాలంలో సాంప్రదాయక పరిశ్రమల నుండి విడగొట్టుకోవటం ద్వారా ద్రవ్య పెట్టుబడులు నూతన రంగాలలో అవకాశాలను అన్వేషించాయి. పెట్టుబడిదారి ప్రపంచీకరణ, ద్రవ్యీకరణ ఒకదానిని మరొకటి బలపరచుకున్నాయి. నిజ ఆర్థికవ్యవస్థతో సంబంధం లేకుండా ఊహలపై ఆధారపడి ద్రవ్య పెట్టుబడులు పనిచేయటం పెరుగుతున్నది.

నయా–సామ్రాజ్యవాద దశలో కొద్ది సంఖ్యలో ఉన్న బహుళజాతి సంస్థలు, వాటిలో అత్యధిక భాగంగా ఉన్న బ్యాంకులు ప్రపంచ వ్యాపితంగా విస్తారమైన సంబంధాలతో కలసిపోతున్నాయి. భాగస్వాములు కావటం, షేర్‌హోల్డింగ్ తదితర విధానాలతో అత్యధిక భాగం చిన్న, మధ్య తరగతి సంస్థలను మాత్రమే కాక, ప్రపంచంలోని ప్రధానమైన ఆర్థికసంస్థలను కూడా బహుళజాతి సంస్థలు అదుపు చేస్తున్నాయి. కొద్దిసంఖ్యలోని బహుళజాతి బ్యాంకులు ప్రపంచ ఆర్థికవ్యవస్థను శక్తివంతంగా అదుపు చేస్తున్నాయి. పైస్థాయిలోని 737 బహుళజాతి సంస్థలు 80 శాతం ప్రపంచ ఉత్పత్తిపై అదుపు కలిగివున్నాయి. వీటిలో కూడా 147 సంస్థలు 40 శాతం ఉత్పత్తిని అదుపు చేస్తున్నాయి. ఈ 147లో నాలుగింట మూడు వంతులు ద్రవ్యపరమైన సంస్థలు ఉన్నాయి.

ప్రపంచీకరణ, ద్రవ్య సరళీకరణ విధానాలను అనుసరించాలని అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రోత్సహిస్తూ నయా–ఉదారవాద ఆర్థికవేత్తలు బహుళజాతి సంస్థల ప్రచారకులుగా వ్యవహరిస్తున్నారు. ఆ దేశాల పెట్టుబడి ఖాతాలను సరళీకరించాలని ఉద్బోధిస్తున్నారు. ఈ సలహాలను పాటిస్తే ఈ దేశాలు తమ స్వంత ద్రవ్య విధానాలను అమలు చేయటం కష్టమౌతుంది. ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపతులు ఈ దేశాల సంపదలను దోచుకోవటానికి మరిన్ని అవకాశాలు అందుబాటులోకొస్తాయి. పెట్టుబడి మార్కెట్లలో కార్యకలాపాల ద్వారా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల గుత్తాధిపతులు అభివృద్ధి చెందుతున్న దేశాల బలహీనమైన ద్రవ్య రక్షణ వ్యవస్థలను దెబ్బతీసి, ఆ దేశాలు దశాబ్దాలుగా కూడబెట్టుకున్న సంపదలను దోచుకుంటున్నారు. ఈ విధంగా సరళీకరణ, ప్రపంచీకరణ విధానాల ద్వారా తాము ఏర్పరచుకున్న వివిధ యంత్రాంగాలతో తక్కువ అభివృద్ధి అయిన దేశాల వనరులను, మిగులును ప్రపంచ కేంద్రంగా ఉన్న సామ్రాజ్యవాద దేశాలు తమ స్వంతం చేసుకుంటున్నాయి. కొద్దిమందిగా ఉన్న అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారుల చేతిలో కేంద్రీకరింపబడి ఉండటం, గుత్తాధిపత్యం ద్వారా విదేశాలలో పెట్టుబడులు పెట్టటం, నూతన వ్యాపారాలను ప్రారంభించటం, ఇతర సంస్థలతో కలసిపోవటం, వాటాలను కొనుగోలు చేయటం తదితరాల ద్వారా ద్రవ్య పెట్టుబడులు గుత్త లాభాలను సంపాదిస్తున్నాయి. ప్రపంచం మొత్తం నుండి లాభాలను, ఇతర రూపాలలో నిరంతరం వసూళ్ళు చేయటం ద్వారా గుత్తాధిపతుల ఆధిపత్యం బలపడుతున్నది.

### కార్మికులపై దోపిడీని తీవ్రం చేసిన ద్రవ్య పెట్టుబడి

అవుట్‌సోర్సింగ్, అనుబంధ సంస్థల ఏర్పాటు, వ్యూహాత్మక మైత్రి సంబంధాలను ఏర్పాటు చేసుకోవటం ద్వారా బహుళజాతి సంస్థలు ఎక్కువ దేశాలు, కంపెనీలను ప్రపంచ ఉత్పత్తి గొలుసులో భాగస్వాములను చేస్తున్నాయి. ప్రపంచంలో తక్కువ వేతనానికి పనిచేసే కార్మికులు ఎక్కువగా ఉండటమే ఇంత పెద్దమొత్తంలో పెట్టుబడి సమీకరణ కావటానికి కారణం. అంతర్జాతీయ కార్మికసంస్థ లెక్కల ప్రకారం 1980–2007 మధ్య ప్రపంచంలో కార్మికుల సంఖ్య 190 కోట్ల నుండి 310 కోట్లకు పెరిగింది. వీరిలో 73 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్నారు. చైనా, భారతదేశాలలో 40 శాతం ఉన్నారు. బహుళజాతి సంస్థలు ఐక్యంగా ఉన్నాయి. కాని ఐక్యంగా ఉండటం, తమ ప్రయోజనాలను రక్షించుకోవటం ప్రపంచంలోని కార్మికులకు కష్టంగా ఉన్నది. ప్రపంచ కార్మికులలో నిరుద్యోగులు పెద్దసంఖ్యలో ఉండటంతో కార్మికులను చీల్చటం, వారిని తన అదుపులో ఉంచుకోవటానికి అవసరమైన విధానాలను అమలు చేయటం పెట్టుబడికి సులభంగా ఉన్నది. గత అనేక దశాబ్దాల నుండి అభివృద్ధి చెందిన దేశాలలోని ఉత్పత్తిరంగాలను అభివృద్ధి చెందుతున్న దేశాలలోకి తరలించటం ద్వారా వివిధ దేశాలలోని కార్మికులు కనీస జీవనానికి అవసరమైన ఆదాయాల కోసం తమలో తాము పోటిపడేలా చేస్తున్నది. ఈ విధానాల ద్వారా బహుళజాతి సంస్థలు ప్రపంచ కార్మికుల నుండి భారిస్థాయిలో ఆదాయాన్ని కొల్లగొడుతున్నాయి. దీనితో పాటుగా తమ పెట్టుబడులకు భారిస్థాయిలో రాయితీలు ఇచ్చే విధంగా బడా కార్పొరేషన్లు కుమ్మక్కై ప్రభుత్వాల ఒత్తిడి తీసుకొస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలోని అనేక ప్రభుత్వాలు ఫ్యాక్టరీలను స్థాపించటం ద్వారా జిడిపిని పెంచుకోవాలనే తపనతో అంతర్జాతీయ పెట్టుబడులకు పన్ను రాయితీలు, భారీగా రుణాలు ఇస్తున్నాయి. ఈ క్రమంలో సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, కార్మిక హక్కుల రక్షణను విస్మరిస్తున్నాయి. ఉత్పత్తి ప్రపంచీకరణ కావటం వలన అభివృద్ధి చెందిన దేశాలు న్యాయమైన వాణిజ్యం పేరుతో తక్కువ అభివృద్ధి చెందిన దేశాలను దోపిడి చేస్తున్నాయి. తమ దేశాలను ఆధునీకరించాలని ప్రయత్నిస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రభుత్వాలకు ఎక్కువ సందర్భాలలో సామ్రాజ్యవాదులు చెప్పినది చేయటం మినహా స్వతంత్రంగా వ్యవహరించటానికి అవకాశం లేకుండా పోతున్నది. వారు పెట్టిన షరతులు, ఆంక్షలను అమలుచేయక తప్పని పరిస్థితి ఎదురౌతున్నది.

బహుళజాతి సంస్థల లాభాలు అపారంగా పెరుగుతున్నాయి. అమెరికా కార్పొరేట్ సంస్థల లాభాలలో ఇతర దేశాలలోని పెట్టుబడులపై వస్తున్న లాభాలు 1950లో 2 శాతం నుండి 2000లో 113 శాతానికి పెరిగాయి. మేధోపరమైన ఆస్తిహక్కులపై తమకున్న గుత్తాధిపత్యాన్ని ఉపయోగించుకొని భారీగా లాభాలు సంపాదిస్తున్నాయి. ప్రొడక్షన్ డిజైన్‌లు, బ్రాండ్‌పేర్లు, మార్కెటింగ్‌లో ఉపయోగించే సింబల్స్, ఇమేజ్‌లు మేధోపరమైన ఆస్థిలో భాగమే. పేటెంట్లు, కాపిరైట్లు,, ట్రేడ్‌మార్క్ పరిరక్షణ చట్టాల ద్వారా వీటిపై గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. వాణిజ్యం

అభివృద్ధిపై ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్స్ విడుదల చేసిన అంకెల ప్రకారం రాయల్టీలు, లైసెన్సింగ్ ఫీజుల రూపంలో బహుళజాతి సంస్థలకు వెనుకబడిన దేశాలు 1990లో 3100 కోట్ల డాలర్లు చెల్లించగా, 2017లో ఆ మొత్తం 33,300 కోట్ల డాలర్లకు పెరిగింది.

1990 దశాబ్దం మధ్యకాలం నుండి అంతర్జాతీయ గుత్తసంస్థలు పెటెంట్లు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ట్రేడ్‌మార్క్‌లలో 80 శాతంపై ఆధిపత్యం కలిగివున్నాయి. ఇవి వాటికి అపారమైన లాభాలను తెచ్చిపెడుతున్నాయి. 2018 జనవరిలో అమెరికా నేషనల్ సైన్స్ కౌన్సిల్ విడుదల చేసిన వివరాల ప్రకారం ప్రపంచంలో మేధోపరమైన ఆస్తిహక్కులపై లైసెన్స్‌లను ఇతర దేశాలకు అమ్మటం ద్వారా అంతర్జాతీయ గుత్తసంస్థలకు 2016లో 27,200 కోట్ల డాలర్ల ఆదాయం వచ్చింది. మేధోపరమైన ఆస్తిహక్కుల అమ్మకంలో అగ్రస్థానంలో ఉన్న అమెరికాకు ప్రపంచ ఆదాయంలో 45 శాతం వస్తున్నది. యూరోపియన్ యూనియన్‌కు 24 శాతం, జపాన్‌కు 14 శాతం వస్తున్నది. చైనాకు 5 శాతం కన్నా తక్కువ వస్తున్నది. చైనా 2001లో ఇతర దేశాలకు 190 కోట్ల డాలర్ల రాయల్టీలు చెల్లించగా అది 2017 నాటికి 2,860 కోట్ల డాలర్లకు చేరుకున్నది. మేధోపరమైన ఆస్తిహక్కుల కోసం జరుగుతున్న చెల్లింపులలో చైనా 2000 కోట్ల డాలర్ల లోటులో ఉన్నది. ఇదే కాలంలో మేధోపరమైన ఆస్తిహక్కులను ఇతరదేశాలు వినియోగించుకోవటానికి అనుమతించటం ద్వారా అమెరికా సంవత్సరానికి 8,000 కోట్ల డాలర్ల ఆదాయం సంపాదించింది.

**“ 1990 దశాబ్దం మధ్యకాలం నుండి అంతర్జాతీయ గుత్తసంస్థలు పేటెంట్లు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ట్రేడ్‌మార్క్‌లలో 80 శాతంపై ఆధిపత్యం కలిగివున్నాయి. ఇవి వాటికి అపారమైన లాభాలను తెచ్చిపెడుతున్నాయి. 2018 లో అమెరికా నేషనల్ సైన్స్ కౌన్సిల్ విడుదల చేసిన వివరాల ప్రకారం ప్రపంచంలో మేధోపరమైన ఆస్తి హక్కులపై లైసెన్స్‌లను ఇతర దేశాలకు అమ్మటం ద్వారా అంతర్జాతీయ గుత్తసంస్థలకు 2016లో 27,200 కోట్ల డాలర్ల ఆదాయం వచ్చింది. ”**

### బడా బహుళజాతి సంస్థల నాయకత్వంలో ద్రవ్య గుత్త పెట్టుబడి

బహుళజాతి కార్పొరేషన్ల ఉత్పత్తి, ద్రవ్య గుత్తాధిపత్యం పారిశ్రామిక ఉత్పత్తి, పెట్టుబడి అత్యున్నత స్థాయిలో కేంద్రీకరణ కావటంతో ముడిపడి ఉంది. ఈ కేంద్రీకరణ ఫలితంగా పారిశ్రామికరంగంలోని ప్రతి విభాగం కొద్ది మంది చేతిలో కేంద్రీకృతమైంది. ఆటోమొబైల్ రంగాన్ని ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. ప్రపంచంలో ఆటోమొబైల్ రంగంలో ఐదు బడా సంస్థలు 50 శాతం ఉత్పత్తి చేస్తుండగా, పది బడాసంస్థలు 70 శాతం ఉత్పత్తి చేస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య గుత్త పెట్టుబడులు ప్రపంచంలోని ప్రధాన పరిశ్రమలను అదుపు చేయటం మాత్రమే కాకుండా దాదాపుగా అన్ని ముడి సరుకుల వనరులు, ఉత్పత్తి కేంద్రాలు, శాస్త్ర, సాంకేతిక నైపుణ్యం, సాంకేతిక నిపుణులు, కీలక రవాణా కేంద్రాలతో పాటు ఉత్పత్తిలోని ఇతర రంగాలపైనా ఆధిపత్యం వహిస్తున్నాయి. పెట్టుబడులపై ఆధిపత్యం వహించటం మాత్రమే కాక, బ్యాంకుల ద్వారా వివిధరకాలైన ద్రవ్య కార్యకలాపాలను అదుపుచేస్తున్నాయి. బడా కార్పొరేషన్ల మొత్తం మార్కెట్ విలువ, ఆదాయం, ఆస్తులను లెక్కిస్తే ప్రపంచంలోని 100 బడా కార్పొరేషన్ల శక్తి బహిర్గతమౌతుంది. 2015లో ప్రపంచంలోని పైస్థాయి 100 కార్పొరేషన్ల మార్కెట్ విలువ దిగువస్థాయిలోని 2000ల కార్పొరేషన్ల మార్కెట్ విలువ కన్నా 7000 రెట్లు అధికంగా ఉన్నది. 1995లో ఈ వ్యత్యాసం 30 రెట్లు మాత్రమే ఉన్నది. 2017 సంవత్సరానికి ఫార్చ్యూన్ విడుదల చేసిన లెక్కల ప్రకారం ప్రపంచంలోని పైస్థాయి 500ల కార్పొరేషన్లలోని 380 సంస్థల ఆదాయం 22 లక్షల 83 వేల కోట్ల డాలర్లు. ఇది మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 29.3 శాతానికి సమానం. 18.85 శాతం లాభాలు 1.51 లక్షల కోట్ల డాలర్లకు చేరాయి. లాభాల రేటు, స్థాయి నయా-సామ్రాజ్యవాద బందిపోటు దోపిడి స్వభావాన్ని వెల్లడిస్తున్నాయి.

అంతర్జాతీయంగా సరుకులపై తన ఆధిపత్యం ద్వారా నయా-సామ్రాజ్యవాదం అసాధారణమైన లాభాలను సంపాదిస్తున్నది. ఆయా ప్రభుత్వాలపై వత్తిడి తీసుకురావటం ద్వారా ముడి సరుకుల ధరలు తక్కువగా ఉండేలా చేస్తున్నది. తన ఇష్టం వచ్చిన విధంగా పెట్టుబడులను దేశంలోకి, బయటికి తీసుకుపోవటం ద్వారా ద్రవ్య బుడగలు, సంక్షోభాలను సృష్టిస్తున్నది. ఆ దేశాలలో ఆర్థిక, రాజకీయ అస్థిరత్వానికి కారణమౌతున్నది. వివిధ దేశాలపై ద్రవ్యపరమైన ఆంక్షలను విధించటం ద్వారా యుద్ధం చేయకుండానే విజయం సాధిస్తున్నది. ద్రవ్యపరమైన ఆస్తుల విలువ పెరగటం వలన అవధులు లేకుండా సామాజిక సంపదను కొల్లగొడుతూ పైస్థాయిలో ఉన్న ద్రవ్య గుత్తసంస్థలు, బహుళజాతి కార్పొరేషన్లు లాభపడుతున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థలను, సామాజిక ఆస్తులను ప్రైవేటీకరించటం ద్వారా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రజల సంపద బహుళజాతి కార్పొరేషన్ల చేతుల్లోకి పోతున్నది. ఫలితంగా ప్రపంచదేశాల మధ్య సంపదలో అసమానతలు పెరుగుతున్నాయి. ఆర్థిక, రాజకీయ, సైనిక ఆధిపత్యాన్ని వినియోగించటం ద్వారా నయా-సామ్రాజ్యవాద దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో సృష్టించబడుతున్న సంపదలో కొంత భాగాన్ని తమ దేశాలకు తరలించుకుపోతున్నాయి. ఫలితంగా గుత్తసంస్థల వద్ద సంపద పోగుపడటంతో పాటు ధనిక, పేద దేశాల మధ్య, ఆయా దేశాలలోని ధనికులు, పేదల మధ్య అసమానతలు పెరుగుతున్నాయి. 2018లో జి7 దేశాల ఉమ్మడి జిడిపి 31.7 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది మొత్తం ప్రపంచ జిడిపిలో 45.5 శాతం. 2013లో క్రెడిట్ సూయిస్సి తయారు చేసిన ప్రపంచ సంపద నివేదికలో 85 మంది అత్యంత ధనికుల సంపద ప్రపంచంలోని 350 కోట్లమంది పేదల మొత్తం ఆస్తులకు సమానంగా ఉన్నది.

పెట్టుబడిదారీ విధానం అంతం కావటం అనివార్యం అని కమ్యూనిస్టు ప్రణాళిక ప్రకటించిన దశాబ్దాల తర్వాత, పెట్టుబడిదారుల ప్రైవేటు ఆస్తికి చావుగంట మోగుతుందని పెట్టుబడి గ్రంథంలో మార్క్స్ ప్రకటించారు. ఆ తర్వాత అక్టోబరు విప్లవం జారిస్టు రష్యన్ సామ్రాజ్యాన్ని కూల్చి, సోషలిస్టు విధానాన్ని ప్రవేశపెట్టింది. తర్వాత మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టి అర్థ ఫ్యూడల్, అర్థ వలస దోపిడి నుండి ప్రజలను విముక్తి చేసింది. రష్యా, మరికొన్ని దేశాలలో సోషలిజానికి ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ చారిత్రక అభివృద్ధి క్రమాన్ని అవేవీ మార్చలేవు. అంతర్జాతీయంగా వర్గ పోరాటంలో జరుగుతున్న మార్పులను మనం పరిశీలిస్తే 21వ శతాబ్దంలో కార్మికవర్గం, ప్రజలు గొప్ప విప్లవ పోరాటాలలో పాల్గొనటానికి, ప్రపంచశాంతిని కాపాడటానికి ముందుకువస్తారు. సోషలిస్టు, అభ్యుదయ పథంలో పయనిస్తున్న దేశాలు మానవాళి భవిష్యత్ కోసం సమైక్యంగా కృషి చేస్తాయి.

**(స్వేచ్ఛానుసరణ: ఎ కోటిరెడ్డి)**

వ్యవసాయ రంగం

# రైతుల ఆత్మహత్యలు : ఒక అధ్యయనం

**ధన్యాందేవ్ తలులే**

**(2008లో వ్యవసాయ రుణాల మాఫీ జరిగిన తర్వాత మహారాష్ట్రలోని మరట్వాడా, విదర్భ ప్రాంతంల్లోని యావత్మల్‌లో రైతుల ఆత్మహత్యలు అత్యధికంగా జరిగాయి. 2014 నుండి 2017 వరకు ఇక్కడ ఆత్మహత్యలకు గురైన రైతుల కుటుంబాలపై ధన్యాందేవ్ తలులే పరిశోధన చేశారు. ఆయన మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఉన్న శివాజీ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగ అధిపతి. ఆయన అధ్యయనంలో వెల్లడైన ముఖ్యాంశాలను మార్పిస్టు పాఠకులకు అందిస్తున్నాం....సంపాదకుడు.)**

బ్రిటిష్ పాలనలో 19వ శతాబ్దం నుండి రైతుల ఆత్మహత్యలు ప్రారంభమైనాయని చరిత్ర చెపుతోంది. ప్రధానంగా 19వ శతాబ్దంలో వ్యాపార పంటలు పండించిన రైతులలో ఈ ఆత్మహత్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వ్యాపారపంటల ఆదాయంలో ఎగుడుదిగుడులు, ఫలితంగా ఎదురైన ఆర్థిక ఇబ్బందులు రైతులు ప్రభుత్వం, గ్రామీణ వడ్డీ వ్యాపారుల మీద తిరగబడేలా చేసింది. ప్రభుత్వేతరుల దగ్గర అత్యధిక వడ్డీలకు అప్పులు చేసిన, నకాలంలో భూమి శిస్తులు కట్టలేకపోయిన వారిలో 19వ శతాబ్దం నుండి ఆత్మహత్యల రేటు అధికంగా కనిపిస్తున్నది. 1870లలో వలస పాలకులు కరువులు, క్షామాలు పట్టించుకోకుండా రైతుల మీద పన్నులు వేసి, వాటిని నగదు రూపంలో వసూలు చేసేవారు. వీటితో పాటు వలస ప్రభుత్వం అధిక వడ్డీలు వసూలు చేసే షావుకార్లకు, భూస్వాములకు రక్షణ కల్పించటం కూడా గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యానికి, నైరాశ్యానికి కారణంగా ఉండేది. ఈ పరిస్థితుల వల్ల 1850 నుండి 1940ల వరకు బ్రిటీష్ ఇండియాలో రైతుల ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉండేది. రైతుల ఆత్మహత్యలతో పాటు ఆకలి చావులు కూడా ఎక్కువగా ఉండేవి.

స్వాతంత్ర్యానంతరం భారతదేశ వ్యవసాయంలో వ్యాపార పంటలు పెరగటం, మార్కెట్‌లో ఎదురౌతున్న అస్థిర పరిస్థితులు రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయేలా చేశాయి. 1960, 1970లలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కర్ణాటకలలో రైతుల ఆత్మహత్యల కేసులు నమోదయాయి. 1990లలో వివిధ రాష్ట్రాలలో ఈ కేసులు ఒక్కసారిగా పెరిగాయి. ఈ సమయంలోను, ఆ తర్వాత నుండి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలు రైతుల ఆత్మహత్యల కేంద్రాలుగా మారాయి. ఇదే సమయంలో మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో కూడా ఆత్మహత్యలు అత్యధికంగా నమోదా కావటం, ఇప్పటికీ ఆ ధోరణి కొనసాగటం జరుగుతున్నది. మరట్వాడా ప్రాంతంలో కూడా ఇదే పరిణామాలు కొనసాగుతున్నాయి.

1997–2005 వరకు సగటున ప్రతి 32 నిమిషాలకు ఒక భారతీయ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విధంగా రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్న పరిస్థితులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. 2015 సంవత్సరానికి ఎన్‌సిఆర్‌బి విడుదల చేసిన నివేదిక ప్రకారం 2014లో జరిగిన రైతుల ఆత్మహత్యలలో 90 శాతం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలలోనే నమోదయ్యాయి. 2014తో పోల్చితే 2015లో 42 శాతం పెరిగాయి. 2014లో ప్రతిరోజూ 15 మంది భారతీయ రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2015లో ఇది 21కి పెరిగింది. అంటే పెరుగుదల 71.42 శాతంగా ఉంది. ఇది చాలా ఆందోళన కలిగిస్తున్నది. రైతుల ఆత్మహత్యలకు ముఖ్య కారణం ఆర్థిక ఇబ్బందులు, పెరిగిపోతున్న రుణభారం. ఆయా రాష్ట్రాలలో రైతుల రుణగ్రస్తతపై వెల్లడౌతున్న వాస్తవాలు దీనిని బలపరుస్తున్నాయి. తెలంగాణాలో 2013లో 89 శాతం రైతులు రుణగ్రస్తులు కాగా, కర్ణాటకలో 77 శాతం, మహారాష్ట్రలో 56 శాతం, మధ్యప్రదేశ్‌లో 46 శాతం, ఛత్తీస్‌ఘడ్‌లో 37 శాతం రైతులు రుణగ్రస్తులుగా ఉన్నారు. భారతదేశంలో రైతుల ఆత్మహత్యలకు రుణగ్రస్తత (26.6 శాతం), కుటుంబ సమస్యలు (20.1శాతం), పంట నష్టాలు (16.8 శాతం ), రోగాలు (13.2 శాతం), మత్తుమందులు/తాగుడు (4.9) శాతం ముఖ్యమైన కారణాలుగా ఉన్నాయని పై అంకెలు స్పష్టం చేస్తున్నాయి.

ఇక మహారాష్ట్రలో చాలీచాలని సాగునీటి సదుపాయాలు, ప్రభుత్వసంస్థల నుండి అరకొర సహాయంతో పాటు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన తప్పుడు ఆర్థిక విధానాలు వ్యవసాయ సంక్షోభానికి ముఖ్య కారణాలుగా ఉన్నాయి. అఖిలభారత, రాష్ట్రాలు, జిల్లాల స్థాయిలో జరిగిన సెన్సస్‌ను ఆధారంగా చేసుకొని మరట్వాడా జిల్లాలోని ఉస్మానాబాద్, విదర్భ జిల్లాలోని యావత్మల్ ప్రాంతాలలో జరిపిన అధ్యయనంలో 22 తాలూకాలలోని 1,105గ్రామాలలో ఈ సర్వే చేశారు. 1,519 మృతుల కుటుంబాలను ఈ సర్వేలో కలిశారు. కొన్ని కుటుంబాలు అప్పటికే వలస పోవటం వలన యావత్మల్ ప్రాంతంలో 1,063, ఉస్మానాబాద్‌లో 456 కుటుంబాలను కలిశారు.

**బాధిత గ్రామాలలో ప్రాథమిక సదుపాయాలు**

బాధిత గ్రామాలు 748లో జనసంఖ్య 2000లకు మించిన గ్రామం లేదు.

అధిక శాతం గ్రామాలలో ప్రాథమిక సదుపాయాలైన పక్కారోడ్లు, బస్సుల అనుసంధానం, టెలిఫోన్, పోస్టాఫీస్, బ్యాంకు, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ సేవా కేంద్రం, ప్రభుత్వ, ప్రభుత్వేతర ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ, రైతు సంఘాలు, విద్యా సదుపాయాలు లేవు.

కొన్ని గ్రామాలకు మాత్రమే ఆరోగ్య కేంద్రాలకు వెళ్లే సదుపాయం ఉండటంతో విషం లేదా పురుగుమందులు తాగి ఆత్మహత్యలకు పాల్పడినప్పుడు బాధితుల్ని రక్షించడం కష్టంగా ఉంటున్నది.

ఈ గ్రామాలలో సాగునీటి సదుపాయాలు అత్యంత తక్కువగా ఉన్నాయి. ఇక్కడ చాల గ్రామాలలో ఇంకుడు గుంటలు, కాలువలు, ఆక్విడక్టులు, ఆనకట్టలు, కాలువ నీటిని సరఫరా చేసే యంత్రాంగం లేవు. అందువల్ల ఈ గ్రామాలలో వ్యవసాయం మొత్తం వర్షపాతం మీదే ఆధారపడి ఉంది. కాబట్టి పంటల దిగుబడులు అత్యంత అస్థిరంగా ఉంటాయి.

> **" ఈ గ్రామాలలో సాగునీటి సదుపా యాలు అత్యంత తక్కువగా ఉన్నాయి. ఇక్కడ చాల గ్రామాలలో ఇంకుడు గుంటలు, కాలువలు, ఆక్విడక్టులు, ఆనకట్టలు, కాలువ నీటిని సరఫరా చేసే యంత్రాంగం లేవు. అందువల్ల ఈ గ్రామాలలో వ్యవసాయం మొత్తం వర్షపాతం మీదే ఆధారపడి ఉంది. కాబట్టి పంటల దిగుబడులు అత్యంత అస్థిరంగా ఉంటాయి. "**

ఇక్కడ ముఖ్యమైన పంట పత్తి. స్థిరమైన సాగునీటి సదుపాయం లేకపోవటంతో ఈ మెట్ట భూములలో దిగుబడులు అస్థిరంగా ఉంటాయి. ఫలితంగా వ్యవసాయంలో లాభాలు రావటం చాలా కష్టంగా ఉంటుంది. దీనికి తోడు ఇక్కడ రైతులకు ఏ విధమైన రుణాలు అందుబాటులో ఉండవు. వ్యవసాయానికి అనుబంధంగా ఉండే ఆర్థిక కార్యకలాపాలైన పశువుల పెంపకం, కోళ్ళ ఫారాల ఏర్పాటు తదితరాల వంటివి లేవు.

**బాధితుల కుల వివరాలు**

మహారాష్ట్రలో వృత్తులు నిర్ణయించటంలో కులవ్యవస్థ ప్రముఖమైన పాత్ర నిర్వహిస్తుంది. ప్రధానంగా మరాఠాలు, కుంబీలు, మాలీలు వ్యవసాయ కులాలకు చెందిన వారు. అందువల్ల రాష్ట్రంలో ఏదైనా వ్యవసాయ సంక్షోభం సంభవిస్తే వీరు ఆ సంక్షోభం యొక్క ఫలితాలను అనుభవించవలసి ఉంటుంది. ఆ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో ఈ కులాలకు చెందినవారే ఎక్కువ మంది ఉన్నారు.

మరణించిన వారిలో (54.44 శాతం) మరాఠా (351), కుంబి(131), మాలి (93) , బౌద్ధ (69), బ్రాహ్మణ (02), మాదిగ (06), కమ్మరి (04), జైన (04), ముస్లిం (04), మంగలి (06), చాకలి (06) మంది చొప్పన 757 మంది ఉన్నారు. మిగిలిన 661 (45.54 శాతం) మంది వివిధ ఆదివాసీ తెగలకు చెందిన వారున్నారు. వాణిజ్యపరంగా మార్పుచెందుతున్న వ్యవసాయంలో ఆదివాసులకు అనుభవం లేకపోటం వల్ల ఈ వ్యవసాయ సంక్షోభంలో వాళ్ళు నిలబడటం కష్టంగా ఉంది. వారి కుటుంబాలలో పనిచేయగలిగిన వయసులోని వారు ఎక్కువ మంది ఉన్నప్పటికీ, సంక్షోభం కారణంగా యావత్మల్ జిల్లాలో వారి కుటుంబాలలో పెద్దసంఖ్యలో ఆత్మాహత్యలు నమోదయ్యాయి.

**బాధితుల కుటుంబాలలో భూములు ఉన్న, లేని వారి పరిస్థితి**

చాలామంది బాధితులు కొద్దిమొత్తం, లేదా అతి తక్కువ భూములు కలవాళ్ళు. కమతాలు అంతకంతకీ చిన్నవి కావటం దీనికి కారణం. కేవలం 123 బాధిత కుటుంబాలు మాత్రమే సాగునీటి సదుపాయాలను మెరుగుపరచుకోవటం కోసం పెట్టుబడి పెట్టారు. సాగునీటి సదుపాయం లేకపోటం వల్ల చాలామంది బాధితుల వ్యవసాయం వర్షాలపై ఆధారపడటంతో దిగుబడులలో స్థిరత్వం ఉండటం లేదు. సర్వేలో ఉన్న ఈ రెండు జిల్లాలు నీటి ఎద్దడిని ఎదుర్కుంటున్నాయి. వర్షాధార వ్యవసాయం బాధితుల్ని రుణగ్రస్తులను చేసింది. పత్తి, కంది, సెనగ, సోయాబీన్ వంటి పంటలకు సాగునీటి సదుపాయం ఉన్న నేలల్లో వచ్చిన దిగుబడి ఇక్కడ రాదు. అన్ని పంటలకు వ్యవసాయ ఖర్చులు సాగునీటి భూముల్లో ఉన్నవాటి కన్నా కొద్దిమేరకే తక్కువగా ఉంటాయి. కాని దిగుబడులు, ఆదాయం చాలా తక్కువగా వస్తాయి.

బాధిత కుటుంబాలలో అధిక శాతం చిన్న కమతాలు అవటం వల్ల కౌలుదారి విధానానికి దారి తీసింది. ఇది చివరికి బాధిత రైతులు భూములను కౌలుకు ఇవ్వటానికి/ తీసుకోవటానికి దారి తీసింది.

చిన్న కమతాల రైతులు అవటం వల్ల ఆ భూములు ఆధునిక యంత్రాలను, పరిజ్ఞానాన్ని వినియోగించుకోవటానికి అనువుగా లేవు. భూముల కౌలు రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ఖర్చులు పోను వచ్చిన రాబడి పంచుకోటం. భూస్వామికి సంవత్సరానికి కౌలుగా కొంత నగదు ఇవ్వటం రెండోది. భూమి నాణ్యత, దిగుబడి, యజమాని యొక్క మూలధన పెట్టుబడితో బాటు సాగునీటి సౌకర్యాలైన బావులు, గొట్టపు బావులు, పైపు లైన్ల మీద ఆధారపడి కౌలు ధరలు ఉంటుంటాయి. కనీస కౌలు ధరలు 3,000 నుండి గరిష్ఠంగా 8,000 రూపాయల వరకు ఉంటాయి

భూమి కౌలు విధానాల్లో చాలా మంది ఎంచుకునే పద్ధతి పంటలో భాగం తీసుకోవటం. ఎందుకంటే దీనిలో ఖర్చులు, నష్టాలు, రాబడులు యజమాని, కౌలుదారు సమానంగా పంచుకుంటారు. కానీ సాధారణంగా రైతులు అనుసరించే భూమి కౌలు విధానంలో లాభసాటిగా లేని భూములపై వచ్చే నష్టాలు తప్పించుకోటానికి చూస్తారు. కానీ ఇది యజమాని, కౌలుదారులు ఆత్మహత్యలకు పాల్పడే నష్టాల నుండి పూర్తిగా తప్పించలేదు.

సాగుభూమి స్వంతం కాకపోతే, ఆ కౌలు రైతు ఆత్మహత్య చేసుకుంటే చట్ట ప్రకారం ఆ కుటుంబాలకి నష్టపరిహారం రాదు. కౌలు రైతులు కూడా వారి తోటి గ్రామస్తుల లాగే అవే సామాజిక, ఆర్థిక పరిస్థితుల నుండి రావటం వల్ల వ్యవసాయంలో నష్టాలు సంభవించటంతో ఆత్మహత్యల ఉచ్చు నుండి తప్పించుకోలేకపోతున్నారు. వీరు అటు భూమి కౌలు కట్టలేక, ఇటు నష్టాలు తట్టుకోలేక రెండు విధాలా దెబ్బ తింటున్నారు.

**బాధితులు వేసిన పంటలు**

బాధితులలో చాలా మంది

> **" బాధిత కుటుంబాలు బావులు, గొట్టపు బావులు, విద్యుత్ పంపుసెట్లు మీద డబ్బు వెచ్చించి ఉన్నారు. చాలా కేసులలో బావుల్లో నీళ్లు, సాగునీటిని తోడుకొనే సామగ్రి ఉన్నాయి కానీ అవసరమైనంత నీరు అందివ్వటానికి అవసరమైన విద్యుత్ సరఫరా ఉండదు. దీనివల్ల సమయానికి నీరు అందివ్వలేక తక్కువ దిగుబడులు వస్తున్నాయి. "**

సోయాబీన్‌తో పాటు పత్తి కూడా వేశారు. పురుగుమందులు, రసాయన ఎరువులు మొదలగువాటి కోసం పత్తి పంటకి భారీ ఎత్తున పెట్టుబడి అవసరమౌతుంది. ఆత్మహత్యలకు పాల్పడిన వారు చాలామంది చిన్న, సన్నకారు రైతులు, వారి దగ్గర పెట్టుబడి లేనందువల్ల అవసరాల కోసం అప్పులు చేయవలసి వస్తుంది. దీనికి తోడు చాలా మంది బాధితులు ఒకే పంట మరల మరల వేసే పద్ధతి అనుసరిస్తారు. ఇలా కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది.

అధిక ఉత్పాదక ఖర్చుల వల్ల వ్యవసాయం ఖరీదైపోయింది. ఒకే రకమైన పంట వేయటం, విపరీతమైన పురుగు మందుల వాడకం వల్ల పంటలు చీడ పీడలు తట్టుకునే శక్తి కోల్పోయి దిగుబడి తగ్గుతున్నది. పత్తినే మరల మరల వేయటం వల్ల నేల దిగుబడి, ఫలసాయం కూడా దెబ్బతిన్నాయి. బాధిత రైతులందరూ 42 రకాల పంటలు పండించగా వాటిలో సగానికి పైగా పత్తి, దాని తర్వాత సోయాబీన్, కంది, మినుము, పెసర వేశారు. ఇవి కాలానుగుణ పంటలు అవటం వల్ల వర్షం మీద ఆధారపడటంతో వర్షాభావం ఎదురైనపుడు సాగునీరు కూడా లేకపోటం రైతులను ఇంకా ఇబ్బందికి గురిచేసింది.

మరట్వాడా, విదర్భలలో వ్యవసాయ వాతావరణ పరిస్థితులు 27 రకాల తృణ, పప్పుధాన్యాలకు సరిపోతాయి. కానీ పత్తిపంటకు అనుకూలం కాదు. రైతులకు తగినంత విద్య లేకపోవటం, పంటల గురించి సరైన అవగాహన, నైపుణ్యాలు లేనందువల్ల బాధితులలో చాలా మంది ఒకే పంటని మరల మరల వేస్తున్నారు. అందువల్ల దిగుబడి తగ్గి వ్యసాయంలో నష్టాలు వచ్చాయి.

**పంటల దిగుబడి తగ్గటానికి కారణాలు**

ఈ ప్రాంతాలకు తక్కువ సాగునీరు అందటం వల్ల బాధిత రైతుల వ్యవసాయం వర్షాకాల మీద ఆధారపడి ఉంటున్నది. వీటికి తోడు నకిలీ విత్తనాలు, చాలినంత మూలధనం లేకపోటం, తక్కువ దిగుబడి, పురుగులు, చీడల దాడులు కూడా రైతులను ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి.

బాధిత కుటుంబాలు బావులు, గొట్టపు బావులు, విద్యుత్ పంపుసెట్లు మీద డబ్బు వెచ్చించి ఉన్నారు. చాలా కేసులలో బావుల్లో నీళ్లు, సాగునీటిని తోడుకొనే సామగ్రి ఉన్నాయి కానీ అవసరమైనంత నీరు అందివ్వటానికి అవసరమైన విద్యుత్ సరఫరా ఉండదు. దీనివల్ల సమయానికి నీరు అందివ్వలేక తక్కువ దిగుబడులు వస్తున్నాయి.

పంట వైఫల్యానికి ఒక ముఖ్య కారణం నకిలీ విత్తనాల వల్ల గింజ మొలకెత్తకపోటం. నకిలీ విత్తనాల వల్ల బాధిత కుటుంబాలు మరల మరల నష్టపోతున్నా, ఇటువంటి విత్తనాలు సరఫరా చేస్తున్న వారికి ఎటువంటి శిక్షలు పడటం లేదు.

పంట పెరుగుదల ఆగిపోవటం, అధిక వర్షపాతం, అడవి జంతువుల వల్ల పంట ధ్వంసం అవటం బాధిత రైతులు ఎదుర్కొనే ఇతర సమస్యలుగా ఉన్నాయి. యావత్మల్ జిల్లాలో అడవికి దగ్గరగా ఉన్న పొలాలలోని పంటలు అడవి జంతుల వల్ల ధ్వంసం అయినా వారికి ప్రభుత్వం నుండి ఏ రకమైన పరిహారం ముట్టలేదు.

**భూమి, అప్పు చెల్లింపు, బకాయిలు**

రైతులకు వ్యవసాయానికి, ఇతర అవసరాలకు అప్పు అవసరం అవుతుంది. తక్కువ వర్షపాతం ఉన్నప్పుడు, అనావృష్టి సమయాలలో వినియోగ అప్పులు అవసరం అవుతాయి. ఎప్పుడూ ఉండే వ్యవసాయ ఖర్చులకు, పెట్టుబడికి వ్యవసాయ రుణాలు అవసరం. ఈ సర్వే చేసిన గ్రామాలలో అధికారిక రుణాలు అందించే సంస్థలు అనధికార అప్పులను, వాటి ప్రాబల్యాన్ని తుడిచి పెట్టలేకపోయాయి.

అధికారిక రుణాలు అందించే సంస్థల పక్షపాత వైఖరి వీరిని ప్రభుత్వేతర రుణదాతల వైపు చూసేలా చేసింది. సహకార సంస్థల్లో అప్పులు ఇచ్చే విధానంలో రాజకీయ జోక్యం బాధితుల్ని వడ్డీవ్యాపారుల దోపిడీకి బలి చేసింది. ఈ వడ్డీలపై అజమాయిషీ ఉండదు.

బాధితులు రకరకాల కారణాల వల్ల చాలా త్వరగా అనధికారిక రుణాలు బారిన పడతారు. బాధిత కుటుంబాల అప్పు వారి ఆదాయ సామర్థ్యాన్ని త్వరగా దాటిపోతుంది. అప్పుల భారం వీరిని ఆత్మహత్యల ఉచ్చులో బిగిస్తుంది. అప్పు, దానిని తీసుకునే, చెల్లించాల్సిన సమయం, వడ్డీరేటు మొదలైనవి బాధితుల జీవితాల మీద చాలా లోతైన ప్రతికూల పరిణామాలు చూపుతాయి. చిన్న కమతాల రైతులు ఎక్కువగా ప్రైవేట్ వారి నుండి అప్పులు తీసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి.

తమకు అందుబాటులో ఉన్న అన్ని మూలాల నుండి ఏకకాలంలో అనేక రుణాలు తీసుకోవలసి రావటం వల్ల బాధితులు రుణాలను చెల్లించటం కష్టమౌతున్నది. బాధిత కుటుంబాలు 5.08 శాతం ప్రభుత్వ సంస్థల నుండి, 38.98 శాతం స్వయం సహాయక గ్రూపుల నుండి, వడ్డీ వ్యాపారుల నుండి 28.38 శాతం, అనధికారిక సంస్థల నుండి 12.71 శాతం, స్నేహితుల నుండి 0.84 శాతం, బంధువుల నుండి 13.98 శాతం అప్పులు తీసుకున్నారు.

సాగునీటి సదుపాయం ఉన్న రైతులు, వర్షాధారా భూములున్న రైతులు వేర్వేరు అవసరాల కోసం అప్పులు తీసుకున్నారు. వీటిలో అధిక శాతం అప్పులు ప్రైవేటు వ్యక్తులు, ముఖ్యంగా వడ్డీ వ్యాపారుల నుండే తీసుకోవడం జరిగింది. వీరిలో ఎవరూ ఈ అత్యధిక వడ్డీలకు ఇచ్చే వారి గురించి బయట పెట్టరు. దీనికి కారణం ఈ వడ్డీ వ్యాపారులకు గ్రామీణ ఆర్థికవ్యవస్థ మీద ఉన్న బలమైన పట్టు. ఇది విదర్భలో మరీ ఎక్కువగా కనబడుతుంది. రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గర నుండి అప్పు తీసుకుంటూనే ఉంటారు. దీనికి కారణం అవసరమైనపుడు వీరి దగ్గర బట్టి అప్పు పుడుతుంది. బ్యాంకులు, సహకార సంస్థలలో రుణాలు ఇప్పించే ఏజంట్లకు 10 శాతం కమీషన్ ఇవ్వవలసి ఉంటుంది. దీనికి తోడు అప్పు ఇచ్చేందుకు పూర్తి చేయవలసిన లాంఛనాలకు కూడా ఎక్కువ సమయం పడుతుంది. చిన్న, సన్నకారు

**“ బాధిత కుటుంబాలలో చాలా మందికి ఒక ఎకరానికి వస్తున్న రాబడి మార్కెట్ ధరతో పోలిస్తే పెట్టుబడుల కన్నా తక్కువ గాను, కనీస మద్దతు ధరల (ఎమ్మెస్పీ) ప్రకారం లెక్కిస్తే ఎక్కువ ఆదాయం వస్తున్నట్లు గాను ఉంటుంది. మహారాష్ట్రలో కనీస మద్దతు ధర అమలులో లేదు. అందువల్ల వ్యవసాయ మార్కెట్ కమిటి యార్డులలో చాలా పంటల ధరలు మార్కెట్ ధరల కంటే తక్కువగా ఉంటున్నప్పటికీ ఎక్కువ ధరలు కావాలని రైతులు ఒత్తిడి తీసుకురాలేకపోతున్నారు. ”**

రైతులు సకాలంలో రుణ బకాయిలను చెల్లించలేకపోవటం వలన వీరికి అప్పులు ఇవ్వటానికి అనేక రకాలైన ఆంక్షలు, అధికవడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

**వ్యవసాయ ఖర్చులు, రాబడుల్లు**

బాధిత కుటుంబాలలో చాలా మందికి ఒక ఎకరానికి వస్తున్న రాబడి మార్కెట్ ధరతో పోలిస్తే పెట్టుబడుల కన్నా తక్కువ గాను, కనీస మద్దతు ధరల (ఎమ్మెస్పీ) ప్రకారం లెక్కిస్తే ఎక్కువ ఆదాయం వస్తున్నట్లు గాను ఉంటుంది. మహారాష్ట్రలో కనీస మద్దతు ధర అమలులో లేదు. అందువల్ల వ్యవసాయ మార్కెట్ కమిటి (APMC) యార్డులలో చాలా పంటల ధరలు మార్కెట్ ధరల కంటే తక్కువగా ఉంటున్నప్పటికీ ఎక్కువ ధరలు కావాలని రైతులు ఒత్తిడి తీసుకురాలేకపోతున్నారు. ఉత్పాదక ఖర్చులు ఎక్కువ అయిపోతుండటంతో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు.

వ్యవసాయోత్పత్తులు మార్కెట్‌కు ఎక్కువగా వస్తున్నప్పుడు లేదా ధరలు పూర్తిగా పడిపోయినప్పుడు కూడా మహారాష్ట్రలో రైతులకు ఎమ్మెస్పీ రక్షణ లేదు. పూర్వం మరట్వాడా, విదర్భ జిల్లాలలో పత్తి, సోయా, పప్పు ధాన్యాల పంటలకు ఈ పరిస్థితులను ఎదుర్కున్నారు. బాధితులు వేసిన వాటిల్లో ఈ పంటలే అధికంగా ఉన్నాయి, వీటిమీదే వారు నష్టాలు చవిచూశారు. జొన్న, మినుము పంటలు కేవలం వాడకానికే వేయటం వలన మార్కెట్లో అమ్మేటంత మిగులు ఉండదు. ఎమ్మెస్పీ, పంటల మార్కెట్ ధరకి మధ్య తేడా ఎక్కువగా ఉంటుంది. పత్తి, కంది, సజ్జలు, గోధుమ, పప్పు ధాన్యాలు, పొద్దు తిరుగుడు పంటలకు మరీ ఎక్కువగా ఉంటుంది. ఈ విధంగా పెట్టుబడుల కన్నా తక్కువ ఆదాయం రావటం వల్ల బాధితుల ఆర్థిక ఇబ్బందులు మరీ ఎక్కువ అవుతున్నాయి.

మార్కెట్ వైఫల్యం, పంటలు వచ్చిన తర్వాత వాటిని సక్రమంగా నిల్వ చేయటం, ప్రాసెసింగ్, ఎమ్మెస్పీ లేకపోటం మొదలగునవి మహారాష్ట్రలో వ్యవసాయ సంక్షోభానికి, రైతుల ఆత్మహత్యలకు కారణాలుగా ఉన్నాయి. రైతులు మరల మరల పంట నష్టాలకు గురి కావటం, పంట దిగుబడులు తగ్గుతుండటం బాధిత కుటుంబాల అప్పుల భారం పెరగటానికి కారణమౌతున్నాయి.

**ప్రభుత్వ నష్ట పరిహారం తీసుకునేందుకు అర్హత**

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వటం మహారాష్ట్ర ప్రభుత్వ విధానంగా ఉంది. కానీ ప్రభుత్వ రికార్డుల ప్రకారం రైతుల ఆత్మహత్యలను అర్హత కలవి, లేనివిగా విడదీసి చాలా కేసులు విచారణ కోసం పెండింగ్‌లో ఉంచారు. అర్హత ఉన్న, లేని కేసుల మొత్తం ఎప్పుడూ సమానంగా ఉండదు, ఎందుకంటే పెద్ద మొత్తం కేసులు ఎప్పుడూ పెండింగ్‌లోనే ఉంటాయి. బాధిత రైతు భూ యజమాని అయితేనే ఎక్స్‌గ్రేషియాకి అర్హుడు అవుతాడు, అలాకాకపోతే ఆ ఆత్మహత్యని రైతు ఆత్మహత్యగా భావించరు. ఇటువంటి విధానం వలన ఆత్మహత్యల కేసుల సంఖ్య తక్కువగా ఉండి రాష్ట్ర ప్రభుత్వానికి పరిహారం చెల్లించే భారం తగ్గుతుంది. రెవిన్యూ శాఖ రికార్డు 7/12 ల్యాండ్ అబ్‌స్ట్రాక్ట్ ప్రకారం భూమి యజమాని కాకపోతే ప్రభుత్వం వ్యవసాయదారునిగా పరిగణించదు. మహారాష్ట్ర ప్రభుత్వ పాలనా యంత్రాంగం ఈ నిబంధనను అనుసరించి బాధితుల్ని రైతులుగా, రైతులు కానివారుగా విభజించింది.

ఇటువంటి అనిర్దిష్ట విధానాలతో ప్రభుత్వం బాధిత కుటుంబాలను పాలనా యంత్రాంగంలోని ప్రాంతీయ అధికారుల యొక్క అవినీతికి బలి చేసింది. పరిహారం దక్కని కుటుంబాలలో చాలా వరకు బాధితులు స్త్రీలు. ఎందుకంటే చట్టపరమైన భూమి హక్కు పత్రం వీరి పేరు మీద ఉండదు. గ్రామీణ పితృసామ్య వ్యవస్థలో భూమి ఆడవారి పేరు మీద రిజిస్టర్ చేయరు. అందుచేత ఈ స్త్రీలు నిజమైన వ్యవసాయదారులే అయినా రికార్డులలో వీరు హక్కుదారులుగా లేనందున వీరి కుటుంబాలకు పరిహారం లభించటం లేదు.

1980ల నుండి వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయటం మొదలైంది. వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు తగ్గటం వల్ల వ్యవసాయ ఖర్చులు పెరిగి వ్యవసాయ సంక్షోభం తీవ్రం అవుతున్నది. దీని ఫలితమే వివిధ రాష్టాలలో రైతుల ఆత్మహత్యలు తీవ్రంగా పెరిగాయి. మహారాష్ట్ర రైతుల ఆత్మహత్యలు దిగజారుతున్న సామాజిక–ఆర్థిక పరిస్థితికి ప్రతిబింబంగా ఉన్నాయి. ఇది వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులు, వస్తున్న రాబడుల మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండటం వల్ల సంభవిస్తున్నది. ఇది భూమికో, రైతుకో ఉత్పాదక సామర్థ్యం లేనందువల్ల వచ్చింది కాదు, ఉత్పాదక ఖర్చులు వేగంగా పెరిగిపోటం వల్ల జరుగుతున్నది. వ్యవసాయ ఖర్చులు రాబడిని మించిపోటంతో అప్పులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇటువంటి ఆర్థిక సంక్షోభం విదర్భ, మరట్వాడా రైతులకు ఆత్మహత్యలు మినహా గత్యంతరం లేని పరిస్థితిని కల్పించింది.

ఒక ప్రణాళిక ప్రకారం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వకపోతే వ్యవసాయ ఉత్పత్తిలో అభివృద్ధి సాధించటం సాధ్యం కాదు. మరట్వాడా, విదర్భలలో పంటలు, పంటల మార్పిడి విధానాన్ని అమలుచేస్తే నేల, శ్రమ ఉత్పాదకత మెరుగుపడటానికి దారితీస్తుంది. దీనితో పాటు గ్రామీణ, వ్యవసాయ ఆధార పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. పశు సంరక్షణ, పాల ఉత్పత్తి, కోళ్ళ పెంపకం, ప్రాసెసింగ్, అభివృద్ధి యూనిట్లను ప్రోత్సహించటం ద్వారా ఈ ప్రాంతపు రైతులను ప్రధాన స్రవంతి ఆర్థిక కార్యకలాపాలలో కలపవచ్చు. ఇది కేవలం వ్యవసాయం మీదనే ఆధారపడే పరిస్థితి నుండి తప్పించి భూమి నుండి ఆదాయం రెండింతలు అయ్యే సమ్మిళిత అభివృద్ధికి దోహదం చేస్తుంది.

**(స్వేచ్ఛానుసరణ: కె.పుష్పవల్లి)**

సంస్కృతి

# భిన్న సంస్కృతుల మధ్య అడ్డుగోడలు

సచ్ఛిదానంద మహంతి



రచయిత ఒడిషా యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్

మన సమాజం సాంస్కృతికంగా వైవిధ్య భరితమైన సమాజమని, సాంస్కృతిక పరంగా దేశంలో "అంతా బాగుంది" అని సమాజాలు, వ్యక్తులు సాధారణంగా అనుకోడం కద్దు. అయితే ఈ సాధారణ అవగాహనకు మించి తెలుసుకోవాలంటే ఉద్యమాలు, అందులో దాగి ఉన్న తాత్విక చింతనను గురించి పరిశోధించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తు పరిశోధనపైనే వైవిధ్య భరిత సంస్కృతిలో అందరూ భాగస్వాములు కావటం ఆధారపడి ఉంటుంది.

ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్య మాలలో, విద్యా సంస్థలలో, సమాజంలో వైవిధ్య భరితమైన సంస్కృతిని గురించిన వాదనలు, చర్చలు జరుగుతున్నప్పటికీ మనం ఇంకా ఈ సమస్యపై నిర్దిష్టమైన నిర్ణయానికి రాలేదు.

సిఇఎం జోద్ అనే బ్రిటిష్ తత్వవేత్త "ప్రతి ఒక్కరూ తలకు పెట్టుకున్నందువల్ల రూపు రేఖలు కోల్పోయిన టోపీ వంటిది సోష లిజం"అని సోషలిజం గురించి ఒకానొక సందర్భంలో వ్యాఖ్యానించాడు. "ఉయ్ ఆర్ మల్టికల్చరలిస్ట్స్ నౌ "(ఇపుడు మనమందరం బహుళ సంస్కృతికవాదులమే) అనే పుస్తకంలో ఈ యుగం వైవిధ్యభరితమైన సంస్కృతి కలిగినదని నాథన్ గ్లేజర్ పేర్కొనటం అలాంటిదే. కాలం గడిచే కొద్దీ యూరప్‌లోని పిడివాదనలను సంస్కరించే ప్రయత్నాలు వైవిధ్యభరితమైన సంస్కృతి పేరుతో "సాంస్కృతిక యుద్ధాల" రూపాన్ని సంతరించుకున్నాయి. ఇవి ప్రపంచవ్యాప్తంగా సమాజాల మధ్య ఛేధించే వీలులేని అడ్డుగోడలు ఏర్పడడానికి దారితీస్తు న్నాయి. ఈ సంక్షోభానికి కారణం ఏమిటి? వైవిధ్యభరితమైన సంస్కృతి యుద్ధాలకు వేదిక కానుందా? లేక అందరూ కలిసేందుకు భూమిక కానుందా?

జాతి గుర్తింపులోని ప్రధానాంశాలను అంతర్జాతీయ నిపుణులు ప్రశ్నించారు. ఉదా హరణకి 'ది పాలిటిక్స్ అఫ్ కల్చర్ ఇన్ ది షాడో అఫ్ కాపిటల్' (పెట్టుబడి నీడలో సాంస్కృతిక రాజకీయాలు) లో అమెరికా ఆర్థిక వ్యవస్థ కార్మిక శ్రమను చౌకగా దోచుకోవడానికి, ''ఈనాడు దేశంలో ఉన్న చైనీయుల, జపనీయుల, ఫిలిప్పీన్ల, దక్షిణ అమెరికా వాసుల కార్మికశక్తి ఐక్యం కాకుండా నిలవరించటానికి వారికి పౌరసత్వం లేకుండా చేయడంలో రాజ్యం పాత్ర" కి మధ్య ఉన్న సంబంధాలను విమర్శకుడు లిసా లొవె చాకచక్యంగా బహిర్గత పరిచారు. అందువలన, " అమెరికా జాతి రాజ్యం చరిత్రలో రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక విధానాలు, జాతి వివక్ష రూపకల్పనలో వలసలు కేంద్ర బిందువని అనుకోవడం తర్కబద్ధంగా ఉంటుంది".

రాజకీయాలు, సమాజం, సంస్కృతుల మధ్య ఏర్పడ్డ సంబంధాలు కొత్త అవగాహనలకు దారి తీశాయి. ఇది ఆహ్వానించదగ్గ పరిణా మం. ఉదాహరణకి అమెరికా అంటేనే జాతి వైషమ్యాలతో అట్టడికి పోయే దేశం అనే గుర్తింపు నుండి, వైవిధ్యభరితమైన సంస్కృతి, భిన్న సంస్కృతుల కలయిక గల దేశంగా, జాతిగా మార్పు చెందింది. ఇది వైవిధ్యభరిత సంస్కృతి కల స్వేచ్ఛాయుత దేశానికి దారి తీసింది. ఇది భారతదేశం లాంటి వలస విధాన అనంతర స్వతంత్ర జాతి రాజ్యాలకు కూడా కీలకమైన పరిణామం. అయితే వైవిధ్యభరిత సంస్కృతికి సంబంధించిన అనేక సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. సాంస్కృతిక వైవిధ్యాన్ని గురించి లోతైన అవగాహన కలగాలంటే ఈ ఉద్యమం గురించి, దాని వెనకున్న తాత్విక చింతనను గురించి మరింతగా అధ్యయనం చేయాల్సి ఉంది.

### కీలకమైన ప్రశ్నలు

వైవిధ్యభరితమైన సంస్కృతిపై అనేక ప్రశ్నలను లేవనెత్తవచ్చు. మన వ్యక్తిగత, సమూహ స్వరూపాన్ని ఎలా నిర్ణయిస్తాం? ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగంగా భిన్నమైన గుర్తింపుల పట్ల –భాష, జాతి, దేశం, ప్రపంచం –ఏర్పడే వైరుధ్యాలను ఎలా పరిష్కరించు కుంటాం? మన సమూహం గుర్తింపు సమస్యకు, మనం గతాన్ని వీక్షించే విధానానికి ఉన్న సంబంధం ఏమిటి? గతాన్ని గురించిన వాస్త వాలను, జ్ఞాపకాలను ఎలా వెలికి తీస్తాం? గతకాలపు జ్ఞాపకాలను ఏమేరకు నిలుపు కోవాలి, వేటిని వదిలివేయాలి? ఉదాహరణకి ఫెమినిస్టులు, విపత్తులపై పరిశోధనలు చేస్తున్నవారు గతకాలపు సంఘటనలను ప్రాచీన భాండాగారాల నుండి వెలికితీసే ప్రయత్నాలు చేస్తున్నారు.

వైవిధ్యభరిత సంస్కృతులు గలవారి నందరిని ఒక చోటికి చేర్చి, సామరస్యంగా మెలిగే విధంగా చేయగలమా అన్నదే అసలైన సవాలు. భాష, సంస్కృతి, జాతుల పరంగా విడిపోయి, పోరాటాలలో మునిగి ఉన్నవారి మధ్య ఐక్యతను ఎలా సాధించగలం? సాధించగలమని చెప్పడం సులువే గాని ఆచరించడం కష్టమైన పని. శత్రు వర్గాల మధ్య సయోధ్యకు కుదర్చగల మాయ మంత్రదండాలను ఆధునిక సమాజాలు తయారు చేయలేదు.

20వ శతాబ్దపు మేధావులలో పేరెన్ని కగన్న వ్యక్తి, ఎడ్వర్డ్ సేడ్‌ని ఈ విషయంపై ప్రశ్నించగల అవకాశం నాకు దక్కింది. 1994లో ఈజిప్ట్ నగరంలోని కైరోలో "చరిత్ర, సాహిత్యం" పై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఆయనిచ్చిన సమాధానాలు లోతైన పరిజ్ఞానంతో కూడినవి. మన అవగాహనను విస్తృతపరిచేవి. "మహిళలు, వర్ణ వివక్షకు గురైన ప్రజలు, వెలివేయబడిన సమూహాలు ఎదుర్కొంటున్న అనేక కాలం తీరిన సాంప్రదాయాలను మనం ఎత్తి చూపవలసి ఉంటుంది. రాజ్యాధికారాన్ని ఆక్రమించుకుని ఉన్నవారు తమ అధికారాన్ని నిలుపుకోవడానికి ప్రజలు ఏకశిలా సదృశ్యంగా

ఉన్నారనడాన్ని ప్రతిఘటించడం ఉత్తమం.”

**సాహిత్యం, వైవిధ్యభరితమైన సంస్కృతి**

అత్యంత ప్రాథమిక ప్రశ్నతో మనం మొదలుపెట్టాలి: సాహిత్యంతోనే ప్రాథమికంగా బోధన మొదలవుతుంది కాబట్టి వైవిధ్యభరితమైన సంస్కృతికి, సాహిత్యానికి సంబంధం ఏమిటి? సాహిత్యమంటే అధికారికంగా గ్రంథస్థం చేయబడిన నిర్దిష్టమైన సూత్రాల కూడిక. అధికారికంగా అంటేనే విలువనివ్వడం. గ్రంథాలకు విలువలు ఆపాదించడం. తరగతి గదిలో షేక్స్పియర్‌ని చదవడం తప్పనిసరి. ఆ గ్రంథాలు, సంస్కృతులు, చరిత్రకు అతీత మైనవి అనే భావన అందుకు కారణం. మరో మాటలో చెప్పాలంటే, ఆయన “కాల పరీక్షకు నిలిచి గెలిచాడు”.

కానీ ఈ సాంప్రదాయక ఆలోచనలు ఈ మధ్యకాలంలో సాహిత్య, సైద్ధాంతిక, లాక్షణ్య, ప్రజాతంత్ర, సాంస్కృతిక కారణాలపై సవాలు చేయబడుతున్నాయి. ఈ సూత్రీకరణలు చారిత్రక సత్యాలుగా పరిగణించబడడం లేదు. పరిస్థితులకు అనుగుణంగా మారుతున్న ప్రత్యామ్నాయ సాహిత్య, సైద్ధాంతిక, లాక్షణ్యాలకు ఆ స్థానాన్ని ఇవ్వాల్సి ఉంది. మరింతగా పెరుగుతున్న వైవిధ్య భరితమైన విద్యార్థి సమూహాల అవసరాలకు ఇవ్వాల్సి ఉంటుంది.

సాహిత్యం, ఆధునిక- అద్భుత భావనలతో కూడిన గ్రంథాలకు, గ్రంథకర్తలకు ఒక ప్రత్యేకతను ఆపాదించింది. సృజనాత్మక కళాకారునికి, కళకు ఒక వైశిష్ట్యాన్ని అందించింది. “ చెట్లనుండి ఆకులు రాలినంత సహజంగా కవిత్వం రాయలేకపోతే రాయక పోవడమే మంచిది” అన్నారు జాన్ కీట్స్. కవుల మేధస్సులో నుంచి కవిత్వం కళలు పుట్టుకొస్తుంటాయి. అందువల్ల ఆ మనసులు, మేధస్సు అత్యంత పవిత్రమైనవిగా భావించబడేవి. ఇతర అన్ని పార్శ్వాలు- సామాజిక రాజకీయ, సైద్ధాంతిక, పరిసరాల ప్రభావాలకు పాత్ర ఉన్నప్పటికీ అవన్నీ- అతని మేధకు లోబడే ఉండేవిగా, ద్వితీయమైనవిగా పరిగణించబడేవి.

**ఈ సూత్రీకరణలపై తీవ్రమైన విమర్శ**

కళలు, కళాకారులను గురించిన ఈ భావనలు ఉన్నత తరగతులకు చెందినవిగా, యూరో అమెరికన్‌ల “అత్యంత ఆధునికత”కు ప్రతిబింబాలుగా భావించబడుతున్నాయి. ఇవి సైద్ధాంతికపరమైనవని, స్వయం విదితమని చాలాకాలంగా ప్రశ్నించబడనివిగా ఉన్నాయి. వీటిని లోపభూయిష్టమైనవని, సంకుచితమైనవని, ఈ ప్రజలను రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక అనుభవాలకు దూరం చేసేందుకు, పక్కన పెట్టేసేందుకు ఉపయోగించారని ఫెమినిస్టులు, మైనారిటీలు, ఆఫ్రికన్ అమెరికన్లు, హిస్పానిక్‌లు, భారతదేశ దళితులు, ఆదివాసీలు లాంటి భిన్న సాంస్కృతిక సమూహాలు ఈ భావనపై దాడి చేసాయి.

> **❝ ఈ ఉద్యమ ప్రభావంతో అమెరికాలోని అనేక విద్య సంస్థలలో డీన్‌ల, అత్యున్నత పాలనాధికారుల, అధ్యక్ష కార్యాలయాలను నిరసనకారులు ఆక్రమించారు. ఈ నిరసనలు మంచి ఫలితాలను ఇచ్చాయి: నియామకాల విధానాలు మారిపోయాయి: పాఠ్యాంశాలు మారాయి. ది నార్తన్ అంటాలజి , ది హెల్త్ ఆంటాలజి అఫ్ అమెరికన్ లిటరేచర్ వంటివాటిలో మార్పులు చేశారు. ❞**

**సాంప్రదాయవాదుల ఎదురుదాడి**

అమెరికాలో సాంప్రదాయవాదులు ఈ వాదనలపై ఎదురుదాడికి దిగారు. సాంప్రదాయ సాహిత్యమంతా అణచివేత, మితవాద భావాలతో నిండి ఉందని నమ్మించడానికి చేసిన ప్రయత్నానికి అమెరికా విద్యార్థులు ఎలా బందీలయ్యారో ది క్లోజింగ్ అఫ్ అమెరికన్ మైండ్‌లో హిర్ష్ వివరించారు. అలాగే దేశంలోని విద్యా విధానాల పట్ల విచారం వ్యక్తపరిచారు. “సాంస్కృతికంగా విద్యావంతుడు కావాలంటే ఆధునిక ప్రపంచంలో మౌలిక సమాచారాన్ని అర్థం చేసుకుంటూ ఉండాలి” అంటారు. ఈ జ్ఞానంలో అత్యధిక శాతం యూరప్‌లో సృజించబడిన గ్రంథాలలోనే ఉంది. సాంస్కృతిక సాపేక్షవాదం వలన అమెరికా వాసులకు ఎటువంటి ప్రయోజనం కలగదని అయన అభిప్రాయపడ్డారు.

సాంప్రదాయ సాహిత్య సూత్రీకరణలు, పాఠ్యాంశాలకు వ్యతిరేకంగా అమెరికాలోని ప్రఖ్యాతిగాంచిన స్టాన్స్ ఫోర్డ్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులలోని అత్యధిక నల్లజాతి విద్యార్థులు 1985లో విలియం బెన్నెట్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బెన్నెట్ ఆనాటి అమెరికా విద్యాశాఖలో అభివృద్ధి నిరోధక భావాలు కలిగిన కార్యదర్శి. ఉన్నత వర్గానికి చెందిన శ్వేతజాతి పురుష అధ్యాపకులు, అధికారులు చాలాకాలంగా తమ అధీనంలో ఉంచుకున్న, ఇంతవరకు తమకు అందుబాటులో ఉంచని తమకు సంబంధించిన గ్రంథాలను పాఠ్యాంశాలలో చేర్చాలని వారు డిమాండ్ చేసారు.

ఈ ఉద్యమ ప్రభావంతో అమెరికాలోని అనేక విద్య సంస్థలలో డీన్‌ల, అత్యున్నత పాలనాధికారుల, అధ్యక్ష కార్యాలయాలను నిరసనకారులు ఆక్రమించారు. ఈ నిరసనలు మంచి ఫలితాలను ఇచ్చాయి: నియామకాల విధానాలు మారిపోయాయి: పాఠ్యాంశాలు మారాయి. ది నార్తన్ అంటాలజి , ది హెల్త్ ఆంటాలజి అఫ్ అమెరికన్ లిటరేచర్ వంటివాటిలో మార్పులు చేశారు. మహిళలు, మైనారిటీలు, చారిత్రకంగా వెనుకబడిన సమూహాలకు చెందిన వారు ఈ రంగాలలో చేసిన పరిశోధనల ఆధారంగా తయారు చేసిన పాఠ్యాంశాలను విద్యాలయాలలో, కళాశాలలలో కొత్త పాఠ్య పుస్తకాలలో చేర్చారు.

చరిత్ర, సాహిత్యం, తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రం, మానవ విజ్ఞాన శాస్త్రం, మనస్తత్వ శాస్త్రం వంటి విభాగాలలో అస్తిత్వ రాజకీయాలకు ఆమోదం లభించింది. పశ్చిమదేశాలకు విభిన్న జాతులు, వర్గాల నేపథ్యం గలవారు వలసలు రావడం వల్ల వారు వైవిధ్యభరితమైన సాంస్కృతిక గళాలు వినిపించడం మొదలుపెట్టారు. అందువలనే చార్లెస్ టేలర్, ఆంటోనీ అప్పయ్య వంటి వారి ఆలోచనలను పౌరహక్కులు, నగర ప్రణాళికలు వంటి విషయాలలో ఆలకించారు. ఇటువంటి అభివృద్ధికాముక చర్యలు చేపడుతున్నప్పటికీ, ఈనాడు అమెరికాలో తరగతి గదులలో సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ఉదాహరణకి ఈ మధ్య వెలువడిన ‘‘కల్చరల్ వార్’’ (సాంస్కృతిక యుద్ధం), అధ్యయన స్వేచ్ఛ, బోధనా చరిత్ర “నివేదిక” లో 2021 సంవత్సరం జనవరి, సెప్టెంబర్ నెలల మధ్య కాలంలో కె (తరగతి)-12 పాఠశాలల్లో , ఉన్నత విద్యాసంస్థలలో, ప్రభుత్వ సంస్థలలో, అమెరికా దేశ వ్యాపంగా ఉన్న 24 మంది శాసనసభ్యులు బోధన, శిక్షణలకు పరిమితులు విధించాలని 54 ప్రత్యేక బిల్లులను చట్టసభలలో ప్రవేశ పెట్టారు. జాతిపై, జాతి విద్వేషాలపై, లింగ వివక్షపై, అమెరికా చరిత్రపై నిషేధం విధించా

> "చరిత్ర పునర్దర్శనాన్ని అర్థం చేసుకోవాలంటే ప్రపంచం లో వలసల ఏర్పాటుకు దారితీసే ఆధునీకరణ (పెట్టుబడిదారీ విధానం)ను అర్థం చేసుకోవలసి ఉంటుంది. "ప్రత్యేకమైన భౌగోళిక స్థానం, యూరప్, అమెరికాలకు సంబంధించినదే ఆధునికత అనే పదం. ఆధునికత అనే పదానికి భౌగోళిక పరిమితు లు లేకపోవడం, దాని ఉపయోగం తాత్కాలికమైనది కాకపోవ డంతో చరిత్రను అర్థం చేసుకోడానికి ఆ పద ప్రయోగం చేయడం పై రానురాను సందేహాలు పెరుగుతున్నాయి" అని చరిత్ర కారుడు దిలీప్ మీనన్ అన్నారు."

లని, 'నిషేధిత', 'వేర్పాటువాద' విషయాలను అధ్యాపకులు, శిక్షకులు కె –12 పాఠశాలల్లో, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో, పని ప్రదేశాలలో మాట్లాడకూడదని ఈ బిల్లులలో ప్రధానంగా ఉన్నది. అధ్యయన కేంద్రాలలో, విద్యాసంస్థలలో చర్చలు జరగకుండా, బోధనపై, అధ్యయనాలపై ప్రభుత్వ ఆదేశాలను రుద్దడానికి ఈ బిల్లులు రూపొందించినట్టు కనిపిస్తున్నది. సూక్ష్మంగా చెప్పాలంటే విద్యకు సంబంధించిన విషయాలను చర్చించకుండా నోరు కుట్టేయడం కోసమే ఈ బిల్లులను ఉద్దేశించారు.

**శాశ్వతంగా నిలిచే మార్పులు**

అమెరికాలో సాంప్రదాయవాద తరగతులు, రాజకీయ సంస్థల నుండి ప్రతిఘటన ఎదురవుతున్నప్పటికీ, వైవిధ్యభరిత, శాశ్వతంగా నిలిచే, లోతైన మార్పులు చేసుకుంటున్న దిశగానే సాంస్కృతిక గమనం ఉన్నదనడంలో ఎటువంటి సందేహం లేదు. మర్వెలస్ పొజెషన్స్ : ది వండర్స్ ఆఫ్ ది న్యూ వరల్డ్‌లో కొత్త చరిత్రాత్మకత వ్యవస్థాపకులలో ముఖ్యులు స్టీఫెన్ గ్రీన్ బ్లెట్. క్రిస్టఫర్ కొలంబస్ అమెరికాను కనుగొన్న విషయంపై ఈయన వినూత్న అర్థం చెబుతూ ప్రధాన, కొసకు నెట్టివేయబడిన సంస్కృతుల మధ్య సంబంధాల క్రమాన్ని వివరించారు. ప్రపంచ యాత్రికులు కొలంబస్, సర్ జాన్ మాండవిల్లేకి మధ్య ప్రధానమైన బేధాన్ని ఆయన ఎత్తి చూపారు. మాండవిల్లే కేవలం ప్రయాణం చేయడంలోని ఆహ్లాదం పొందడానికి ప్రయాణాలు చేస్తే, కొలంబస్ తనతో పాసుపోర్టును, రాజ శాసనాలు, ఉత్తరాలను కూడా తీసుకెళ్లాడు. అతను రాజ్యం ప్రోత్సాహంతో ప్రయాణాలు చేసాడు. అతను ఏ యుద్ధాలను గురించి చెప్పలేదు. ద్వీపాలలో వరుసగా సాగిన "ప్రసంగ కార్యకలాపాలు", "ప్రకటనలు", ఆ తర్వాత వాటి పేర్లలో మార్పులు చేయడం గురించి రాసాడు. అతనికి సంబంధించి నంతవరకు స్వాధీన పరుచుకోవమంటే "భాషాపరమైన చర్యలు" తీసుకోవడం, "ప్రకటనలు చేయటం" ద్వారా ఆయా ద్వీపాలను స్వాధీనం చేసుకున్నాడు. అతను రాజుకి బదులుగా ఆక్రమణ చేసేందుకు, స్వాధీన పరుచుకునేందుకు వచ్చిన మధ్యవర్తి మాత్రమే కాదు, అక్రమణని తన తరపున, తన జాతి తరపున చట్టబద్ధం చేసే కార్యక్రమాన్ని కూడా నిర్వహించాడు.

రెండోది, కొలంబస్ మధ్యయుగాల నాటి సహజ న్యాయాన్ని ఆధారం చేసుకున్నాడు. దాని ప్రకారం "కనుగొన్న హక్కు" సూత్రం ద్వారా దానిపై "అధికారాన్ని పొందడానికి" హక్కు ఏర్పడింది. అంటే ఒక ప్రాంతాన్ని నీవు కనుగొంటే దానిని పొందే హక్కు నీకుంది. అందువల్లే కొలంబస్ "ఆ భూములన్నింటినీ ఖాళీ చేయించాడు. "వాటిని నివాసయోగ్యం కాకుండా మార్చేశాడు. ఆ ప్రాంతవాసుల భాషలను తిరస్కార భావంతో చూశాడు. తాను పోర్చుగీస్, ఇంగ్లీష్, స్పానిష్ రాజులకు సేవ చేయడానికి సిద్ధమని ప్రకటించాడు. "పేర్లు పెట్టే" తంతు అంతా స్వాధీన పరుచుకునే తంతే అని గ్రీన్ బ్లెట్ చెప్పాడు. అందువల్లే కొలంబస్ శాన్ సాల్వడార్, ఎల్ సాల్వడార్‌ల పేర్లను మార్చు కుంటూపోయాడు. 'అధీనంలోకి తెచ్చుకోవడం' లో 'అద్భుతమైన శక్తి' ఇమిడి ఉంది. కొలంబస్ ఏనాడూ ఆశను వదులుకోలేదు. "దేవుడు ఈ భూములన్నిటి గురించి తన నోటితో, తన పుస్తకంలో ఎన్నోసార్లు ప్రస్తావించాడని" కొలంబస్ ప్రకటించాడు. "అందువల్ల ఆ ద్వీపాలలో తిరిగి దేవుని గురించి తెలియ చేయాలి" అన్నాడు. కొలంబస్ అమెరికాను 'కనుగొన్న' కథనాలకు సంబంధించిన గుణపాఠాలు అసమానతలు, అన్యాయాలను అధిగమించేందుకు పోరాడుతున్న అన్ని సమాజాలకు, సంస్కృతులకు వర్తిస్తాయి.

చరిత్ర పునర్దర్శనాన్ని అర్థం చేసుకోవాలంటే ప్రపంచంలో వలసల ఏర్పాటుకు దారితీసే ఆధునీకరణ (పెట్టుబడిదారీ విధానం)ను అర్థం చేసుకోవలసి ఉంటుంది. "ప్రత్యేకమైన భౌగోళిక స్థానం, యూరప్, అమెరికాల (మనం పశ్చిమ దేశాలని సునాయాసంగా అనే అన్ని ప్రాంతాలు)కు సంబంధించినదే ఆధునికత అనే పదం. ఆధునికత అనే పదానికి భౌగోళిక పరిమితులు లేకపోవడం, దాని ఉపయోగం తాత్కాలికమైనది కాకపోవడంతో చరిత్రను అర్థం చేసుకోడానికి ఆ పద ప్రయోగం చేయడంపై రానురాను సందేహాలు పెరుగుతున్నాయి" అని చరిత్ర కారుడు దిలీప్ మీనన్ అనడం సమంజసంగా ఉంది.

**వైవిధ్యభరితమైన సాంస్కృతిక విద్య**

అందువల్ల యూరప్‌కి సరిపడే విద్య ఇతర ప్రాంతాలకు కూడా సరిపోతుందని అనలేం. ప్రతి దేశం, జాతి, సమూహం తమ భవిష్యదభివృద్ధికి అవసరమైన విద్య, మేధో వ్యవస్థలను, పరిపాలనా విధానాన్ని రూపొందించుకోవాలి. వైవిధ్యభరితమైన సాంస్కృతిక విద్యకు, అభివృద్ధికి వేర్వేరు దారులుంటాయి. వైవిధ్యభరిత సంస్కృతి, అస్తిత్వ రాజకీయాలలో ప్రఖ్యాతి గాంచిన కెనడా దేశ సిద్ధాంతవేత్త చార్లెస్ టేలర్ తన పరిశోధనా పత్రం(1992) లో వైవిధ్య భరిత సంస్కృతికి సార్వజనీన ప్రజాతంత్ర గుర్తింపుకు స్టీఫెన్ రాక్‌ఫెల్లర్ గ్రూపు విద్యాసంస్థల కంటే ప్రభుత్వ విద్యా సంస్థలు ఉండటం మంచిదని ప్రతిపాదించాడు. అదే సమయంలో సుసాన్ వుల్ఫ్ వంటివారు వైవిధ్యభరిత సంస్కృతితో పాటు అమెరికా తమదే అన్న భావన కల్పించగల విద్య ఉండాలని డిమాండ్ చేసారు.

"పౌర సమాజం, రాజకీయ వ్యవస్థలు వైవిధ్యభరిత సంస్కృతులను కొనసాగించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. దానివల్లే సాంప్రదాయక భావంలో జాతి జీవన పురోగమనం సాధ్యమౌతుందని" సంస్కృతుల వైవిధ్యాన్ని అధ్యయనం చేయటంలో నిష్ణాతుడైన క్వమి అంథోని అప్పయ్య తాను రాసిన ఐడెంటిటీ ఎగైనెస్ట్ కల్చర్: అండర్ స్టాండింగ్ అఫ్ మల్టీ కల్చరలిజంలో పేర్కొన్నారు.

**వైవిధ్యభరిత సంస్కృతి భవితవ్యం**

పైన చర్చించిన వాటిని దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా ఈ కింది నిర్ణయాలకు రావచ్చు. మొదటిది, ఎన్నికల రాజకీయాలు వెనకడుగు వేసినా వైవిధ్యభరిత సంస్కృతి మనుగడలోనే ఉంటుంది. కులం, మతం, వర్గం,జాతి మొదలైనవాటితో సంబంధం లేకుండా మౌలికంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తూనే ఉంటుంది. సర్వదా మారుతూ, కాలానుగుణమైన మార్పులు చేసుకుంటూ

(మిగతా 23వ పేజీలో)

# చివరి ఐక్య మహాసభ

**(2వ పేజీ తరువాయి)**

జరిగిన **81** కమ్యూనిస్టు పార్టీల సదస్సులో భారత కమ్యూనిస్టు పార్టీ పాల్గొంది; ఇందులో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ప్రకటనను ఆమోదించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు సదస్సులో చురుకుగా పాల్గొనడమే కాక ప్రకటనను రూపొందించడంలో కూడా ప్రముఖ పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆరవ మహాసభ 1961 ఏప్రిల్ 7–16 తేదీల మధ్య విజయవాడలో జరిగింది. 1,77,501 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ, 439 మంది ప్రతినిధులు, 17 మంది ఓటింగ్‌లో పాల్గొనని ప్రతినిధులు, పరిశీలకులు మహాసభకు హాజరయ్యారు. మహాసభకు హాజరైన ప్రతినిధులందరూ కలిపి జైళ్లలో గడిపిన కాలం 1,494 సంవత్సరాల 10 నెలల 28 రోజులు; అజ్ఞాతవాసంలో గడిపినది మరో 998 సంవత్సరాల 9 నెలలు. ఇది పార్టీ, దాని నాయకత్వ పోరాటపటిమను ప్రతిబింబించింది.

పార్టీ కార్యక్రమం, వర్తమాన పరిస్థితులు, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలోని సైద్ధాంతిక సమస్యలపై విభేదాలు క్రమంగా తీవ్రరూపం దాల్చాయి. పార్టీ కార్యక్రమం ముసాయిదా రూపొందించడానికి ఒకటి, ఆరవ మహాసభలో ప్రవేశ పెట్టబోయే రాజకీయ తీర్మానం తయారు చేయడానికి మరొకటి, రెండు కమిషన్లను మహాసభ నియమించింది. అయితే రెండు కమిషన్లు ఎటువంటి ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. అందువలన రెండు ముసాయిదా కార్యక్రమాలు, రెండు రాజకీయ తీర్మానాలు రూపొందించబడ్డాయి.

పార్టీలో తీవ్రమైన విభేదాలు ఉండడాన్ని గుర్తించినట్టు పార్టీ కార్యదర్శి అజయ్ ఘోష్ ఆరవ మహాసభలో ప్రవేశ పెట్టిన నివేదికలో రాశారు. "ఈ కింది సమస్యలపై విభేధాలు ఉన్నట్టు మేము గమనించాం. 1. కొత్తగా స్వతంత్రం పొందిన దేశాలలో మాస్కో ప్రకటన సూత్రాలను అమలు చేయడం వలన ఏర్పడే పరిణామాలు; 2. మనదేశంలోని రాజకీయ, ఆర్థిక పరిస్థితులు; 3. పార్టీ ముందున్న తక్షణ కర్తవ్యాలు. ఈ విభేదాల కారణంగా ఒకే రాజకీయ తీర్మానాన్ని ప్రవేశ పెట్టలేకపోతున్నాం" అని పేర్కొన్నారు.

పార్టీ మహాసభ ముందు ప్రవేశ పెట్టిన రాజకీయ తీర్మానం మహాసభలోని మెజారిటీ సభ్యుల మిలాఖత్ అవగాహననే ప్రతిబింబించింది. అందువలన పార్టీ ఆరవ మహాసభ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంది.

మహాసభ రాజకీయ నివేదిక, ప్రధాన కార్యదర్శి ఉపన్యాసం ఆధారంగా రాజకీయ తీర్మానాన్ని సవరించడానికి అంగీకరించినందు వలన పార్టీలో చీలిక నివారించబడింది. మహాసభలో కార్యక్రమ ముసాయిదా ప్రవేశపెట్టిన తర్వాత నిలుపుదలచేసి, నేషనల్ కౌన్సిల్‌కు పంపాలని నిర్ణయించారు.

అమృత్‌సర్ మహాసభ తీర్మానాలు అమలు చేయడంలో పార్టీ విఫలమైనట్టు గుర్తించడం జరిగిందని మహాసభలో ప్రవేశ పెట్టిన నిర్మాణ నివేదికలో పేర్కొన్నారు. 'పార్టీలో పార్లమెంటరీ భ్రమలు పెరగడం వలన, ఏ స్థాయిలోనూ పార్టీ శాఖలు ఈ పెడ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యతను తీసుకోకపోవడం వలన, కొంతవరకు పార్టీలో క్రమశిక్షణ సడలింది" అని నివేదికలో చెప్పారు. "ఈ పెడ ధోరణులకు వ్యతిరేకంగా పార్టీలో తిరిగి క్రమశిక్షణ నెలకొల్పబడాలంటే, మాటలకు చేతలకు మధ్య తేడా తగ్గాలని, పార్టీలో కామ్రేడ్‌ల మధ్య నుండే సంబంధాలు బలపడాలని నివేదిక పేర్కొంది.' పార్టీ నిర్మాణం యొక్క మౌలిక సూత్రాలు విస్మరించబడడం కొనసాగుతుండడాన్ని ఖండించింది.

సంస్కరణవాద ధోరణులు పార్టీ అంతటా వ్యాపించి ఉండడాన్ని గుర్తించింది: "బూర్జువా పార్లమెంటు సమర్థత పైన, రాజ్యాంగ బద్ధమైన పోరాట రూపాల ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలమన్న నమ్మకం ఉన్న వారే కమిటీలకు, పార్టీ కార్యకర్తలకు నాయకత్వం వహించే అలవాటు మొదలైంది. ప్రజలలో నెమ్మదిగా సోషలిస్టు భావజాలాన్ని నాటడం ద్వారా అభివృద్ధి చెంది, నెమ్మదిగా అయినా తప్పనిసరిగా కాంగ్రెస్ ప్రభుత్వస్థానంలో వామపక్ష పార్టీల, శక్తుల కూటమిని నిలుపుతుందన్న ఆలోచన, పార్టీ ఆలోచనలలో, కార్యక్రమాల లోప్రధానమైన స్థానం పొందింది. ఇదే ఆలోచన పార్టీ కార్యక్రమాలను ప్రజా రంగాలలో చేసే పని నుండి పార్లమెంటరి పని వైపుకు క్రమంగా మరల్చింది. ఇవే పార్టీ నాయకుల, కార్యకర్తల పనిలో, జీవనంలో నెమ్మదిగా మార్పులను తెచ్చాయి."

1957లో 12 పార్టీలు చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టినట్టు నివేదిక ఆత్మ విమర్శనా పూర్వకంగా అంగీకరించింది. "సంస్కరణ వాదులు మార్క్సిజంలోని విప్లవతత్వాన్ని, కార్మికవర్గంలో, ముఖ్యంగా సాధారణ శ్రామిక ప్రజలలో సోషలిజం పట్ల ఉన్న నమ్మకాన్ని చిదిమి వేసే ప్రయత్నం చేశారు. వారు కార్మికవర్గ విప్లవం యొక్క చారిత్రక ఆవశ్యకతను గాని, పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిజం వైపుకు పరివర్తన చెందే క్రమంలో కార్మికవర్గ నియంతృత్వాన్ని గాని అంగీకరించరు. మార్క్సిస్టు– లెనినిస్టు పార్టీ నాయకత్వం వహించడాన్ని, కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాలను, లెనిన్ బోధించిన పార్టీ నిర్మాణ సూత్రాలను, అన్నిటికన్నా మించి కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని వారు అంగీకరించరు. కమ్యూనిస్టు పార్టీని ఒక మిలిటెంట్ విప్లవ పార్టీ నిర్మాణం నుండి ఒక విధమైన చర్చా సంఘంగా మారుస్తున్నారు" అని పేర్కొంది. "పార్టీ నిర్మాణంలో ఉన్న సంస్కరణవాదాన్ని తుదముట్టించాలంటే "ఉత్సాహభరితమైన పిలుపునివ్వాలని" నివేదిక మహాసభను కోరింది.

పార్టీకి వచ్చిన ఓట్ల ఆధారంగా పార్టీ సభ్యత్వం పెంచాలని, మూడంచెల నిర్మాణం పార్టీలో కొనసాగాలని నిర్మాణ నివేదిక కోరింది. పార్టి నుండి పూర్తిగా తొలగించాలన్న ధోరణులను కొనసాగించాలని కోరటం ద్వారా మహాసభ సంస్కరణవాద ప్రభావాన్ని ప్రతిబింబించింది.

అందువలన ఆరో మహాసభ రాజీ మహాసభ; పార్టీని విభజించిన సైద్ధాంతిక, రాజకీయ అంశాలేవీ పరిష్కరించబడలేదు. కేవలం 1962లో జరిగే సాధారణ ఎన్నికలలో అనుసరించవలసిన ఎత్తుగడల విషయంలో ఒక విస్తృతమైన అవగాహన మాత్రం కుదిరింది.

**(అనువాదం: కె ఉషారాణి)**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume: 16, issue : 9 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Ra. 10/- Total Pages : 36

# ఆరోగ్యం మీద ఖర్చులో పేద, ధనిక దేశాల మధ్య తీవ్ర అంతరాలు




ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో ధనిక దేశాలకూ, పేద దేశాలకూ మధ్య అంతరాలు చాల హెచ్చు స్థాయిలో ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన వివరాలు తెలుపుతున్నాయి. కరోనా మహమ్మారి రాక ముందు 2019లో ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 8.5 లక్షల కోట్ల డాలర్లు (సుమారు 630 లక్షల కోట్ల రూపాయలు) ఆరోగ్యం కోసం ఖర్చు చేయడం జరిగింది. ఇది మొత్తం ప్రపంచ జిడిపిలో 9.8 శాతం. అయితే ఇందులో ధనిక, పేద దేశాల మధ్య అంతరం చాలా తీవ్రంగా ఉందని డబ్లుహెచ్ఓ తెలిపింది. ఆరోగ్యం మీద ఖర్చయిన మొత్తం 8.5 లక్షల కోట్ల డాలర్లలో 80 శాతం సొమ్ము కేవలం కొద్దిపాటి ధనికి దేశాల్లోనే ఖర్చు పెట్టారనీ, పేద దేశాల్లో ఆరోగ్యం మీద ఖర్చు చాలా తక్కువగా ఉన్నదని తెలిపింది. ఇంకో విషయం ఏమంటే ధనిక దేశాలతో పోలిస్తే పేద దేశాల్లోని ప్రజలు ఆరోగ్యం కోసం తమ జేబులోనుండి చాలా ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. పేద దేశాల్లో ప్రజలు ఆరోగ్య ఖర్చుల్లో 44 శాతం సొంత జేబుల్లోనుండి ఖర్చు చేస్తుండగా 29 శాతం బయటి నుండి సహాయం రూపంలో అందుతోంది. అదేసమయంలో ధనిక దేశాల్లోని ప్రజలకు అయ్యే ఆరోగ్య ఖర్చుల్లో 70 శాతాన్ని ఆయా ప్రభుత్వాలు భరిస్తున్నాయి.

ప్రభుత్వ ఖర్చులో ఆరోగ్యం మీద అయ్యే ఖర్చు వాటా ధనిక దేశాల్లో పెరుగుతోంది. మధ్య ఆదాయ దేశాల్లో స్థిరంగా ఉంది. పేద దేశాల్లో తగ్గి పోతోంది. ప్రపంచంలో అత్యంత దనికమైన 29 దేశాల్లో ప్రజల ఆరోగ్యం మీద ఖర్చు 2000 సంవత్సరంలో 2,923 డాలర్లు (జిడిపిలో 7 శాతం) నుండి 2019 నాటికి 4,491 డాలర్లు (జిడిపిలో 9 శాతం)కు పెరిగింది.

కరోనా మహమ్మారి వచ్చిన తరువాత ప్రపంచ వ్యాపితంగా ఆరోగ్యం మీద ఖర్చు పెరగాల్సింది కాస్తా 2020లో 0.1 శాతం తగ్గిందని డబ్ల్యుహెచ్ఓ తెలిపింది. ధనిక దేశాల్లో ఆరోగ్య రంగం మీద ఖర్చు గణనీయంగా పెరిగింది కానీ పేద దేశాల్లో బాగా తగ్గడంతో మొత్తం మీద తగ్గుదల కనిపిస్తోంది.

ఇతర దేశాలతో పోలిస్తే భారత దేశంలో ఆరోగ్యం మీద ఖర్చు చాలా తక్కువగా ఉన్నది. 2021 నవంబర్ లెక్కల ప్రకారం భారత దేశ జిడిపిలో 3.6 శాతం ఆరోగ్యం మీద ఖర్చు చేస్తున్నారు. దీనిలో ప్రజలు తమ జేబుల్లోనుండి చేస్తున్న ఖర్చే ఎక్కువ. అమెరికా జిడిపిలో(16.9 శాతం) జర్మనీ (11.2 శాతం), ఫ్రాన్స్ (11.2) జపాన్ (10.9 శాతం) ఆరోగ్యం మీద ఖర్చు చేస్తున్నదానితో పోలిస్తే భారత దేశం చేస్తున్న ఖర్చు చాలా తక్కువ.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..............................

వీధి..............................

గ్రామం..............................

మండలం లేదా పట్టణం..............................

జిల్లా..............................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao,